# వ్యాసములు


| | | |
|---|---|---|
| 1. | అమృత సందేశము | 3 |
| 2. | ఆశ్రమ సంపదలు | 5 |
| 3. | ఎన్నో పనులు | 12 |
| 4. | కృత నిశ్చయుడవగుము | 16 |
| 5. | చిరస్మరణీయమగు చిన్న అనుభవము | 18 |
| 6. | జన్మదిన సందేశము - జపమాల (85వ సం॥) | 21 |
| 7. | జన్మదిన సందేశము - 21-1-1954 | 23 |
| 8. | జన్మదిన సందేశము-(117వ సం॥) | 27 |
| 9. | జన్మదిన సందేశము - ప్రతిదినము జన్మదినమే | 28 |
| 10. | జన్మదిన సందేశము - జన్మదినము (86వ సం॥) | 31 |
| 11. | జన్మదిన సందేశము | 33 |
| 12. | జన్మదిన సందేశము - విశ్వజన్మదినం | 36 |
| 13. | జయ జయ రామకృష్ణ హరి ఓం | 37 |
| 14. | జ్యోతిర్మయ కిరణములు | 38 |
| 15. | జీవితము యొక్క విలువ (విపులంగా) | 56 |
| | -సంక్షిప్తంగా స.త. 108 | |
| 16. | నావద్ద ఆశ్రమములో నుండువారివల్ల | |
| | నేను ఆశించునదేమి ? | 60 |
| 17. | నీటిబుగ్గవంటి జీవితము | 66 |
| 18. | దైవము | 69 |

| | | |
|---|---|---|
| 19. | దైవానుభవము (విపులంగా) సంక్షిప్తంగా సత. 118 | 71 |
| 20. | పశ్చాత్తాప ప్రార్ధన | 77 |
| 21. | మనన వాక్యములు | 78 |
| 22. | రక్తము | 86 |
| 23. | వజ్రోత్సవ సందేశము | 89 |
| 24. | వ్యర్థమని యెంచిన మూడు దినము లెవ్వి ? | 92 |
| 25. | సందర్శకులకు సందేశము | 96 |
| 26. | శాంతిప్రార్ధన | 97 |
| 27. | శ్రీసాయి పూజ | 100 |
| 28. | శ్రీమతి సరోజినీదేవి జన్మదిన జ్ఞాపకార్ధంగా ఇచ్చిన సందేశం | 122 |
| 29. | మంత్రాత్మకమగు ఓంకార మహిమాభివర్ణనము | 125 |

## అమృత సందేశము (మృత అమృత జీవులకు)

ఈ మధ్యనేలనోగాని, నా మనస్సు జీవించి యున్న వారి శ్రేయస్సును, చనిపోయినవారి శ్రేయస్సును గూడ కోరుచుండుటచే, యీ లోకములో జీవించి యున్నవారు హెచ్చుమంది గలరా, చనిపోయినవారు హెచ్చుగా ఉందురా, అనెడి సందేహం తరచు ఆంతర్యమున కలుగుచున్నది. దూరదృష్టిలేని మానవుడు బ్రతికి యున్నవారి సంఖ్యయే హెచ్చుగా యున్నదని జవాబు చెప్పును. ఏలన ఏవైపు జూచినను, బ్రతికి యున్నవారే గానవచ్చు చుండిరి. ప్రపంచము పుట్టినప్పటినుండియు చనిపోవుచున్న వారి సంఖ్య లెక్కకుమీరి యుండునుగదా అనిన, సమాధానముగా రోజూ పుట్టుచున్న వారి మాట యేమి యనుశంక కలుగవచ్చును.

ఎటులైనను నామట్టుకు నేను దీర్ఘముగా విచారణచేసి, జీవించియున్న వారి సంఖ్య అతి అల్పమనియు, చనిపోయినవారే అసంఖ్యాకులుగా ఉండిరనియు నిర్ణయమునకు వచ్చితిని. నా యీ నిర్ణయమునకు మరియొక ప్రబలమైన, యథార్థమైన అంశము నాకు తోడ్పడుచుండెను. అది యెద్ది అనగా, బ్రతికి యున్నవారి నందరినీ మనము వాస్తవముగా జీవించియున్న వారే అని నిర్ధారణ జేయుటకు వీలులేదు. ఆత్మజ్ఞానము గలిగిన మానవు డొక్కడే విశ్వప్రేమతోనిండి జీవించు చుండును. తక్కిన వారందరును బ్రతికి యున్నను చనిపోయినవారితోనే సమము. ఇట్టి వారినే జీవన్మృతులు అందురు.

కడుదుర్లభమైన మానవ జన్మను పొందియు, జ్ఞానశూన్యులై, ప్రేమ యనెడి వాసనయైనను లేకుండ, ఈర్ష్య, అహంకారము, దర్పము, కక్ష, క్రోధము మొదలైన అనేక దుర్గుణములతో నిండియున్న మానవుడు బ్రతికి యుండియు, చనిపోయిన వారితోనే సమము గదా. ఇట్టి వారందరినీ మనము చనిపోయిన వారిలోనే లెక్కవేసిన, నిజముగ జీవించియున్న మనుజులు, చాలా తక్కువగా ఉందురని వేరుగా చెప్పనవసరములేదు గదా.

ప్రియపాఠకా ! చనిపోయిన వారియు, బ్రతికియున్న వారియు మాట అటులుంచి నీ గతిని, నీ ఆంతర్య హృదయమును నీవు బాగుగ పరీక్షించు

కొని, విమర్శదృష్టితో చూచుకొనుము. నీవు శరీర జ్ఞప్తితో, బ్రతికి యుండియు చనిపోయినట్లు ఉంటివా, లేక ఆత్మజ్ఞప్తితో విశ్వప్రేమతో నిండి ఆదర్శప్రాయ మగు అమూల్యమగు మానవ జీవితము, కాలము వ్యర్థము జేయకుండ జీవించుచుంటివా ?

శ్లో॥ ఆశయా బధ్యతే లోకః కర్మణా బహుచింతయా
ఆయుక్షీణం నజానాతి తస్మాజ్జాగ్రత జాగ్రత ॥

తా. మలములోని పురుగులవలె, బావిలోని కప్పవలె, అంధకార ములో అజ్ఞానములో నిన్నగాక మొన్నవచ్చి, రేపో మాపో పోనున్న శరీరమునే శాశ్వతమని భ్రమపడి, నిత్యసుఖము నిచ్చు దానినిగా, నీ సర్వస్వముగా చేసుకొని, జీవించుచుంటివా ? నీ గాఢ నిద్రనుండి లెమ్ము! శరీర జ్ఞప్తికి స్వస్తి చెప్పుము; నీ స్వస్వరూపమును తెలిసికొనుటకు మేల్కొనుము ! అఖండ కోటి దివ్యతేజ స్వరూపంబైన నీ దివ్య తేజస్సును వ్యక్తపరచుము. అప్పుడే నీవు చనిపోయిన వారికి, జీవించిన వారికి గూడ నీ ఆదర్శనీయమైన జీవితముచే తోడ్పడ గలవు. మృతామృతజీవులు నీ సేవకై వేచియుండిరి. మేల్కొని స్వార్థత్యాగముతో సేవజేయుట కిదియే సమయము. ఏలయన నేడే మనది. రేపు మనది గాదు గాన, నేడే ఈ క్షణమునందే నీలో నిద్ర బోవుచున్న ఆత్మశక్తిని మేల్కొల్పి నీ స్వస్వరూపానందముతో మానవ సేవను చేయుచు, లోకశాంతికి తోడ్పడెదవు గాక !

మ. నిన్నే యన్నిట నేనరుండు కనునో నీ ప్రీతికే నిచ్చలు
బున్నెం బేపురుషుండు సల్పెడినో, నీ మోముంగనుంగొంచుదాఁ
దిన్నంగా నెవడాచరించునో క్రియల్, దేవా ! యతండే భవ
త్సాన్నిధ్యంబున కర్హుడౌను;పరమాత్మా ! భక్త చింతామణీ.
సర్వములో దైవమును గాంచెడి వారి జీవితములు ధన్యవంతములు.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు !

# ఆశ్రమ సంపదలు

క్రిందటి నెల శాంతి పత్రికలో ఆశ్రమ అవస్థలు, అనెడి వ్యాసమును మీరు చదివి చింతించియే వుందురు. ఇప్పుడు ఆశ్రమ సంపదలు వ్రాసి, మీ అందరకూ ఆనందమును, కలిగించుటకు కోరుచుంటిని. నా ఆంతర్య భావనలు, నా ఆశయములు ఉత్సాహము, ఆనందము గలిగించెడి వైనను, నిరుత్సాహము చింతను కలిగించెడివైనను, మీ అందరితో పంచుకొనుటయే నా స్వభావమై యున్నది. ఆశ్రమ అవస్థల వ్యాసములో అచ్చువేయబడిన చక్కని పద్యము నాకెంతయో ఆనందమును, ఉత్సాహమునేగాక బలమును నూతన శక్తిని గలిగించుచుండునుగాన, మరల ఇచ్చట ప్రచురించుటకు నా మనస్సు కోరుచున్నది.

గీ॥ వచ్చునాపదలవ్వి యాపదలుగావు
వచ్చు సంపదలవ్వి సంపదలుగావు
పరమ పురుషు మరచుటే, యాపదలుసుమ్ము
పరమ పురుషు దలచుటయే సంపదలుసుమ్ము.

తత్కాలికముగా వచ్చుచు, పోయెడి మేఘములను గుర్తించుచు బాధపడుట కంటె స్థిరమైన శాశ్వతమైన సూర్యభగవానునే గుర్తించి తేజస్సును స్థిరము జేసుకొని, శరీరమును, మనస్సును, హృదయమును నూతనమైన దివ్యతేజస్సుతో నింపుకొనుచు తరించెదముగాక, గమ్యస్థానమును చేరెదముగాక !

మాయ యొక్క ప్రభావముచే, తెల్లని వస్త్రముమీద, చిన్న సిరా మచ్చ బడిన, వస్త్రము మీదనున్న స్వచ్ఛమైన తెల్లదనము నంతను మరచి, అల్పమైన చిన్నసిరా చుక్కనే గుర్తించుచు, వెర్రి మానవుడు బాధపడుచుండును.

నీలగిరిలో నూతనముగా కట్టబడిన, ప్రార్థనాలయమును జూచుచు, అందుకూర్చొని, ధ్యానించుచుండ, దైవకృపకు కృతజ్ఞతతో తలవనితలంపుగా ఆనంద భాష్పములు వచ్చుచుండును. ఈ ప్రార్థన మందిరమే దగ్గర దగ్గర లక్షరూపాయలు విలువ వుండును. సిమ్మెంటుతో చేయబడిన విశ్వమత

చిహ్నము శ్రీకృష్ణ, శ్రీబుద్ధ, శ్రీ క్రీస్తు గాంధీజీ మొదలైన మహాత్ముల విగ్రహములు, (ఆల్టరు) దైవ పీఠము ఎలక్ట్రిక్ బల్బులతో అలంకరించ బడినది. ఆ విశ్వమత పీఠము స్వయముగా జూచి ఆనందించ వలసినదే గాని, యీ చిన్నమాటలతో వర్ణించుటకు వీలులేదు. దాని చెంతనేవున్న పేరితోట ప్రతీ సంవత్సరము 1500రూ॥ ఆదాయము నిచ్చుచు, శాంతి నిలయమును పోషించుచున్నది. శాంతి నిలయములోనె, చక్కని ఆరోగ్యము నిచ్చెడి ధార ప్రవహించు చుండెను. చల్లని మాధుర్యమైన ఆరోగ్యము నిచ్చెడి జలముతో ఒకబావి గూడ కట్టబడెను. కొదువ ఆశ్రమ భూమి, విలువైన పాత ప్రార్ధనాలయము, తదితర కట్టడములు, పుష్పతోటలు, ఇతర పండ్ల చెట్లు, వేదికలు వగైరాలు మరొక లక్షరూపాయలు విలువ యుండును. ఇది ఒక గొప్ప సంపదగాదా !

ఇక మాతృ స్థానమైన తోటపల్లి ఆశ్రమము 58 సంవత్సరముల క్రిందట స్థాపించబడి, గురుకులము, అనాధలగు వృద్ధుల గృహము, అచ్చు ఆఫీసు, ఆనుపత్రి మొదలైన కార్యకలాపములతో వివిధమైన భవనములతో, యోగులు, స్వాములు ధ్యానము జేయుటకు రెండు గృహములతో, భక్తులందరికి తోడ్పడెడి శివాలయము. దానిని చేరుటకు మెట్లుతో, యింకను అనేక విధములైన రామతీర్థకళాశాల వంటి భవనములతో, నలుబది మంది అవతార పురుషులు, మహాత్ముల శిలా విగ్రహములతో కొన్ని లక్షల రూపాయల విలువ యుండునని ఆశ్రమ సందర్శకులు అంచనా వేయు చుందురు. ఇవన్నియు సంపదగలుగావా ?

ఇంకను వాల్టేరు ఆశ్రమం వున్నది. అది గూడ 200 మంది బాల, బాలికలతో 15 మంది గురుకుల విద్యార్థులతో వృద్ధి అగుచున్నది. దాని విలువ గూడ లక్షరూపాయలు పైగా వివిధ భవనములతో కొబ్బరి మొదలైన వృక్షములతో వుండునని ఆశ్రమభక్తులు చెప్పుచుందురు. వాల్టేరు ఆశ్రమం చెంత పర్వతము మీదయున్న శిధిలమగుచున్న భవనములతో కైలాస ఆశ్ర మము మాటయేమి ? యుద్ధపురోజులలో కొన్ని లక్షలు వ్యయముజేసి కట్టబడిన, భవనములు. రెండుమైళ్ళ రోడ్డు యున్నది. ఆ విలువైన భవనములు యుద్ధము పూర్తికాగానే, శిధిలము చేయబోవుచుండ, శాంతిస్థాపనకై దైవము శాంతి ఆశ్రమమునకు యేర్పర్చెను.

ఆశ్రమాభిమానులైన డాక్టరు శ్రీ చెన్నారెడ్డిగారు కైలాస ఆశ్రమంలో, కుటుంబ సహితముగా నాలుగు రోజులువుండి, అచ్చట నీటి వసతి లేనం దున 40 వేల రూపాయలు పైపుల ద్వారా జలము వచ్చుటకై ప్రేమతో యేర్పర్చినను, విశాలదృష్టిలేని, దైవ పరితాపములేని విశాఖపట్టణం వృద్ధిని కోరుచున్న, పట్టణయజమానులు ఆ పెద్దమొత్తమును వేరుగా వినియోగించి దైవపనికి శాశ్వతమైన హాని జేస్తిరనే చెప్పవలసి వచ్చుట విచారకరము.

ప్రపంచమంతయు నాలుగు సార్లు శాంతి ప్రచారము చేయుచు తిరిగితిని గాని లోకములో యెచ్చటను, ఏ దేశములోను అట్టి సౌందర్య మైన, ఆత్మవుత్తేజము నిచ్చెడి, ఏకాంతమైన తావును నేను చూడలేదనే తలంతును. కైలాసము యొక్క శిధిలావస్థకు, కండ్లు వుండియు చూడజాలని, విశాఖపట్నము పెద్దల అల్పదృష్టిని తలంచి విచారించుచుందును. ఎప్పటికైనా దైవపరితాపం, లోకశాంతిని కోరెడి కొందరి భక్తుల హృదయము లలో దైవము ప్రవేశించి, శిధిల మౌచున్న కైలాసమును– కైలాసముగా, విశ్వనాథుని నిలయముగా జేయుగాక ! ప్రస్తుతము కైలాసము శిధిలావస్థలో యున్నను శిధిలమౌచున్న యీ విలువైన భనవములన్నియు పర్వతము మీద సముద్రముచే మూడువైపులు, పర్వతములచే నాల్గవ వైపు చుట్టుబడి యున్న యీ కైలాసము గూడ గొప్పసంపదయేగదా ! విజయనగరం మహారాజావారు యీ కైలాసమును తమకు వ్రాసియివ్వమని 10,15 వేల రూపాయలు యిచ్చెదనని రెండు సంవత్సరములు తిరిగిరి, దానికై తోటపల్లి ఆశ్రమం గూడ రెండుసార్లు వచ్చిరి. ఆశ్రమ సంపదలు దైవ పరితాపముతో యున్న మానవుల హక్కు అని, ఒక్క వ్యక్తికినిచ్చుట యెన్నడూ జరుగదని చెప్పగా వారు నిరాశను పొందిరి.

ప్రియమైన ఆత్మసోదరీ, సోదర స్వరూపులారా ! శ్రమ తీసుకొని కైలాసమును ఒక్కసారి మీరు దర్శించిన, కైలాసము యొక్క గొప్పదనమును, నేను వ్రాయు వ్రాతల యదార్థము మీరుగూడ గ్రహించగలరు. అచ్చట ఏ ప్రార్థన, ధ్యానము చేయకుండగనే, మీరు దైవ సన్నిధిని అనుభవించెదరు. కైలాసమిప్పుడు శిధిలావస్థలో యున్నను, నేనచ్చట ఆరు సంవత్సరములు మౌన వ్రతములో యుండి తపస్సు జేయుచుండ ఎంతోమంది మహారాజులు,

రాణీలు, జమీందార్లు, ధనవంతులైన లక్షాధికార్లు గొప్ప గొప్ప వుద్యోగస్తులు, స్వాములు, సన్యాసులు, యోగులు, హిందూదేశము నుండియేగాక. వివిధ దేశములనుండి గూడవచ్చి ఆ వాతావరణమును అనుభవించి ఆనందించిరి.

కీర్తి శేషురాలైన సోదరి అమృతకౌరు గూడ కైలాసమునకు వచ్చి ఎంతయో ఆనందించిరి. ఒక్కమారు పి.యం.జి. పోస్టు మాస్టరు జనరల్, గూడ పెద్దపెద్ద ఉద్యోగస్తులతో కైలాసమును దర్శించి, ప్రార్ధన, ధ్యానాదులతో గడిపి అట్టి ఏకాంతమైన కైలాసమును చూచి ఆనందించిరి. శాంతి ఆశ్రమ అధ్యక్షులు, ఆదర్శనీయులైన భక్తులు శ్రీ తెన్నేటి విశ్వనాధం గారు గూడ చాలసార్లు కైలాసమునకు గొప్ప భక్తులతో మినిస్టర్లు, జిల్లాకలెక్టర్లుతో వచ్చి కొనియాడిరి. కాని కైలాసము యొక్క దురదృష్టము చేతనో లేక విశాఖపట్టణ ప్రజల ప్రవృత్తి కర్మచేతనో అనేక మంది దేశభక్తులు, లోక ప్రసిద్ధి చెందిన మహనీయులు కైలాసమును దర్శించినను, కైలాసమును వృద్ధిజేయుటకు, దానిని లోకమునంతకు అంతర్జాతీయ శాంతికేంద్రముగా శాంతి పిపాసకు లకు శాంతినిలయముగా జేయుటకు, యింతవరకు ఒక్కరికైనను దైవ పరితాపము శాంతి స్థాపనకై దైవానుభవమునకై అత్యుత్తమమైన, పట్టుదల లేనందున కైలాసము–స్వర్గతుల్యమైన కైలాసము, రోజు రోజుకు శిధిలా వస్థలోయుండి అధోగతి పాలగుట విషాదకరము. లోకములోనున్న ధనము నంతను పొందగలిగి తనకు ఆత్మశాంతి నిచ్చెడి కైలాసమును పోగొట్టుకున్న ఏమి లాభము ?

What is the use of gaining the whole world losing your own SOUL PEACE ?

సంపదలకెల్ల గొప్పసంపద దైవమే ! ఏకాంతములో దైవమును చేరు టకు తోడ్పడెడి, కైలాసము, దైవమును చేరుటకు తోడ్పడెడి గొప్పసంపదయే గదా ! పరోపకారార్థ మిదం శరీరము అని శాస్త్రములు పల్కును. ఈ శరీరము ఇతరులసేవ జేయుటకై యివ్వబడినని గుర్తించి, స్వార్ధమును మనతోడి సోదరీ సోదరులకు మన శక్తికొలది సేవజేయుచు తరించెదము గాక !

Heavy is the Head that wears the crown కిరీటము ధరించిన శిరస్సు చాలా బరువుగా నుండునట. ఆశ్రమ బాధ్యతలు – వాటి అవస్థలలోనైనను, సంపదలలోనైనను స్వార్ధరహితముగా నిర్వహించుట, అంత సులభముకాదు. మనకున్న దానిని ఇతరులతో పంచుకొనుట దేశవృద్ధికి, లోకశాంతికి పాటుబడుటలోనే నిజమైన ఆనందము గలదు. ఆశ్రమ వృద్ధికి లోక కళ్యాణమునకు భక్తులు, ఆశ్రమ శ్రేయస్సును కోరుచు హిందూదేశము నుండియేగాక చైనానుండి, అమెరికా మొదలైన దేశముల నుండి తోడ్పడు చుండ, ఆ ధనమును ఒక బ్యాంకులో వేయగా పన్నెండువేల రూపాయల వరకు అయ్యెను. అది తలచినప్పుడెల్లను, ఇంత పెద్ద మొత్తమును సేవలో వినియోగించకుండ తుప్పుపట్టుచు నిరుపయోగముగా వుండరాదని హృదయము బరువుగా నుండగా ఆ మొత్తమునంతను వివిధ ఆశ్రమముల వృద్ధికి, గురుకుల బాలబాలికల పోషణకు, సర్వము అర్పించి అర్హతగలిగిన, ఆశ్రమ సేవ జేయుచున్న స్వార్ధరహితులకు, నిరుపేదలకు రోగుల మందు లకు వాడగా, ఇంక బ్యాంకులో ఏమి లేనప్పుడు నాకు ఎంతయో తృప్తి ఆనందమును గలిగెను. హృదయబాధ, తలబరువు అంతయు తగ్గెను. మనము దైవమును పూర్తిగ నమ్మిన ఏ రోజుకు కావలసినది ఆ రోజే దైవ మిచ్చును. "లక్షాధికారియైన లవణాన్నమేగాని మెరుగు బంగారము మ్రింగ బోడు" అనెడి పద్యము చక్కనైన గుణపాఠమును బోధించుచున్ననూ ఇంకను స్వార్ధులు తుప్పుపట్టెడి, దొంగలు అపహరించెడి, అశాంతిని కలిగించెడి ధనమునే, దైవమునుగూడ మరచి, రాత్రింబగళ్లు యింకను ధనసేకరణ కొరకే తమ ఆత్మలను అమ్ముకొనుచుండుట చాల విషాదకరము.

భక్తి, ప్రేమ, స్వరూపంబైన, సోదరి సుసేనాగారు అమెరికానుండి వచ్చి, స్వార్ధ రహితమైన సేవ అహర్నిశములు జేయుచు, ఆమె సర్వస్వమును ఆశ్రమ వృద్ధికి అర్పించి, నిరాడంబరమైన సేవ జేయుచుండుట ఇది ఒక గొప్ప సంపదయేగదా ! ఆమె తెలుగులో శాంతి ప్రార్ధన వల్లించి ఇతర భక్తులచే గూడ ఆ ప్రార్ధనను స్మరింపజేయుచుండుట, ఆమె జీవితము సంపదలకు సంపదయేగాక, గొప్ప మహత్తుగా తలంచి ఆనందించు చుందును.

అపారమైన సేవను, అహర్నిశములు, నిరాడంబరముగా చేయుచున్న శ్రీరామారావుగారు, శ్రీరాజాజీ, కె.ఎస్.ఆర్, జ్ఞానేశ్వరి, శాంతి, శేషమాంబ, సీతాదేవి, లక్ష్మి, సీత, వగైరాల స్వార్ధరహితమైన జీవితములన్నియు గొప్ప అమూల్యమైన సంపదలుగానే భావించి దైవకృపకు ఆనందించుచు కృతజ్ఞత జూపుచుందును. గీతలో బోధించునట్లు అవస్థలలో, సంపదలలో సమ భావముతోయుండెడి వారే ధన్యులు.

సీ. తల్లిగర్భమునుండి ధనము తేడెవ్వండు
వెడలి పొయ్యేనాడు వెంటరాదు
లక్షాధికారైన లవణమన్నమె కాని
మెరుగు బంగారంబు మ్రింగబోడు
విత్తమార్జమాన చేసి విఱ్ఱవీగుటె కాని
కూడబెట్టిన సొమ్ము కుడువబోడు
పొందుగా మరుగైన భూమిలోన బెట్టి
దాన ధర్మములేక దాచి దాచి

తే. తుదకు దొంగలకిత్తురో దొరల కవునొ తేనె జుంటీగలియ్యవా
తెరువరులకు ! భూషణవికాస !
శ్రీధర్మపురనివాస దుష్టసంహార!
నరసింహ ! దురిత దూర !

తా. పుట్టినపుడు ధనము తేలెదెవ్వరూ, మరణించునపుడు కూడా ఆ ధనము వెంటరాదు. లక్షాధికారయినా తినేది ఉప్పు అన్నమేగాని బంగారాన్ని తినడు. డబ్బు సంపాదించి పొగరు పెంచుకొనుటేగాని, దాచిన సొమ్మును అనుభవించడు. దాచిదాచి దొంగలకే యిస్తాడో, దొరలపాలే చేస్తాడో యేమో ? కష్టించి సంపాదించి దాచిన తేనెను, తేనెటీగలు బాట సారులకు యిస్తుండవా ! అలాగే.

సంపదలకు గొప్ప సంపద దైవమేగాన, దైవమును పొందుటకు ఈ దుర్లభమైన మానవజన్మలను వినియోగించుచు, దైవమునుండి పిలుపు మనకు రాకుండగనే అనగా మృత్యువు హఠాత్తుగా రాకుండగనే మన శక్తి కొలది జాతి, మత, కుల వివక్షత లేకుండగా, దైవబిడ్డ లందరకు స్వార్థ రహితమైన సేవజేయుచు మనము తరించి, యితరుల తరింపునకు తోడ్పడెదము గాక ! నీలగిరి శాంతి కేంద్రములో యీ మధ్యను జయప్రద ముగా, దైవకృపచే జరిగిన నెలరోజులు వేదాంత సత్సంగములో శిక్షకులకు అనుభవమైన వేదాంతసారమైన యీ క్రింద వ్రాయబడిన అమృత తుల్యమైన, ఉత్తర గీతలోని శ్లోకముతో, వేదాంత శిక్షణాతరగతి ఆనందముగా పూర్తి జేయబడెను. ఈ ఉత్తేజకరమైన శ్లోకము సంపదలకు సంపదగా వేదాంత సారమునంతను, చిన్నమాటలతో సూటిగా, బోధించుచున్నది గాన ప్రియమైన శాంతి పాఠకులతో, మీ అందరితో పంచుకొనుటకు నా అంతరాత్మ తీవ్రముగా కోరుచున్నది. కావున అద్దాని నిచ్చుట వ్రాయుటకు కోరుచు, యీ వ్యాసమును శాంతితో, ఆనందముగా ముగించుచుంటిని.

శ్లో॥ దేహో దేవాలయప్రోక్తో జీవో దేవ స్సనాతన ః
తృజేదజ్ఞాన నిర్మాల్యం సోహం భావేన పూజయేత్ ॥

తాత్పర్యము : దేహమే దేవాలయము, జీవుడే సనాతనముగా దైవమై యుండెను. గాన, దేహభావనను, ద్వంద్వము అనే అజ్ఞానమును, విడచి సోహం–విశ్వప్రేమ భావనచే మహాపూజను, సోహం భావనతో నిరంతరము జేయుచు తరించెదముగాక !

ఓం సర్వేషాం స్వస్తిర్భవతు ।
ఓం సర్వేషాం శాంతిర్భవతు ।
ఓం సర్వేషాం పూర్ణం భవతు ।
ఓం సర్వేషాం మంగళం భవతు ।

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

# ఎన్నో పనులు

స్వర్ణోత్సవము సమీపించుచున్నది. ఎన్నో పనులు చేయవలసి యున్నది. స్వర్ణోత్సవము రాకముందే చేయవలసిన పనులు, ముఖ్యమైన వన్నియు, నేను నెలరోజుల క్రిందటనే ఒక కాగితముమీద వ్రాసి వుంచు కొని, వాటిని రోజూ చూచుచుందును. ఆ కాగితమును ఆశ్రమవాసులకు, ఆశ్రమ కమిటీ మెంబర్లకు, ఆశ్రమాభిమానులకు, వారి సహకారమును, సహాయమును, ప్రార్ధనలు గోరి జూపుచుందును.

కొందరు ప్రేమతో వారి శక్తికొలది తోడ్పడుటకు కోరుచుందురు. మరికొందరు యీ పనులన్నియు అగునా ? అని అనుచుందురు. మరి కొందరు యీ పనులన్నియు యీ స్వల్పకాలములో యెటుల అగునో జూచి తీరెదమన్నట్లు లోలోపల తలచెదరు. సహకారము, సానుభూతి నిచ్చుటకు బదులు కొందరు తెలిసి తెలియక అడ్డు వచ్చెడివారు గూడ వుండుట విచారకరము. వీరికే పానకములో పుడకలన్న సామెత వర్తించునని తలచెదను.

"శ్రేయాంసి బహువిఘ్నాని" అన్నట్లు దైవపనులకే అన్ని విఘ్నములు. పరీక్షలు వచ్చుచున్న రీతిగా, దేశవృద్ధికి, లోక కళ్యాణమునకు శాంతి ఆశ్ర మము జేయుచున్న సేవలో గూడ, కొందరు శుక్రాచార్యులు, శకునిలు మొదటినుండియు లేకపోలేదు. ఐనను ఎన్ని ఆటంకములు అడ్డులు వచ్చి నను, దైవమే దైవపనులకు తోడ్పడు నన్నట్లు సత్యమేవ జయతి గాన యీ యేబది సంవత్సరముల నుండియు, దైవకృపచే భక్తుల సహకారము, సాను భూతిచే ఆశ్రమము దినదినాభివృద్ధిని గాంచుచుండుట ఆనందకరము. పూర్వము బలిచక్రవర్తి వామనమూర్తికి మూడు అడుగుల భూమిని దానము జేయుచుండ శుక్రాచార్యులు కమండలము నుండి నీరు పడకుండ ఆ గొట్టములో దూరెను. సర్వజ్ఞుండైన విష్ణుమూర్తి, అతని కపటమును గ్రహించి, పుల్లతో అడ్డు వచ్చినదానిని పొడవగా, శుక్రాచార్యుని కన్ను పోయెను. అప్పుడు నీరు పడెను. అటులనే అడ్డు వచ్చెడివారు అడ్డు వచ్చుచున్నను, సహకారమిచ్చెడివారు శక్తికొలది సహకారమిచ్చినను,

ఇవ్వకున్నను, దైవ కృపచే, దైవశక్తిచే, దైవసన్నిధిని అనుభవించుచు ఒక్కడినే అన్ని పనులు ఒకే సారి అవ్వకున్నను, ఒక్కొక్కటి ఏకాకిగా నైనను జేయుటకు నిశ్చయించుకొని ఆనందముగా, ప్రతిరోజును, ప్రతి గంటయు, ప్రతి నిమిషమేగాక ప్రతి క్షణమును పూర్తిచేయుటకు నిశ్చయించి తృప్తిని బడయుచుంటిని.

విశ్వనాథమందిరము మెట్లు పూర్తి అవ్వవచ్చెను. నిర్వాణమందిరము వరండా పని భక్తులు పూర్తి చేయుటకు వాగ్దాన మిచ్చిరి. వంటశాల పెంచుటలో, కట్టడమునకు, మరొక భక్తుడు వాగ్దానం జేసిరి. ఇంకను ఆసుపత్రి వార్డులు, మీద పూజామందిరములు, భక్తులందరును సమావేశమై ఉపన్యాసము లిచ్చెడి వేదిక, సగము సగముగా నిర్మింపబడి యున్న భవనములు, కుటీరములు అతిథులుండుటకు పాకలు, పందిళ్లు, వగైరాలు యెన్నియో పూర్తిజేయవలసి యున్నది.

స్వార్థరహితమైన సేవలో దైవమే తోడ్పడి తీరుననెడి పట్టుదలతో నమ్మకముతో ఒక్కొక్కపనియు నెమ్మదిగా ఓపికతో జేయుట జరుగుచున్నది. ఆశ్రమకలాపములు, వాటి తప్పనిసరియైన తాపత్రయములు లెక్కకు మీరి యున్నప్పటికిని, వాటిని పూర్తిజేయుటకు భక్తులందరి సహకారము, సానుభూతి ముఖ్యావసరమై యున్నది.

ఒక్కపని మాత్రము ఎవ్వరి సానుభూతి, సహాయము అవసరము లేకుండగనే ఏకాకిగా నేను ఒక్కడిని, స్వయంకృషిచే నిరంతర దీక్షతో ఏకాగ్రతతో చేసుకొనవలసినదానిని, స్వర్ణోత్సవము జ్ఞాపకార్థముగా పూర్తిజేసి తీరవలెనని కృతనిశ్చయము జేసుకొంటిని.

ప్రశ్న : అది యెద్ది ?

జవాబు : బ్రహ్మానుభవము. ఆత్మసాక్షాత్కారము. ఎప్పుడో గాక ఇప్పుడే ఇచ్చటనే యీ క్షణమునందే, అపరోక్షముగా, అద్దానిని ఇప్పుడు అనుభవించుచు, నిరంతరము తైలధారవలె అనుసంధానము జేయుట.

మీ అందరితో పంచుకొనుట, ఒక్కొక్క సమయమందు నేడురానున్న

వారు, రేపు వచ్చెదనన్నప్పుడు, వాగ్దానములు జేసినవారు వారి వాగ్దానము లను మరచినప్పుడు, స్వర్ణోత్సవము జ్ఞప్తియే లేకుండ జీవించెడి కొందరు కమిటీ మెంబర్ల నిస్పృహ, అశ్రద్ధ జూచిన, ఈ స్వర్ణోత్సవమునకు ఇంకను నెల రోజులు వ్యవధి వున్నను, మరొక్క స్వర్ణోత్సవము మరల 50 సంవత్సర ములకు వచ్చునుగదా, అప్పటికి ఎవ్వరు తోడ్పడినను, ఎవ్వరు తోడ్పడ కున్నను, దైవకృపచే నెమ్మదిగా ఓపికతో తలచిన పనులన్నియు తప్పక పూర్తికాగలవని యీ మధ్యను రెండో స్వర్ణోత్సవము అనగా 100 సంవత్సర ములకు రానున్న శతవర్షముల వార్షికోత్సవమునకై జూచుచు తృప్తిని పొందు చుందును. మొన్నను లెక్కవేసుకొని జూచుకొనగా శతవర్షముల వార్షికోత్స వము మరల జనవరి 21వ తారీఖు 2017వ సంవత్సరమున వచ్చునని లెక్కవేసుకొంటిని. అప్పటివరకు మీరు జీవించి యుందురా అని కొందరు ఆశ్రమ భక్తులు, ప్రశ్నించిన: నేనుగాకున్న మీరైనా జీవించి యుందురు గదా అని వెంటనే సమాధానము వచ్చి ఆనందించుచుందును.

మీరు లేనిదే, యీ స్వర్ణోత్సవములు శత సంవత్సర వార్షికోత్సవములు ఏలనని ప్రశ్నించిన, స్వామి చాలకాలము క్రిందనే చనిపోయెను. మీలో ఇప్పుడు ఓంకారమే జీవించుచుండెను. అని జెప్పుచు ఆనందించుచుందురు.

గాన మీలో జీవించియున్న ఓంకారమును ప్రతిక్షణములో వ్యక్తపర చుచు మీరు దినదినాభివృద్ధిని గాంచుచు మీ ఆశ్రమవృద్ధికి, దేశవృద్ధికి, పాటుపడుచు లోకశాంతిని కోరుచు చేయబడు ఆశ్రమ పనులన్నియు ఒక్కొక్కటి వీలయినంత త్వరలో పూర్తి యగుటకు మీ ప్రార్థనలతో నయి నను సహకారము చేయుదురుగాక ! ఏబది సంవత్సరములు నుండియు అహర్నిశములు లోకశాంతిని కోరుచు సేవ జేయుచున్న శ్రీ శాంతి ఆశ్రమ స్వర్ణోత్సవము జ్ఞాపకార్థముగా (ఆశ్రమమునకు మూలధనము లేనందున) 116, 100, 58, 25, 10, 5 రూపాయల రసీదు పుస్తకములు చాలగా అచ్చు వేయించిరి. ఏ కొద్ది ఆశ్రమాభిమానులో తప్ప, తదితరులు, ఆశ్రమ మెంబర్లు శ్రద్ధ వహించనందున ఆ రసీదు పుస్తకములన్నియు అటులనే జాగ్రత్తగా దాచబడి యున్నవి.

ఇంకను సమయము, సావకాశము వున్నది గాన, పాత భక్తులు, క్రొత్త భక్తులు, ఆశ్రమాభిమానులందరును యెవ్వరెవ్వరి శక్తి ననుసరించి, వారి బంధుమిత్రుల నుండి సహకారమును గోరి, ఈ స్వర్ణోత్సవమును జయప్రదముగా జేయుటలో మాకు తోడ్పడ గోరెదము.

స్వర్ణోత్సవము రసీదు పుస్తకములు కావలసిన ఆశ్రమాభివృద్ధిని గోరు భక్తులు, కుమారి జ్ఞానేశ్వరికి వ్రాసిన బడయగలరు. ఇదియే మీ వృద్ధిని ఆశ్రమ వృద్ధిని ప్రతి శ్వాసతో, ప్రతిక్షణము కోరుచున్న మీ ఓంకారుని నిరంతర ప్రార్తనయై యున్నది.

శాంతి ఆశ్రమవాసులు, ఆశ్రమాభిమానులు ఆశ్రమ భక్తులందరి శాంతిని కోరుచు ప్రేమతో అర్పణ.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

## కృతనిశ్చయుడ వగుము

1. స్వవృద్ధికయి చాలాకాలము వినియోగించు కొనుటకును, యితరులను విమర్శించుటలో ఒక్కక్షణకాలమైనను వ్యర్థము చేయ కుండుటకును–

2. గతించిన తప్పులను మరచుటకును, మంచిని మాత్రమే ముందు చేయుటకును–

3. విచారమునకు అతీతుడవగుటకును, క్రోధమునకు దూరుడవగుట కును, భయమునకు అజేయుడవగుటకును, బాధానుభవమునకు సంసిద్ధుడవగుటకును–

4. పరమ పవిత్రమైన వాటినే తలచుటకును, అత్యుత్తమమైన దానినే చేయుటకును, పరమోత్తమమైన దానినే గోరుటకును–

5. ప్రతిదానియొక్క మంచిని మాత్రమే గ్రహించుటకును, నీకుగల లోక కళ్యాణవాంఛను నిజము చేయుటకును–

6. ఎట్టి సమయములలోను మనశ్శాన్తిని కోల్పోనంత ధృఢచిత్తము గలవాడవగుటకును–

7. నీలో నున్న పరతత్త్వమునకు దాసుడవై యున్నంతవరకు సర్వ ప్రపంచము నీవశమై యుండునని పూర్ణముగా నమ్ముటకును–

8. నిరంతరము ఆత్మచింతన గలవాడగుటకును, "ఆత్మవత్సర్వ భూతానీ" అను నీ అనుభవమును ప్రపంచమునకు చాటి చెప్పుటకు మాత్రమేగాక మహోన్నతమైన నీ పవిత్రాచరణ మూలముగా ప్రత్యక్షము

చేయుటకును–

9. నిరంతరము ఆనందమయమైన ముఖవికాసమును గలిగి యుండుటకును, ప్రతివారికి చిరునగవుతో సమాధానము చెప్పుటకును–

10. నీ జయమునకయి నీవెంతటి ఆసక్తి గలిగియుందువో అట్టి ఆకాంక్షనే యితరుల విషయమునగూడ కలిగియుండుటకును–

11. నిన్ను కలిసికొను ప్రతివారితోను ఆయురారోగ్యైశ్వర్యములను గూర్చి మాత్రమే ముచ్చటించుటకును–

12. నీ మిత్రులందరకును ఆత్మస్వరూప జ్ఞానమును ప్రబోధించి, వారి యొక్క శాశ్వతత్త్వమును అనుభవింప జేయుటకును కృతనిశ్చ యుడవగుము.

ఓం శాన్తి శాన్తి శాన్తిః

# చిరస్మరణీయమగు చిన్న అనుభవము

(శరీరమును విడిచి చనుట)

(1974 మే 24వ తేదీ రాత్రి 8 గం॥ జరిగిన విచిత్రానుభూతి)

నా ఎనుబదియవ సంవత్సరమున పొందిన, చిరస్మరణీయమగు యీ విచిత్రానుభూతిని ప్రాక్పశ్చిమమునగల ప్రేమాస్పదులందరితోడను పంచుకొనుటకు నా హృదయము కోరుచున్నది. నన్ను ప్రేమించుచు, నా క్షేమమును కోరుచున్న వారందరితోడను నా అనుభవము పంచుకొనదలచు చుంటిని.

ముఖ్యముగా పూజ్య శ్రీస్వామి చిదానందజీ, మాతా కృష్ణాబాయి, శ్రీ స్వామి సచ్చిదానందజీ, పూజ్యశ్రీ స్వామి కృష్ణానందజీ,స్వామి బ్రహ్మానందజీ, మాతా సరస్వతీదేవి (అమెరికా), డా. పిచ్చెయ్యగారు, డా.ఎమ్.ఎస్. రావుగారు, శ్రీ భాష్యం అప్పలాచార్యులుగారు, శ్రీతారకంగారు మొదలగు ప్రేమాస్పదులతో నా అనుభవమును పంచుకొని వారి అభిప్రాయములు తెలుసుకొనవలెనని యున్నది.

ప్రాపంచిక మానవులకు యీ సంఘటన సామాన్యముగ తోచినను, యీ చిన్న అనుభవమునుండి ఎన్నియో సంగతులు నేర్చుకొనుటకు నా హృదయము కోరుచున్నది.

కోటగిరిలోని లక్ష్మీవిహార్ యందు సాధు మార్కండేయ యాజమాన్య ములో సంధ్యా సమయమున ప్రతిదినము గావింపబడు ప్రార్ధన, భజన కార్యక్రమములు జరుపబడుచుండెను. అందరు ఆ ప్రార్ధనలో నిమగ్నులై యుండిరి. నేను సుఖముగనే యుంటిని. కొలదిగా అలసట తోచుటచేతను, దైవముతో ఏకాంతముగ గడప హృది కోరుటచేతను, నేనా ప్రార్ధనయందు పాల్గొనక, నా పడకగది యందుండిపోతిని. కంటికి రెప్పవలె కాపాడు జ్ఞానేశ్వరి మాత్రము నాతోనే యుండెను. శారీరకముగ, మానసికముగ కూడ నేను సంపూర్ణ ఆరోగ్యముగనే యుంటిని. ఎట్టి తేడాయును శరీరమున లేదు. కొలది ద్రాక్షపండ్లను చేతనిడుకొని నా మంచమునకు ఒక గజము దూరమునగల బల్లపై కూర్చొని యుంటిని.

నా పడకపైకి మారవలయునని సంకల్పము నాకు కలిగెను. ఇంతలో నాతల ప్రక్కకు ఒరిగిపోయెను. దానిని నిల్పుటకు గాని, కదపుటకుగాని, చూచుటకుగాని, శక్తి లేకపోయినది. చైతన్య హీనుడనైతిని. జ్ఞానేశ్వరి ఆందోళన చెంది ప్రక్కగదిలో నుండిన రాజుగారిని పిలచెను. వారు పరుగున వచ్చి నన్ను పడకపైకి చేర్చుటకు ప్రయత్నించిరి. శరీరము నిర్జీవమై యుండు టచే వారు కదపలేకపోయిరి, అచ్చట జడశరీరము మాత్రమే మిగిలియుం డెను. మరి ఇద్దరు భక్తుల సహాయముతో, అతి విచారముతోడను, దుఃఖ ముతోడను ఆ శరీరమును ప్రక్కపైకి జేర్చిరి. "స్వామీజీ, స్వామీజీ" యని వారు నన్ను పిలుచుచుండిరి. కాని అందు జీవము లేదు. చూపు శూన్య ముగా యుండెను. శ్వాస నిలచిపోయెను. జీవమెచ్చటికో కొనిపోబడెను. నిర్జీవమగు శరీర మేమిపల్కును? అది యీ జీవితాంతముగా భావించి, చి. శాంతి, పిల్లలు మొదలగువారందరు మంచముచుట్టును జేరి విలపిం చుచు, "శ్రీరామ జైరామ జై జై రామ ఓం" అని స్మరింప మొదలిడిరి.

కొద్దిక్షణములపాటు "లక్ష్మీవిహార్" దుఃఖాంధకారమున మునిగి పోయెను. ఇంతలో కుమారి జ్ఞానేశ్వరి ఇట్లనెను "స్వామీజీ చూచుచుండిరి. జీవము తిరిగి వచ్చినది."

చిరునగవుతో నేనిట్లడిగితిని "నే నెచ్చటయుంటిని?" బాహ్య స్మృతే మియు నాకు లేకుండెను. నేను లక్ష్మీవిహార్ యందు భక్తులు, సందర్శకుల మధ్య యుంటినని వారు చెప్పిరి. నేనిట్లంటిని. "నేను ఆ దివ్యానుభూతిలో సుఖముగా నుంటిని."

సంగతి యేమియో తెలిసికొనుటకు ఈ మరణ చిహ్నముల సంగతి తెలుసుకొనుటకును డాక్టర్ కోసమై వెళ్ళిన సాధుమార్కండేయ, డాక్టరుగారితో తిరిగి వచ్చెను. వారు తిరిగి వచ్చుసరికి నేను చైతన్యముతో మాటలాడు చుంటిని. దైవము యొక్క మహిమను ఎవరు వర్ణింపగలరు ? ఇది డాక్టర్సు సాధించవలసిన సమస్యకాదు, మాంత్రికులు నిర్ణయించవలసినదీకాదు.

ఆ విధముగా 24వ తేదీ శుక్రవారం రాత్రి జరిగిన విచిత్ర సంఘటన ముగిసినది. అప్పటినుండియు ఒకవిధమగు అంతర్విమర్శ నాలో జరుగు చుండెను. ఈ విధమగు ప్రశ్నలు నాలో కలుగుచుండెను. "ఈ శరీరమును

మృతప్రాయమొనర్చి, చైతన్య రహితముచేసి 15 నిమిషములపాటు నేనెక్కడకు కొంపోబడితిని ? ఎవరైనను నన్ను తీసుకువెళ్ళిరా ? నేనొక్కడనే వెళ్ళితినా ! అందరి ఆనందముకొరకు యీ నిర్జీవమగు శరీరమున తిరిగి నేనెట్లు ప్రవేశించితిని ?”

ఈ పరిమిత మేధస్సునకు అందనిదై, చిత్రమైనదగు యీ అనుభవము నాకెన్నియో విధముల తోడ్పడి, పురోగమన సోపానమైనది. నాకును నన్ను ప్రేమించు వారికి కూడ ఇది చక్కగ ఉపయోగించగలదు.

ఓం తత్సత్ ఓం.

ప్రాక్పశ్చిమమున గల ప్రేమాస్పదులగు వారందరికి నా వినమ్ర పూర్వకమైన అర్పణ, వారికి శాంతి జ్ఞానము కలుగు గాక !

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం ! ఓం ! ఓం !

( శాంతి జూన్ & జూలై 1974 )

# జన్మదిన సందేశం - జపమాల (1980)

( 85వ జన్మదిన సందేశము )

జపమాల సాధకులకు ప్రారంభ స్థితిలో కొంత ఉపయోగముగా నుండును. కృష్ణ భక్తులు జపము చేయుటకై తులసిమాలను వాడుదురు. శివభక్తులు రుద్రాక్షమాలను ఇష్టపడెదరు. కొందరు భక్తులు మంచి గంధము మాలను గూడ వాడెదరు. ధనికులైనా వారు ముత్యాల మాలలను గూడ వాడుచుందురు.

ఈ బాహ్య మాలలు దైవమును చేరుటకు కొంత సహకారిగానున్నను, మనస్సు స్థిరముగ ఏకాగ్రతగా నుండుట కష్టము. ఏకాగ్రతకు తోడ్పడేది ఒక్కటే స్థిరమైన శాంతియుతమైన జలమాల యున్నది.

“అది సోహం జపమాల’

శాశ్వతమైన, స్థిరమైన, నిత్యమైన ఆధ్యాత్మిక జపమాల అది ఒక్కటే. దానినే అజపమాల అని విజ్ఞులందురు. అజపమాలను వాడెడివారు లక్షకో కోటికో ఒకరుందురని చెప్పవలెను. అట్టి జపమాలను వాడెడువారు అరుదై యుండుట చాలా విచారము. ఇదియే సోహం ధ్యానము. సూక్ష్మములో మోక్షము నిచ్చెడి, అంతర జ్యోతిని దర్శింపచేసెడి నిత్యమైన శాంతియుతమైన ధ్యానము.

ప్రియమైన శాంతి పాఠకులారా ! ఆత్మసోదరీ ! సోదరస్వరూపులారా! ఈ 85వ సంవత్సర జన్మదినపు కానుకగా మీ ఆత్మావృద్ధిని కోరుచు,సోహం జపమాలను మీకు ప్రేమ పూర్వకముగా అర్పించుటకు నా అంతరాత్మ కోరుచున్నది. ఈ జపమాల ప్రవృత్తి పరులకు అందుబాటులో నుండదు. నివృత్తిపరులకు, దైవకాంక్షాపరులకు అతి సన్నిహితముగా నుండును.

పెక్కుమాటలు వ్రాతలేల ? కాలము చాలా విలువైనది. అట్టి అమూల్య క్షణములను వ్యర్థము చేయువారు, జీవితమునంతను వ్యర్థము చేసిన వారగుదురు. నేడే మనది ఈక్షణమునందే జన్మించితిమని నిశ్చయించుకొని సోహం ధ్యానమును ప్రతి శ్వాసతో చేయుచు తరించుడు.

ఈ అజప గాయత్రి ధ్యానమే మనశాంతికి, దుర్లభమైన బ్రహ్మ సాక్షాత్కారమును, ఇప్పుడే ఇచ్చటనే ఈ క్షణమునందే పొందుటకు తోడ్పడును.

ప్రియ ఆత్మీయులారా ! నా యీ చిన్న జన్మదినపు కానుకను సత్వరముగా అందుకొని, మీకు లభించిన ఉత్కృష్టమైన మానవ జన్మమును ధన్యత చేసికొనుటకు, ఈ క్షణమునుండి నూతన జన్మను ప్రారంభించి ఇకముందైనను ప్రతిక్షణమును దైవజ్ఞప్తితో సద్వినియోగింప చేయుచు నా జన్మదినమే మీ అందరి జన్మదినముగా భావించి, మీరు తరించుచు లోకశాంతికి తోడ్పడగోరెదను.

ఇదియే ఈ నా జన్మదినపు చిరుకానుక !

భక్తకోటికి నా ప్రేమపూర్వకమైన అర్పణ

సర్వేషాం మంగళం భవతు ! ఓం తత్ సత్ ఓం !

# జన్మదిన సందేశము

( 21-1-1954 తోటపల్లికొండలు )

మానవ జన్మయొక్క ఉత్కృష్టతను, పవిత్రతను గుర్తించుటయే నిజమైన జన్మదినం, నా జన్మదినము మీ జన్మదినమే.

ప్రతిరోజూ జన్మదినముగా జేసుకొని, సదా ఆత్మభావనతో ఆనందించుచున్న వారి జీవితములే పరమపావనమైనవి. భక్తవరేణ్యులకు, ఆత్మవేత్తలకు రోజూ జన్మదినమే !

మానవజన్మకు ఆధారమును, గమ్యస్థానమునైన సచ్చిదానంద స్వరూపమును అపరోక్షముగా అనుభవించెడిదే నిజమైన జన్మదినము. ప్రవృత్తి పరులు, నామరూపములకు, క్షణికమైన కీర్తి, ప్రతిష్టలకు మాయా మోహవశులై ప్రాముఖ్యత నొసంగుచు, జన్మదినోత్సవములను జరుపుకుందురు, ఇక నివృత్తిపరులు, నామరూపాతీతమైన, ఆత్మానుసంధానమునకే ప్రాముఖ్యత నొసంగుచు, తమ జన్మదినములను సృష్టిలో అందరి జన్మదినంబులుగా భావించుచు, ఆనంద లోలులగుచుందురు. "సర్వం ఖల్విదం బ్రహ్మ" ఒకే ఆత్మస్వరూపము పిపీలికాది బ్రహ్మపర్యంతము,అణువు మొదలు బ్రహ్మాండము వరకు వ్యాపించి యున్నదిగాన, ఆత్మ విదులు ఎవ్వరి జన్మదినము, యెచ్చట జరిగినను, వారి జన్మదినముగానే భావించి ఆనందించుచుందురు.

ప్రతిరోజును జన్మదినముగానే భావించెడి వారికి సంవత్సరములో ఒక్కరోజే జన్మదినము చేయనేల ? జనన మరణములకు అతీతులుగా యుండెడి ఆరూఢులులకు ఏ జన్మదినోత్సవములు, ఏ బాహ్యాడంబరములతో నిండియున్న లాంచన పూర్వక క్రియాకలాపములు అవసరము లేవు కదా! ఆత్మవేత్తల ఆధ్యాత్మికానుభవములు చాల ఆశ్చర్యముగా, విచిత్రముగా, ఆనందము నొసంగునవిగా యుండును. అట్టి వారు నిందాస్తుతులకు, బాహ్య జన్మదినోత్సవములకు అతీతులై యుందురు.

మానవ జన్మయొక్క ధ్యేయమగు ముక్తస్థితినంద గలిగినప్పుడే–తాను పరమాత్మయై వ్యవహరించుచున్నప్పుడే ఎవరైనను జన్మదినోత్సవములలోని సార్ధకతను గ్రహించగలరు; ప్రయోజనమును పొందగలరు. ఆత్మవికాశము, ఆత్మానుభవము గలిగినవారే పవిత్రమైన జన్మదిన అర్ధమును గ్రహించగలరు. క్రొత్త సంవత్సరము ప్రారంభించినప్పుడెల్లను, నేను క్రొత్తగా జన్మించితినని తలంచుచుందును. క్రొత్త సంవత్సరమేగాదు; క్రొత్త మాసము వచ్చినప్పుడు గూడను తలవనితలంపుగా ప్రతి మాసము ఒకటవ తారీఖున నా మనస్సు నూతనమైన జన్మమెత్తినట్లు ఆనందముతో నిండియుండును. ప్రతి సంవత్స రము ప్రతినెలయే గాక, ప్రతివారమును, ప్రతిరోజును గూడ మానవ జన్మ యొక్క ప్రయోజనమును గుర్తెరింగిప్రారంభించుట అదృష్టము. ప్రాతః కాలమందు సూర్యుడుదయించుచుండ సూర్యునివలె పరమేశ్వరుని ప్రకాశ మును వ్యక్తపరుచుటకు జన్మించితినా యనెడి నా భావన నాకెంతో శక్తిని ప్రసాదించుచుండును. వారములు, రోజులేగాక, ఏ గంటకు ఆ గంటయే, ఏ నిమిషమునకు ఆ నిమిషమే, ఏ క్షణమునకు ఆక్షణమే, సరియైన మానవ జన్మదినపు అమూల్య గంటగా, నూతనమైన నిమిషముగా క్రొత్త క్షణముగా జేసుకొని, నిత్యానందముతో జీవించెడి వారి జీవితములు పరమ పావనమైనవి. ఈ ప్రత్యక్షక్షణమునందే మనము అతి దుర్ఘటమైన, పవిత్రమైన మానవులముగ జన్మించితి మనెడి భావన ఎంత శక్తియుతముగా, ఆనంద దాయకముగా యున్నది.

జన్మదినపు బాహ్యాడంబరములనిన ఏలనో నా మనస్సుకు దీపావళి రోజున వృధాగా ధనవ్యయము చేసి వెలిగించెడి బాణాసంచా జ్ఞప్తికి వచ్చు చుండును. అది వెలిగించు కాలమందు మాత్రము కాంతిగా యుండి, సంవత్సరములో మిగిలిన రోజులన్నియు కాంతి విహీనమై అంధకారములో మునిగియుండును. మానవ జన్మ పవిత్రాశయ సిద్ధి నొందినవారు నిరంత రము వెలుగుచుండెడి దివ్య జ్యోతిని ప్రసరింప చేయుచు అందరకు శాంతిని, నూతనమైన శక్తిని, శాశ్వతమైన ఆనందమును గల్గించుచుందురు. అంతరార్ధమును గ్రహించి జన్మదినోత్సవములు జరుపుకొను వారి జీవితములే ధన్యములు; మహోత్కృష్టమైనవి.

ప్రియమైన ఆశ్రమ భక్తులారా ! ఆశ్రమాభిమానులారా ! ధర్మానుష్టాన పరులారా, మానవజన్మ గమ్యస్థానమును కనుగొన యత్నించు ఆస్తికులారా! ఈ జన్మదిన జ్ఞాపకార్థముగా మీ అందరకును ఏదైన అమూల్యమైన, శాశ్వత మైన, నిత్యము మీకు తోడ్పడు దానిని మీ కొసంగుటకు, నా మనస్సు తీవ్రముగా కోరుచున్నది.

ఈ ప్రస్తుత క్షణమున, మీ జన్మహక్కైన బ్రహ్మ సాక్షాత్కారమును అపరోక్షముగా అనుభవించ ప్రయత్నించెదరు గాక యనెడి నా ధృఢ సంకల్ప మునే మీకు నా జన్మదినపు కానుకగా అర్పించుచుంటిని. మీరు గూడ ఈ నా జన్మదిన సందర్భమున ఆశ్రమమునకు భక్తి ప్రేమలతో, అనేక వ్యయ ప్రయాసలను సహించి వచ్చిన జ్ఞాపకార్థముగా, లోకేషణాదులను త్యజించి, సత్యమైన ఆత్మానుభవమునే–దైవత్వమునే అనుభవించుచు, ఆధ్యాత్మిక విందారగించి, ఆనందముగ గడిపిన పరమ పావనమైన శాంతిక్షణములనే, నాకు జన్మదినపు కానుకగా అర్పించిన, నేను మహదానంద భరితుడ నయ్యెదను.

కాలము అమూల్యమైనది. జీవితము బుద్బుదప్రాయము. ఈ క్షణమే మనది, వచ్చెడి క్షణము మనదని జెప్పజాలము. ఈ విలువైన క్షణములను సద్వినియోగము జేసిన, మన మెప్పుడోగాక, ఈ ప్రస్తుత క్షణమునందే బ్రహ్మ సాక్షాత్కార సుఖమును, పరమశాంతిని తప్పక బడయగలము. అప్పుడే మనకు ప్రతిరోజు, ప్రతిగంట, ప్రతి నిమిషము, ప్రతిక్షణము జ్ఞానోదయమైన జననకాలముగా యుండుచు, నూతనమైన శక్తినొసంగుచు, బ్రహ్మానంద మును చేకూర్చును. మీకైనను, నాకైనను, మరెవ్వరికైనను స్వస్వ రూపాను సంధానానందముతో బ్రహ్మ సాక్షాత్కార సుఖము ననుభవించుచు గడిపెడి రోజులే నిజమైన, అపూర్వమైన మానవజన్మ పరమావధిని సంపాదించ గలిగిన పర్వదినములని మరల మీకందరకు జ్ఞాపకము చేయనీయుడు. గాన నేటి దినమున మీరందరును మీ జన్మహక్కైన ఆత్మానుభవమును అపరోక్షముగా చవిజూచుటకు హృదయ పూర్వకముగా ప్రయత్నించుడు. జ్ఞానోదయమగుటచే మీకు ద్విజత్వము ప్రాప్తించినందున యీ నా జన్మ దినోత్సవము మీయొక్క యధార్థమైన జన్మోత్సవముగా జరుపుకొనుచు

సార్ధకము జేసుకొనెదరు గాక ! అప్పుడే ఈ నా జన్మదినము మీ అందరి జన్మదినముగా పరిగణించబడగలదు.

ప్రియమైన ఆత్మ సోదరీ, సోదర స్వరూపులారా !

మీరందరును శ్రమతీసుకొని, యీ జన్మదినోత్సవములో పాల్గొనుటకు వచ్చిన జ్ఞాపకార్ధముగా శాంతి ప్రార్ధనను వల్లించి, దీనిని నిరంతరము స్మరించుచు మీ గృహములలో స్త్రీ, పురుషులచేతను, పిల్లల చేతను నిరంతరము స్మరింపజేయుచు, మీరందరూ దినదినాభివృద్ధిని గాంచిన నాకు చాల ఆనందముగా యుండును. లోకశాంతికి తోడ్పడుచు, మీరు హృదయ పూర్వకముగా స్మరించునంత మాత్రముననే, శాంతి నొసంగెడి, యీ చిన్న ప్రార్దన మీ ఉపయోగార్ధమై యీ క్రింద వ్రాయబడు చున్నది.

ఏ పరమేశ్వరుడు, సర్వాంతర్యామియై, మన అందరి హృదయములలో ఇప్పుడిచ్చుట జ్యోతిస్వరూపిగా, మీ అందరి వివిధ నామ రూపములలో ప్రకాశించుచున్నాడో, ఆ సచ్చిదానంద స్వరూపుడు మీ అందరినీ ఆయురారోగ్యములతో, నిత్యశాంతితో, పూర్ణానందముతో నిరంతరము బ్రోచుగాక! ఇదియే మీ వృద్ధిని, శాంతిని కోరుచు మిమ్ము ప్రేమించెడి మీ ఓంకారుని జన్మదినపు ప్రార్ధన.

తరుచూ లోకశాంతి ప్రార్ధన పఠించుడు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

# జన్మదిన సందేశము

(117వ సం॥)

ప్రియమైన ఆత్మసోదర సోదరీ స్వరూపులారా!

ఈ జన్మదినోత్సవ సందర్భముగా ప్రాక్ ప్రతీచులలోని మా 'శాంతి', 'పీస్' పత్రికల పాఠకులకు అందరికీ సౌఖ్యప్రదమైన జన్మదినాన్ని ఆకాంక్షిస్తున్నాను. ప్రతిరోజూ కూడా శాంతియుతమైన జన్మదినం కావాలని నా కోరిక. భగవంతుని యొక్క సర్వవ్యాపకత్వము-సర్వశక్తి, సర్వజ్ఞత్వము వలన ప్రత్యణువు నందు నిండియున్నది.

ఇప్పుడు ఈ క్షణము చాల శక్తివంతమైనది. దానియందు అఖండమైన తేజస్సు, శాశ్వత జీవనము, విశ్వప్రేమ కలవు.

అఖండ దీప్తి (తేజస్సు) మన జన్మహక్కు, శాశ్వత జీవనము, మన అమరమైన హక్కు, విశ్వప్రేమయే మన ఆత్మ, మన గమ్యము, ఎక్కడ ప్రేమ కలదో అక్కడే భగవంతుడు కలడు.

మన అమూల్యమైన కాలాన్ని ప్రతిక్షణమూ జాగ్రత్తగా వినియోగిస్తూ మనం భగవంతునిలో నివసిస్తూ, ఇతరులు కూడా అతనిలో నివసించుటకు తోడ్పడుతూ జీవించటం ఎంతధన్యమైనది. ఈ జన్మదినోత్సవం సందర్భంగా దైవముయొక్క అంతర్వ్యాపకతను గుర్తించి అందరూ సుఖముగా ఆరోగ్యముగా, శాంతియుతముగా ఉందురుగాక !

జరిగిపోయిన గతాన్ని, అనిశ్చితమైన దానిని మరచి వర్తమాన కాలములో జీవించుట ధన్యతమము, ఉపయోగకరమైనది.

ఈ జన్మదినము మా పత్రికా పఠితులకేకాక, శాంతి ఆశ్రమ అభిమానులకు, మిత్రులకు భగవత్సంతియైన యావన్మందికీ కూడా సౌఖ్య ప్రదమైన జన్మదినమగు గాక! క్షణక్షణము మనము భగవంతుని అంతర్వ్యా పకత్వమును సర్వవ్యాపకత్వమును లోపల, వెలుపల, ప్రత్యణువునందు అనుభవించుచు తద్వారా మానవకోటికి అమూల్యమైన కానుక అగుదము గాక !

ఈ జన్మదినము మీ జన్మదినముమగుగాక, నేను ఈ జన్మదినాన్ని మీ అందరి జన్మదినం కావాలని కోరుతున్నాను. ఇంతకూ నిజమైన జన్మ దినం విశ్వప్రేమ భావం అంకురించి దానితో దైవపరితాపన, బ్రహ్మ సాక్షాత్కారము ప్రారంభమైన నాడే.

ఈ జన్మదిన జ్ఞాపకముగా పనిచేయుచున్నప్పుడు కూడా ప్రతిశ్వాసతోనూ ఉచ్ఛ్వాస నిశ్వాసములలో శాంతిని అనుభవింతుము గాక ! శాంతి మన అందరిలోను నిరంతరము ప్రవహించు గాక !

సర్వేజనా స్సుఖినో భవంతు

## జన్మదిన సందేశము - ప్రతిదినము జన్మదినమే

రావణవధయయినది. పుష్పకము నెక్కి సుగ్రీవ, విభీషణ, హనుమ దాది కపివీరులతో గూడి రాముడు సీతా మహాసాధ్వితో అయోధ్యకు వచ్చెను. వసిష్టుని నిర్ధేశానుసారము పట్టాభిషేకము యధావిధి బ్రహ్మోత్సవముగా జరిగినది. సింహాసనమున భర్తృసమేతయైన సీత ఆదర్శ భక్తుడు అనుపమ మహాకార్యము నొనరించినవాడు నయిన హనుమంతునకు, తన హృదయా మోదము ననుసరించి యనర్ఘమయినది, అపూర్వమైనది, యద్వితీయమ యినదియునగు నొక ముత్యాలహారమును స్వకంఠమునుండి తీసి బహు కరించెను. పరమభక్తాగ్రేసరుడయిన హనుమంతుడు దానిని కృతజ్ఞతాభర వినమ్రుడై పరమానందముతో గ్రహించెను. కాని యతడాహారమునుండి యొక్కక్క ముత్యము నూడబెరికి కొరికి పగులగొట్టి యందుంబరీక్షించి తనకు గావలసిన దేదియో యందు గాన్పింపని యట్లు ముఖమునందు నిరుత్సాహము బ్రకటించి యావల పారవేయుచుండెను. ఒక్కొక్క ముత్తియ మును నతడు కొరికో ఏరాతితో బగులగొట్టియో పారవేయుట దిలకించు చుండిన సీతాదేవి ఆశ్చర్యచిత్తయై సంక్షుభితయై హనుమంతునుద్దేశించి–

"ఎంత చదువు చదివి యెన్ని విన్నను నీవు
హనుమ ఎంత భక్తి యాత్మనంది
యున్న సహజ కపిగుణోన్నతి రవ్వంత
వీడలేదదేమి విధమొగాని !

యనెను. అంత హనుమంతుడు అమ్మా! మర్కటనైజమన గుణమే యౌగాక, కాదన్న పోదమ్మా, ఈ దినమందు, కాని భవదీయానర్ఘహారంబు మేలమ్మా ! విచ్చి పరీక్ష చేయగ దయాప్రాలంబమౌ రామనామమ్మే నారయ జాలకుంటి గద! యమ్మా ఏల నాకిచ్చితో.

పగులగొట్టితి, పుణ్యమేయగును
పాపమ్మేయగుంగాక, యీ
నగ లవ్వేటికి నాకు రామజన శూ
న్యంబుల్ ప్రభాదూరముల్

సొగసుల్ రామకథా ప్రసంగములుచా
చోయుక్తి సంధింపనే
వగనెంచన్ విలువెంతయైన నిజమంబా !
ముత్తెముల్ ప్రీతియే

అని సమాధానమొసంగెను. అట్లే హనుమంతునివలెనే, నేనును ప్రతిదినము జన్మదినమో కాదో పరీక్షించుకొందును. ఇతరులకొరకు జీవించుచు, ఇతరులకు సహాయమొనర్చుచు సేవయొనర్చుచు ప్రతిఫల మపేక్షింపకయే ఏవిధముగా నయినను నీవు నీమనుగడను స్వార్ధరహిత ముగా గడుపగలిగినచో ప్రతిదినము జన్మదినమే. నీవు స్వార్ధపరుడవై యుండి, నీకొరకే నీవు జీవించుచు, అమాయకులను పీడించుచు గర్వాహం కృతులతో బ్రవర్తించుచు, ఆత్మశ్లాఘా పరత్వమునను, పరనిందా కథనంబు నను, మనుగడను సాగించుచున్నచో ప్రతిదినము నీకు మరణదినమే.

పరోపకారదీక్షాపరుడవై నీవు ప్రవర్తింప ప్రతిదినము నీకు పుట్టిన రోజు పండుగయే ! ఆత్మ కుక్షింభరత్వమున స్వార్ధపరుడవై నీ కొరకే నీవు బ్రతుకుచుండిన ప్రతిదినము నీకు మిత్తిదినమే. స్వార్థైకపరత్వము మరణము నకు దారితీయును. స్వార్ధరాహిత్యము అమరత్వమునకు, మృత్యురాహిత్య మునకు ద్రోవతీయును. శరీరములకు మృత్యుదినములు జన్మదినములు రెండును గలవు. కాని అంతర్జ్యోతియై సర్వదా వెలుగు 'ఆత్మకు' ఏది పుట్టుక! ఏది మరణము !

కాలమనంతము, రాజులసంఖ్యేయయులు. కాని వీనియన్నింటి యందు సన్నిధివహించి యుండునది యొక్కటే, భగవత్సన్నిధానము. హనుమంతుని వలెనే, నాకుమున్నూట యరువదియైదు పూసలుగల రుద్రాక్ష మాల యొకటి కావలయునని యున్నది. ఈ మూడువందల యరువది ఐదు రుద్రాక్షలను దినములలో ననుసూత్రముగా ప్రవర్తించి సాగునట్టిది దారమను జీవితకాలము. అది యెన్నడును నొక్కటియే అందుచే పవిత్ర భగవజ్జీవిత సూత్రమును ధ్యానించెదగాక. ఆ జీవితసూత్రమే సూత్రాత్మ, అంతర్జ్యోతి, హృదయగుహాంతర్వాసి, ఇయ్యదియే యన్నింటికిని బరస్పర సంబంధమును గలిగించును.

ఈ జీవనసంబంధమొక్క మానవకోటికే కాదు. సర్వప్రాణికోటికి, అనగా ఖనిజ వృక్షజంతు, మానవకోటి కంతటికిని అదియే అద్వితీయ పరబ్రహ్మము, తత్పరము లేదు.

ప్రతిదినము ఎవ్వరు పై విధానముననుసరించి జన్మదినము జరుపు కొందురో వారందరికినీ, నా యభివందనములు, ఈ నా జన్మదినము పూర్వము కంటె నధికతరముగా అంతర్నివాసియైన జ్యోతిస్సును అను సంధింపనవకాశమెసంగుగాక. అంతియేకాక అవిచ్ఛిన్నతైలధారాసదృశ ముగ నా నుండి యెల్లరకు, పిన్నలకు, పెద్దలకు, పూర్వపరిచితులకు, అపరిచితులకును గూడ పవిత్రప్రేమ ప్రవాహమొక్కటియే ప్రవహించును గాక.

ఇది మీ ప్రియ సహృత్రయిన ఓంకారుని ప్రార్థనా నివేదనము.

సర్వేజనాస్సుఖినోభవంతు ! ఓం శాంతి శాంతి శాంతిః

# జన్మదిన సందేశము - జన్మదినము

(86వ సం॥)

ఓమ్ పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణము దచ్చతే

పూర్ణస్యపూర్ణ మాదాయ పూర్ణమేవా వశిష్యతే ॥

హరిః ఓమ్ ! ఓమ్ శాన్తి శ్శాన్తి శ్శాన్తిః ॥

ప్రతీ సంవత్సరము నా జన్మదినము మీ జన్మదినమేనని సదా జెప్పుచుందును. నోటితో జెప్పుట చాలతేలిక. దానిని అపరోక్షముగ ఇతరుల జన్మదినమే తమ జన్మదినమని అనుభవించెడివారు చాల అరుదుగదా! ఈ ప్రపంచములో ఒక్కటే జన్మదినము కలదు. అది బ్రహ్మాసాక్షాత్కారము పొందగల్గిన జన్మదినమే ! అదియే నిజమైన జన్మదినము ! శాంతినిచ్చెడి జన్మ దినము లోకశాంతికి తోడ్పడెడి జన్మదినము.

ప్రియమైన శాంతి పాఠకులారా ! కొంతతడవు నిమీళితనేత్రులై మీలో ఎంతమంది ఈ బ్రహ్మాసాక్షాత్కారమును అనుభవించుచుంటిరో మీ జీవితములను పరీక్షజేసుకొని దైవమును ఆంత్యరమున, బాహ్యామున అనుభవించుచూ, మీ అంతరాత్మనే సత్యమును పలుకనిండు, ఎవ్వరితప్పులను వారు గ్రహించినప్పుడే నిజమైన జన్మదినము ప్రారంభించును. గాని మానవ స్వభావము ఇతరుల తప్పులనే వెదకుచుండును. గాని తన తప్పును మాయచే గ్రహించనీయదని విజ్ఞులు నుడివియుండిరి. తన తప్పు తాను తెలుసుకొన్నప్పుడే మతము ప్రారంభించునని పెద్దలు జెప్పిరి.

మన చిన్నశాంతి ప్రార్ధన సర్వమతసారాంశము, ఖరీదు యివ్వకుండా వస్తువు దొరకదని సదా జెప్పుచుందును. ఈ జన్మదినమున గూడ మన చిన్న శాంతి ప్రార్ధనను స్మరించుచూ సూక్ష్మములో మోక్షముగ లోకశాంతి నిచ్చెడి ఈచిన్న శాంతిప్రార్ధనను కంఠస్తముగజేసి (ఇంతవరకు కంఠస్తము జేయునివారు) ఈ 86వ జన్మదిన జ్ఞాపకార్ధముగ మీహృదయములను శాంతితోనింపి మీ గృహములను శాంతిధామములుగ జేసుకొని దేశము లోకమునుగూడ భూలోకస్వర్గంగ ఇప్పుడే, ఇచ్చటనే జేసుకొని మీరంతా

తరించుటయే. దుర్లభమైన మానవజన్మకు గమ్యస్థానమైన బ్రహ్మసాక్షాత్కార మును మాటలతోగాక అపరోక్షముగ ఇప్పుడు, ఇచ్చటనే ఈ క్షణమునందే అనుభవించుటయే నేను హృదయ పూర్వకముగ కోరుచుంటిని.

నా యందుగాని నా జీవితమందుగాని దైవాజ్ఞలేనిదే గడ్డిపరకైనా కదలదు గాన దైవాజ్ఞచే మీ అందరివృద్ధిని కోరుచు, మీ అందరి తరింపుకై లోకశాంతికై చాలకాలము క్రిందట అనగ 62 సం॥ల క్రిందట మీ ఆంతర్య వృద్ధిని కోరుచు స్థాపితమైన దైవభక్తులందరి జన్మహక్కైన మీ స్వంతమైన శ్రీశాంతి ఆశ్రమమును తరుచు దర్శించుటలో మీ జీవితములను వినియో గించుచూ దినదినాభివృద్ధిని గాంచుచూ నేడేతరించెదరుగాక.

వ్యక్తుల శాంతియే లోకశాంతికి తోడ్పడునని మరల మరల జెప్పు చుందును. గాన నా యందు లేశమైనా ప్రేమయున్న ఈ 86వ జన్మదినము నకు,మాటలతోగాక అనుభవముగ, ప్రేమపూర్వకముగ తోడ్పడమని హృదయ పూర్వకముగ కోరుచుంటిని. నా మతములో అన్యులు ఎవ్వరూ లేరుగాన మీరందరూ నాస్వంతమేగాన, నా స్వంతమైన సోదర సోదరీ స్వరూపులుగాన మీ ప్రేమను మీ సానుభూతిని కోరుచూ ప్రార్ధన పూర్వకముగ ఈ జన్మదినసందేశమును మీ అందరికీ అర్పించుచుంటిని. ఇదియే మిమ్ములను ప్రేమించెడి ఓంకారుని హృదయపూర్వకమైన ప్రార్ధన.

ఓం శాంతి శాంతిః శాంతిః

# జన్మదిన సందేశము

ప్రతి వ్యక్తికి 365 రోజులలో నొక జన్మదినముండుట చాలా అదృష్టము. నిరుపేదలైనను, భాగ్యవంతులైనను, పాశ్చాత్యదేశములలో జన్మదినములను చాలా వైభవముగా చేసుకొనుచుందురు. పసిబిడ్డలకు సహితము జన్మదినములను జేయుచుందురు.

మనదేశములో గూడ ఇప్పుడు జన్మదినములను పెద్దలు పిన్నలు అత్యుత్సాహముగా చేసుకొనుచుండిరి. సంవత్సరములో ఒక్కరోజైనను జీవితమును పరీక్షించుకొని జన్మదినము పేరునయైనను కొన్ని కృతనిశ్చయములను జేసికొని, దినదినాభివృద్ధిగాంచుటకు ప్రయత్నించుట అదృష్టముకాదా!

కాని, సామాన్యముగా దేశమంతటా సదా జేయు జన్మదినములను, విమర్శింపని బాహ్యాడంబరములతో విందులతో నూతన వస్త్రధారణతోనే ప్రవృత్తిగనే జరుపబడుచుండుట విచారకరము.

దుర్లభమైన మానవజన్మ యెందుకివ్వబడెనో, ఇది ఎటుల సద్వినియోగము చేయబడుచున్నదో జీవితమును పరీక్షించుకొని అన్ని రీతులుగా అమూల్యమైన కాలమును సద్వినియోగము జేయుచు మానవజన్మ యొక్క గమ్యస్థానమును జేరుటకు తరించుటకు ప్రయత్నము చేయు వారి జన్మలు సార్థకమైనవి. జన్మదిన జ్ఞాపకార్థముగా ఆశ్రమ భక్తులందరును విలువైన కాలమును నివృత్తులై ప్రార్థన ధ్యానాదులు జేయుచు ఉపవాసముతో మౌనముతో నిండియుండి తమ హృదయములలో శాంతి స్థాపన ప్రప్రథమమున స్థిరము జేయుచు తరించెదరు గాక.

1. వ్యక్తిగతముగా నాకు నేనిచ్చుకొనెడి జన్మదిన సందేశమేమి?

2. ఆశ్రమ వాసులకు నేనిచ్చెడి జన్మదినసందేశమేమి ?

3. ఆశ్రమ భక్తులకు జన్మదినపు సందేశమేమి ?

4. లోకములోనున్న సోదర సోదరీస్వరూపులందరకూ 1995వ జన్మదినపు సందేశమేమి ?

## 1. నా అంతట నాకు సందేశము :

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే

పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవాశిష్యతే ॥

అప్పుడిప్పుడనక నిరంతరము పూర్ణముగా నుండుటయే, పరిపూర్ణమే పరమాత్మ యనునదియే నాకునేనొసంగుకొనుచున్న జన్మదిన సందేశము. ఇదియే మానవజన్మకు గమ్యస్థానము.

Completenes is the soul and the Goal of human birth.

## 2. ఇక ఆశ్రమవాసులకు జన్మదినపు సందేశము :

అంధుడు అంధులకు దారిజూపజాలడు. గాన ఆశ్రమ వాసులు భక్తి జ్ఞాన వైరాగ్యములతో నిండి నిరంతరము దైవసన్నిధిని అనుభవించుచు, అద్దానినే ఆ దివ్యానుభవమునే ఆశ్రమమునకు వచ్చెడి అతిధి అభ్యాగతులతో పంచుకొనవలెను. తాము తరించి ఇతరుల తరింపునకు తోడ్పడుటయే శాంతి ఆశ్రమవాసుల జీవితాశయమై యుండవలెను.

Live in God and help others to live in Him.

దైవములో మీరు జీవించుచు ఇతరులు దైవములో జీవించుటకు తోడ్పడుడు.

## 3. ఆశ్రమ భక్తులకు దగ్గరలో వివిధ ప్రాంతములలో నున్నవారికి జన్మదినపు సందేశమేమి ?

ముప్పది దినములలో 29 దినములు మీరు చేయవలసిన వివిద కృత్యములతో గడిపినప్పటికి నెలకు ఒక్కరోజైనను మీరు తరించుటకై స్థాపితమైన శాంతి ఆశ్రమమును దర్శించి ఆ రోజునునివృత్తిగా ప్రార్ధన ధ్యానాదులతో గడుపుచు వృద్ధియగుటకు ప్రయత్నించుడు. నిరంతర దైవ నామస్మరణ ముక్తి నొసంగును.

Constant repetition of the Name of God gives you Freedom.

తరచు ఆశ్రమములో ఏకాహము జరుగును గాన ఆ రోజుననైనను ఆశ్రమమునకు వచ్చి అఖండ నామ సంకీర్తనలోను,నిత్యము జరుగు సత్సంగ సమావేశములోను పాల్గొని మీ శరీరములను, మనస్సులను హృదయములను నూతనమైన శక్తితో నింపుకొని తరించెదరుగాక !

## 4. మానవకోటి ప్రాక్ పశ్చిమ దేశములలో నున్నవారికి నొసంగ బడుచున్న జన్మదినపు సందేశము

ప్రియమైన ఆత్మ సోదరీ సోదరస్వరూపులారా ! నేడే మనది రేపు మనది కాదు. దుర్లభమైన మానవజన్మలు దైవమును పొందుటకు దైవపు బిడ్డల సేవ జేయుటకై ఇవ్వబడినవి. "పరోపకారార్ధ మిదం శరీరం" ఈ శరీరం ఇతరుల సేవ కొరకే లభించుగాక. మానవసేవయే దైవ సేవగా భావించి దీనిని వినియోగించెదము గాక.

నేడుచేయగలిగిన మంచి పనిని రేపు చేయుటకు బద్ధకించవలదు. రేపు మనలను జూడకపోవచ్చును. నేడే మనము తరించుటకు ప్రయత్నించెదము గాక !

The Past is dead and buried the future is dim and uncertain Hence, let us realize God to-day alone.

భూతకాలము గతించెను. అది పూడ్చివేయబడెను. భవిష్యత్తు అస్థిరమైనది. చీకటిగా ఉండవచ్చును. గాన దైవమును ఇప్పుడే ఇచ్చటనే వర్తమాన కాలముననే యీ క్షణము నందే గుర్తించి తరించెదము గాక. ఆనందముగా యుండుటకు కాలము ఇదియే ఈ ప్రత్యక్ష క్షణమే శాంతి ననుభవించుటకు సమయము ఇదియే పరమపావనమైన తావు.

ఈ జన్మదినపు జ్ఞాపకార్ధముగా, ఆశ్రమ వాసులు ఆశ్రమ భక్తులు ఆశ్రమాభిమానులు అందరును శాంతి ప్రార్ధనను లోకశాంతిని కోరుచు 108 సార్లు స్మరించుచు శాంతి సుధను అనుభవించెదరుగాక ! శాంతి ప్రార్ధన వ్యక్తుల హృదయములలో శాంతి స్థిరముచేసి, వివిధ దేశములలో శాంతి సామరస్యములను వ్యాపింప జేయునుగాక !

ఓం శాంతి శాంతిః శాంతిః

# జన్మదిన సందేశం - విశ్వ జన్మదినం

వ్యక్తుల జన్మదినములు చేయుటకంటే విశ్వ జన్మదినమును చేయుటే, విలువైన కాలమును సద్వినియోగము చేయుటయని ఆనందించుచుందును. నా విశ్వ జన్మదినములో పక్షులు గీతాగానము చేయుచున్నవి. పుష్పములు దివ్య సువాసన నొసంగు చున్నవి. సముద్ర కెరటములు ప్రణవ గానము చేయుచున్నవి. నక్షత్రములు దివ్యతేజస్సు నొసంగుచున్నవి. ఈ విశ్వ జన్మదినములో మీ అందరి హృదయ పద్మములు దైవ చింతనతో నిండి వికసించు చున్నవి. చూడుడు ! వాయుదేవుడు దివ్య మారుతమును వీచుచుం డెను. వీక్షించుడు ! సూర్య భగవానుడు మానవకోటి నంతను నూతన మైన దివ్య తేజస్సుతో నింపుచు, నిరంతరము ప్రతి వ్యక్తియొక్క జన్మదినము నకు తోడ్పడు చుండును. విశ్వ జన్మదినమున విశ్వప్రేమ అనుభవించుట కిదియే పరమ పావనమైన క్షణము. లోకశాంతియే నా జన్మదినమునకు గమ్యస్థానము. మీ అందరి ఆత్మానుభవమే నా నిజమైన జన్మదినోత్సవము. అద్వితీయమైన బ్రహ్మమునందు బేధము కొంచెమైనను లేదు. ఉన్నదొక్కటియే గాన, నా జన్మదినము మీ జన్మదినమే ! మీ ఆనందము నా ఆనందమే ! మనమందరము ఆనందముగా నుండుటకు ఈ జన్మ దినమున ఆత్మ భావనతో దివ్య జ్ఞప్తితో దైవ సన్నిధిననుభవించుచు గడిపెడి క్షణములను, నాకు శాశ్వతమైన కానుకలుగా అర్పించ గోరెదను.

సర్వేషాం స్వస్తిర్భవతు । సర్వేషాం శాన్తిర్భవతు ।

సర్వేషాం పూర్ణం భవతు । సర్వేషాం మంగళం భవతు ॥

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

## జయ జయ రామకృష్ణ హరి ఓం

ఈ మహామంత్రము భక్తాగ్రేసరులైన శ్రీ తుకారాం వారు వారి భజనలలో సదా స్మరించుచు మరణించిన బాలుని కూడ బ్రతికించిన మహా మంత్రము. గాన మీరందరూ ఈ మంత్రమును సదా స్మరించుచు మీ బంధుమిత్రులచే స్మరింపజేయుచు మీ గృహములను స్వర్గధామములుగా జేసుకొనుటలో తోడ్పడమని శ్రీ స్వామీజీవారు కోరుచుండిరి.

ఈ మహామంత్రము యొక్క గొప్పతనము ఏమనగా ఈ చిన్నమంత్రములో వున్న ఆరు మాటలచే మీ శరీరమునంతను కాలి గోరు మొదలు శిరస్సు వరకు దైవ తేజస్సును నింపుకొనవచ్చును. ఈ మహా మంత్రమును వాక్కుతో స్మరించుటకు అలసినపుడు పెదవులతో మాత్రమే స్మరించుచు మీ శరీరమునంతను దైవ తేజస్సుతో నింపగోరెదము.

పెదవులు కదుపుటగూడ మీకు కష్టముగా తోచినపుడు మనస్సులోనే స్మరించుచు తరించవలెను.

ఆ స్థితిని చేరినపుడు అంతర్యమున తేజస్సు, బాహ్యమున తేజస్సును, అందరిలోను తేజస్సు, అన్నివైపులా నిండియున్న తేజస్సును అనుభవించగోరెదము. ఇదియే మా చిన్న శాంతి ప్రార్థన యొక్క సారాంశము. దైవ పరితాపనతో నిండియున్న వారికి వేయి మాటలు అవసరంలేదు.

ఈ చిన్నలోకశాంతి ప్రార్థన శ్రీ తుకారాం వారి ఆరు మాటల మహా మంత్రము మన మందరము ఇప్పుడే ఇచ్చటనే దైవ సన్నిధిని అనుభవించుటకు, భగవత్సాక్షాత్కారము పొందుటకు తోడ్పడును.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు !

# జ్యోతిర్మయ కిరణములు

1. దైవభావముతో నీవు జీవించుచు, ఇతరులు దైవభావముతో జీవింపగలుగుటకు తోడ్పడుము. లోపలను, వెలుపలను, చుట్టును ఆ దైవమే నిండియుండెను. సర్వ మా దైవకృపయే.

2. నామ రూపాత్మకమగు యీ మాయాజగత్తులో దైవకృప లేక దైవజ్ఞప్తి ఒక్కటియే వరప్రసాదము.

3. ఈరోజు–ఇప్పుడు నేను దైవానుభూతిచే ఆనందసాగరమున నుంటిని. అందుకు కారణము నేను ఎడతెగని దైవ చింతనతో నుండుటయే.

4. వాస్తవమునకు ఇప్పుడు వ్రాయుచున్న దాదైవమే. గాఢమగు దైవానుభూతి తక్క మరింకేమియులేదు.

5. ఈ చిన్న 'అహం' కారము ఒక్క చిన్నగడ్డిపోచనైన కదల్పజాలదు. ఇది సత్యము.

6. ఈ శరీరములోని జీవము మిమ్మందరను ప్రేమించి సేవించుట కొరకే, నా సేవ మాటలయందుగాక, చేతలయందు ప్రస్ఫుటమగుగాక! ప్రేమయే దైవము. దైవమే ప్రేమ, కావున మీ అందరను ప్రేమింతును. ఎచ్చట ప్రేమగలదో అచ్చటనే దైవము కలడు.

7. ప్రేమలేని హృదయము శ్మశానము వంటిది.

8. కావున మన హృదయములను శ్మశానవాటికలుగ, కాష్టభూముల వలెగాక ప్రేమ, శాంతి నిలయమగు స్వర్గధామములవలె నొనర్తుముగాక!

9. వాస్తవమునకు మానవసేవయే మాధవసేవ.

10. మీ కన్నుల ఎదుట కానవచ్చు యీ మానవులను మీరు ప్రేమింప జాలనిచో, ఈ భౌతిక నేత్రములకగోచరమగు, మీకు కానరానివారిని ఎట్లు ప్రేమింపగలరు.

11. నీ దీర్ఘనిద్ర ఇక చాలింపుము. మేల్కొనుము. నీవెంతకాలము నుండి నిద్రించుచుంటివో గమనించితివా ? నీవు పుట్టినదాదిగా నిద్రించు

చునే యుంటివి. నీకు పిలుపు వచ్చువరకు ఇటులనే నిద్రింతువా ? మరణ మెవ్వరికిని తప్పునది కాదు. గుర్తించుము. మేల్కొనుము.

12. ఆత్మ సూర్యుని ప్రకాశము నెవరు సద్వినియోగము చేసుకొందురో వారి జీవితములు ధన్యములు.

13. మానవజన్మ అరుదుగ లభించును. అమూల్యమైనట్టి మానవ జన్మను నామ రూపములనెడి యీ భౌతిక జగత్తునందలి బొమ్మల కొలువున బడి వ్యర్థము చేయకుందురుగాక !

14. నేనిదివరకు చెప్పినట్లు మిమ్మందరనూ ప్రేమించుటకే యీ జీవముకల్గియుంటిని అనెడుభావన నాకు ఆనందమును శక్తిని కలిగించును.

15. ఇప్పుడు ఇచ్చట మీకు వ్యక్తిగతముగా చేయుసేవయే నా జీవితము. అదియే నా జీవిత ధ్యేయము.

16. ఓ ప్రియ పాఠకులారా ! మీరెచ్చటనున్నను మిమ్ము నేను చూచి యున్నను, లేకున్నను మీరందరు నావారే. మిమ్ములను ప్రేమించి,సేవించుటయే నాకు మహదానందము కలిగించును.

17. ఈ మాయాజగత్తులో, వివిధముగ కానవచ్చు యీ సృష్టి యందు అందరము వచ్చినది ఒకే దైవమునుండి. ఒకే సత్యమునుండి. వాస్తవమునకు అందరము ఒక్కటియే.

18. మాయా యవనికచాల దట్టమైనది. అగాధము అనుల్లంఘనీయము. ఎంతటి తెలివిగల వారినైనను మాయక్రమ్మును. వారికి కన్నులుండవచ్చును. కాని చూడజాలరు. స్వయం ప్రకాశమానమగు తేజస్సు వారికి దృగ్గోచరము కాదు.

19. తమలోపల, వెలుపలగల దివ్య తేజస్సును అనవరతము గాంచువారు ధన్యులు.

20. నేను ప్రతిశ్వాసతోడను దైవమును స్మరింతును. ప్రతి శ్వాస నాలోపల గల దివ్యతేజస్సు సన్నిధికి నన్ను గొంపోవుచున్నది.

21. 'సోహం' చక్కని మంత్రము. పవిత్రమైనది. ప్రతివారిని దైవ సన్నిధికి జేర్చగలదు. ఎప్పుడో భవిష్యత్తున కాదు. ఇప్పుడు, ఈ క్షణమునందే ముక్తినొసంగును. కాని కావలసినది వూరకనే చదివి విస్మరించుటకాదు. ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసల యందును 'సోహం' భావమును ఆచరణలో నుంచ వలెను. అప్పుడే దానిశక్తి కనిపించగలదు.

22. ఎవరు తమలోగల తేజస్సును లేక దైవమును మరతురో వారు మరణించినట్లే యగును. అట్లు మరణించిన వారికై నేను విలపించు చుందును. అట్టివారు పెద్ద పెద్ద పదవులలో నుండవచ్చు. నాయకులు కావచ్చు. భాగ్యవంతులు కావచ్చు. అధికారములో పేరు ప్రతిష్టలు పొంది యుండవచ్చు. కాని నశ్వరమగు యీ భౌతిక సంపద లెన్నియున్నను వారు మరణించినవారే యగుదురు.

23. స్వార్ధపరత్వము నొక్కదానిని చూచియే నేను భయపడు చుందును. తమకొరకు తాము జీవించు స్త్రీ పురుషులను గాంచిన నాకు భయమగుచుండును. దైవమును మరచి, స్వార్ధమే జీవించు వారి నుండి దూరముగా వందలకొలది, కాదు, కాదు, కోట్లకొలది మైళ్ళు దూరముగా ఏకాంతముగా నుండవలెనని నా హృదయము కోరుచుండును.

24. స్వార్ధపరులైనవారు అధికులైనను అల్పులైనను; ధనాఢ్యులైనను, ధనహీనులైనను; పండితులైనను పామరులైనను వారి స్పర్శ చాల అపాయ కరము.

25. ఈ మిథ్యాజగతిలో జీవితయాత్రయందలి కష్టసుఖములు తాత్కాలిక మేఘముల వంటివి.

26. ఈ ఆధ్యాత్మిక భావములను ఈ తేజః కిరణములను ప్రాక్పశ్చిమమున గల అన్నిమతముల వారితోడను, జిజ్ఞాసువులందరితోడను పంచు కొనవలెనని నా తలంపు వట్టి చదువుట తోడనే వీనిని విడువక, ఆచరణతో అనుభవములోనికి తెచ్చుకొందురుగాక !

27. ఈ క్రింద నుదహరింపబడిన అబ్రహాంలింకన్ పలుకులు నాకు ఆనందమునొసంగుచుండును. "అగాధమునుండి నూతనశక్తి; అంధకారము నుండి నూతన తేజస్సు; చీకటిలో పయనించుచున్నను మార్గమునందే యుంటిమి" నీవు కూడ ఆ మార్గముననే యుంటివి. అందరును ఆ మార్గముననే యుండిరి. ఎన్ని సోధనలు, ఎన్ని బాధలు ఎన్ని కష్టములు వచ్చినను, కడకు దైవమును మరచినను మనం పయనించుచున్న దైవము దెసకే దైవసాన్నిధ్యమునకు మాత్రమే.

28. మరణమనగా నీ శరీరపతనమే కాదు. దైవమును విస్మరించుటయే మృత్యువు. ఈ అమూల్య భావమును వ్రాయుట, చదువుట, మరచిపోవుటతో సరికాదు. ప్రతి ముఖారవిందమున, ప్రతిలలాట ఫలకమున ధైర్యముగా లిఖింపదగిన సత్యమిది.

29. దుఃఖితులు, పీడితులు, రోగపీడితుల రూపమున మన చెంతకు వచ్చు దైవమును అనుక్షణము సేవింతుము గాక అట్టివారిని సేవించుట నీ అదృష్టముగా భావించుము.

30. తమ ప్రత్యణువు నందును దైవానుభూతిని అనుభవించువారు ధన్యులు.

31. దైవము మనకత్యంత సన్నిహితుడుగ, ప్రియతముడుగ, ఆప్తుడుగ మనతో కలసియే యుండెను. మనపాణిపాదముల కన్న సన్నిహితముగ నున్నదా దైవమే. వాస్తవమునకు దైవము మన శ్వాసలకు శ్వాస.

32. ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసలలోను దైవమను లేక శాంతినే ఉచ్ఛ్వసింపుము. నిశ్వసింపుము పనిచేయునపుడును, చేయనపుడును నిశ్శబ్దములోను కూడ ఆ భావనయే ప్రధానము.

33. ప్రత్యుషస్సు ఒక నూతన జీవితముగా నెంచవలెను. గతము మృతతుల్యము. అద్దాని విస్మరించి కాల్చివేసి నేటి ఉషస్సున నూతన జన్మ కలిగినట్లు భావింపుము. కాలమును, ప్రతిక్షణమును సద్వినియోగము చేయువారు ధన్యులు.

34. తెలివిగలవారు దినదినము అన్నివిధముల అభివృద్ధి నందుదురు. వాస్తవమునకు అభివృద్ధియే జీవితము. స్థబ్దతయే మృతతుల్యము.

35. తనకొరకు తాను జీవించు స్వార్ధపరుడే మన శత్రువు. ఇతరుల క్షేమము కొరకు జీవించు నిస్వార్ధపరుడే అందరకును స్నేహితుడు.

36. సోమరితనము మానవులకు శాపము వంటిది. సోమరులైన వారు తమకు హాని కలిగించు కొనుటయే గాక, అమూల్యమగు ఇతరుల కాలమును వ్యర్ధపుచ్చుచు వారికి గూడ హాని కలిగించుచుందురు.

37. పనియే ఆరాధన, ముఖ్యము గానది నిస్వార్ధముగా చేయబడినపుడు మాత్రమే, నిస్వార్ధపరుడు మనోవాక్కాయములచే ఏమి చేయుచున్నను అది ప్రపంచమునకు మేలే చేకూర్చును. అట్టివాడు మానవాళికలంకార మాత్రుడు.

38. ఓ ప్రియ పాఠకులారా ! నేను మీకొరకు ఏమి చేయగలను? మిమ్మందరను ప్రేమించి, సేవింపవలెనని నా హృదయము కోరుచుండును. వాస్తవమునకు మనమెట్టి సహాయమును చేయలేము. ప్రతిముఖారవిందమున దైవతేజస్సును గాంచుచు సేవించుట తప్ప.

39. మనము భావించు దైవము ఎచ్చటనో స్వర్గమున, ఆకశమున లేడు. అందరియందును వెలుంగుచున్నదా దైవ చైతన్యమే. అది గుర్తించి ప్రతిఫలాపేక్ష రహితముగా అందరిని ఆరాధించుటయే విశ్వపూజ.

40. ఈ వాడి నశించిపోవు పుష్పములు దైవమున కర్పింపవలదు. హృదయ కమలము నర్పించుడు. పవిత్ర హృదయ పుష్పముకంటె దైవమున కర్పించుటకు విలువగల పుష్పమేదియు లేదు.

41. బాహ్య ఆరాధన మంచిదియే కాని మానసికారాధన అంతకంటె శ్రేష్టము.

42. దైవము సర్వజ్ఞుడు. మన మెట్టివారమో, మన తలంపు లెట్టివో, మనకోర్కెలెట్టివో, మనము వెలిబుచ్చక మునుపే ఆ దైవమున కెరుక.

43. తీయని మాయ మాటలచే బంధుమిత్రుల నెల్ల మోసగించవచ్చు కాని సర్వజ్ఞుడు, సర్వోపగతుడు, సర్వశక్తివంతుడు అగు దైవమును మోసగించుట ఎవరికిని ఎన్నడును సాధ్యము కాదు.

44. దైవము నిశ్శబ్దములోనే మాటాడును. కావున ఆ దైవ శబ్దమును వినుటకు నిశ్శబ్దముగా, మౌనముగా నుందముగాక!

45. నిశ్చలురైయుండి "నేనే ఆ దైవము" అని గుర్తింతురు గాక! అది ఎంతటి గొప్ప సత్యము !

46. నేను వ్రాయుచున్న యీ ఆధ్యాత్మిక భావములుగాని, వేదము లందలి చతుర్విధ మహావాక్యములుగాని చదువుటవల్ల ఎట్టి ప్రయోజనము కలుగనేరదు. వానిని నిత్యజీవితములో ఆచరించి అభివ్యక్తము చేసినపుడే వాని ప్రయోజనము పొందగలరు.

47. చిలుకలవలె నేదియు పలుకవలదు. హృదయంగమ మొనర్చు కొని మనోవాక్కాయములచే వానిని ఆచరణలో నుంచుడు. ఆచరణ! ఆచరణయే ముఖ్యము.

48. "నీ వెట్టి ఆహారము సేవింతువో తెల్పిన, నేను నీ వెట్టివాడవో తెల్పగలను" అని ఒక మహనీయుడు తెల్పియుండెను. మనము తీసికొను ఆహారముపైననే మన తలంపులాధారపడి యుండును.

49. పులి, సింహము మొదలగు క్రూరజంతువులు విచక్షణా జ్ఞానము లేక జంతుహింస గావించి, వానిని భక్షింపవచ్చు. కాని నీవు విచక్షణా జ్ఞానముగల దైవబిడ్డవే. అమాయకమగు మూగ జంతువుల ఎడజాలి, దయ, కరుణ కలిగియుండును. లేపచ్చికను మేయు గోవువలె సాత్వికాహార మును భుజింపుము. అపుడు నీ ప్రవర్తన సరళముగా నుండును.

50. ఏ మనుజుడును రాత్రికి రాత్రి అద్భుతములు చేయజాలడు. సోమరులు బలహీనులమని భావించుచు నిద్రించుచుండ, తెలివిగలవారు దివారాత్రములు కష్టించిపనిచేసి ఫలితము పొందుచుందురు. ఇదియేవారి విజయరహస్యము.

51. గత తలంపుల యొక్క, చేతలయొక్క రూపమే నీ ప్రస్తుత జీవితము. ఇక నీ భవిష్యజ్జీవితము నీ ప్రస్తుత తలంపులపైననూ, చేతలపైననూ ఆధారపడి యున్నది. ఈ దైవ చట్టము నెవ్వరును మార్చజాలరు. నీ మనోవాక్కాయములచే సత్యముగా జీవించుట అలవరచు కొనుము.

52. "మతివలెనే గతి" భావములే రూపము దాల్చునవి. "మట్టి," "మట్టి" యని తలచిన మట్టిగానే యగుదురు. "దైవము" దైవమని తలచిన దైవస్వరూపులే యగుదురు.

53. శాంతి మీఅందరి హక్కైయున్నది. జాతి, మత, కుల, విచక్షణలు దైవము కడలేవు. మీరెచ్చటనైన నుండవచ్చు. ఏమైన చేయుచుండవచ్చు. మాకు భేదములేదు. మీరందరు దైవస్వరూపులే. ఈశాంతి ధామమునకు మీ ఎల్లరకు సుస్వాగతము. ప్రార్థన, ధ్యానాదులతో నిశ్శబ్దముగ మీ కాలమును ఇచ్చట గడుపుడు.

54. భౌతిక సంపదలకు మీరుదూరులైన శాంతి ఆశ్రమము (దైవము) మీ సంరక్షణభారము వహించును. మీరు సంపన్నులైన ఆశ్రమ సంరక్షణ బాధ్యత లేక, దైవప్రతిరూపుల సంరక్షణ బాధ్యత కొలదిగనైన వహించుడు.

55. శాంతి ప్రార్దన సరళము, సూక్ష్మము, ఉత్తేజకరము. దానిని మీరు కంఠస్తము చేసి మీ బంధుమిత్రులచే గూడ కంఠస్థము చేయింపుడు. ప్రతి ప్రాతఃసంధ్యా సమయములందు దానిని శ్రద్ధతో పఠించిన మానవ జీవిత గమ్యమును చేరగలరు.

56. వ్యక్తి శాంతియే విశ్వశాంతికి ఆలవాలమనెడి సత్యమును మరువకుందురుగాక !

57. ఇప్పుడే, యీ క్షణమునందే మీ హృదయములను శాంతి నిలయముగా నొనర్చి విశ్వశాంతికి తోడ్పడుదురుగాక !

58. ఒక మహనీయుని ప్రార్థన మీరెన్నడైన వినియుండిరా ? విశ్వ శాంతి నెలకొనుగాక ! విశ్వము శాంతినిలయమగును గాక ! ఆ శాంతి

నా నుండి, పవిత్రవంతమైన హృది నుండి ఇప్పుడు ఇచ్చట నుండియే ప్రారంభింపబడుగాక !

59. మనము ఎట్లు భావింతుమో అట్లేయగుదుముగాన, నేను నూరు సంవత్సరములు జీవింపవలెనని కోరుకొనుచుంటిని. అది నా కొరకు మాత్రము కాదు. ఇతరులను ప్రేమించి, సేవించుటకొరకు. ఈ ప్రయత్నము నెరవేరని యెడల నా జీవితము ముగించి, యీ ప్రపంచమును విడువవలె నని కోరుదును. మట్టిచెట్టువలె వందలకొలది సంవత్సరములు ప్రేమ, సేవ లేక జీవించుట వ్యర్థము. మిమ్ము సేవించి ప్రేమించి ఆనందించు అదృష్టము నాకు కలుగవలెను. నా ఉనికి, నా శ్వాస నా సర్వము దైవము లోనే. అదియే మానవజీవిత గమ్యము, ధ్యేయము.

60. నేను వేకువజామున లేచినపుడు నేనెంతో భాగ్యవంతుడననియు, సమస్త మానవాళిని సేవించు శక్తిగలవాడననియు తలచుచుందును.

61. కొందరు చాలా అహంకారపూరితులై యుందురు. ఈ భౌతిక రూపమే తామని భావించుచు, పెదవులతో మాత్రము తమకు ఎట్టి పదవు లుగాని, పేరు ప్రతిష్ఠలుగాని అవసరము లేదని తెల్పుచుందురు. తమ కంటిలోని దూలములను చూడజాలక, ఇతరుల కంటిలోని నలుసులకై వెదుకు చుందురు. మాయా యవనిక అంత దట్టమైనది.

62. "ఓం శ్రీరామ జైరామ జైజై రామ ఓం" ఇది చాల పవిత్ర మంత్రము. ఆనందాశ్రమ సంస్థాపకులు శ్రీరామదాసుగారు దీనిని అను క్షణము జపించువారు. ఆ ఆశ్రమమున 24 గంటలు ఈ మంత్రము జపింపబడుచుండును. శాంతి ఆశ్రమమున కూడ దినమంతయు ఇది జపించుచుందురు మీరు కూడ దీనిని జపించి తరింతురుగాక ! ఈ మంత్రమును జపించునపుడు నా అనుభవమును మీకు తెల్పెదను, మంత్రము జపించునది నేనుగాక రామదాస్‌జీయే యీ దేహమనెడి దేవళమునుండి జపించుచుండిరా యనిపించును. అవిరళముగ అది జరుగుచునేయున్నది.

63. ఈ ప్రపంచమున మృతజీవులనువారు నా దృక్పథమున గానరారు. నేనెవరినితలచిన వారెల్లవచ్చి యీ శరీరమనగలరా యనిపించును. ఉదాహరణకు స్వామి శివానందజీని స్మరించిన వారు ఇందుండి "ఓం నమశ్శి వాయ" "శివాయనమః ఓం" అని స్మరించుచున్నట్లనిపించును. ఇది అనుభవముచే తెలిసికొనవలెనేగాని తెలుపుటకు సాధ్యము కాదు.

64. "నీవెచటకు వెళ్ళదలచితివి?" ఇది ఆధ్యాత్మిక మెరుపులు గ్రంథములోని ఒకచక్కని అధ్యాయము. ఈ దినములలో నేనెచటికైన వెళ్ళదలచినపుడు నా ఎదలో ఆ ప్రశ్నయే ఉదయించుచుండును. "నీవు ప్రపంచము నంతయు చుట్టియుంటివి. అదిచాలదా ? నీ ఆంతర్యమునకు జనుటకు ఇదియే సమయము. లోలోతులకు పోయినకొలదియు, ఆ గంభీర నిశ్శబ్దములో అతిమెల్లని మధుర స్వరమును నీవు వినగలవు. ఆ దైవశబ్దములను వినుటకు ఇదియే తగినసమయము.

65. ఒక్కొక్కసమయమున నాకు బాహ్యమున చేయవలసిన పని ఏమియు లేదనియు నా ఆంతర్యమున నేచేయవలసినది చాలా కలదని అనుకొనుచుందును. నా నఖశిఖపర్యంతము పవిత్ర 'ఓంకార' మంత్రోచ్చారణచే నింపవలెనని నాతలంపు. మనశరీరమునందలి ప్రత్యణువు ఓంకార ప్రకంపనములచే నిండియుండుట అనునది, ఎంత ఉత్తేజకరమైన భావన. దైవము యొక్క సర్వజ్ఞత్వము, సర్వవ్యాపకత్వము, సర్వశక్తిమంతము. ఆ 'ఓంకార'శబ్దమున ఇమిడియున్నవి.

66. భగవాన్ రమణమహర్షి అమరులు. వారెల్లప్పుడును నా హృదిలోనే యుండి "నేనెవరు?" అనుచున్నట్లుండును. భక్తి త్యాగయుతమైన పవిత్రహృదయములో భగవానుని అనుభూతి కలిగియుండుట ఎంతటి అదృష్టము? సత్–చిత్–ఆనంద స్వరూపులైనవారు ఏమొనర్చినను లోక క్షేమమునకే.

67. మురళివాయించు చక్కని శ్రీకృష్ణుని చిత్రము నా ఎదుటి గోడపై వ్రేలాడుచు చిరునగవుతో ఇట్లనుచున్నట్లుండును. "నీవు కూడ ఈ మురళివలె శూన్యమైనచో నాకు ప్రియపాత్రుడవగుదువు" ఈ చిన్న "అహం" నేను

అను దానిని మరచి మురళివలె పరమేశ్వరుని పెదవులకడ నాట్యమాడుట ఎంత అదృష్టము? ఇప్పుడు ఎవరు ఈ ఆధ్యాత్మిక కిరణములను ప్రసరింప జేయుచుండిరో (వ్రాయుచుండిరో) వారికే వీనిని అర్పించుచుంటిని.

68. నీలగిరి పర్వతములను పర్వతరాజ్ఞిగా పేర్కొనుచుందురు. అట్లు భావించునపుడు నేనే యీ పర్వతరాజ్యమునకు రాజునని అనిపించును. శాంతము, పవిత్రము, ఉత్తేజకరమునగు ఆ ప్రదేశమున నుండుట నా అదృష్టము.

69. నామరూప జగత్తునకు మృతులై దైవజగత్తున జీవించువారు ధన్యులు. మాయా ప్రపంచమునందలి తాత్కాలిక మేఘములను తొలగించు కొని లోపలను, వెలుపలను తేజస్సును దర్శించువారు ధన్యజీవులు.

70. నెహ్రూ ప్రధానిగా నున్నపుడు ప్రాతస్సాయం సంధ్యల రెంటి యందు గెడ్డముగీచు కొనువాడని ఎవరో చెప్పిరి. ఎవరో ఉన్నతాధికారులు, విదేశీయులు వచ్చెదరని తెలిసినపుడు నేనుకూడ ప్రతిదినము ఆపని చేసెడి వాడనని తెల్పుటకు సిగ్గగుచున్నది.

తరువాత నాకిట్లనిపించెను. ఈసందర్శకులు నా ముఖ సౌందర్య మును చూచుటకు వచ్చుటలేదు. శాంతి ప్రేమ పూరితములగు నా పలుకులు వినుటకు వచ్చుచుండిరి. నేను పెద్ద పెద్ద పదవులలో నున్న యెడల ఆ పనికి కొంత అర్థమున్నది. అముఖ్యములగు ప్రజాభిప్రాయములను మరచి నిత్య సత్య జ్యోతిని అంటియుందును గాక !

71. ఆరోగ్యము–ఆరోగ్యమే మహాభాగ్యము. ఈ ప్రపంచములో నెల్ల నేనే ఆరోగ్యవంతునిగా భావించుకొందును. మలబద్ధకమే అన్ని రోగములకు మూలమని నా చిన్నతనమున నేర్చుకొని యుంటిని. ఆహార నియమముల కును, ప్రకృతినియమములను ఎల్లరు పాటించుట చాలా ముఖ్యము. ఔషధ ములను సేవించుట అంత మంచికానేరదు. అవి క్రమక్రమముగా శరీర మును విషపూరితముగా నొనర్చును. మలేరియా జ్వరము వచ్చిన “క్వీనైన్” ఇచ్చుచుందురు. అది శరీరమును క్రమముగా విషపూరితము” చేయదా?

72. ఆదివారము– ఆదివారము సూర్యరశ్మిగల రోజు. అట్లయిన తక్కిన దినములమాట ఏమి? దైవానుభూతిని మనము పొందిన దినము లన్నియు తేజస్వంతములే. అనంతము, సర్వవ్యాపకము, శాశ్వతము అయిన ఆ తేజస్సులేని క్షణమేదియు లేదు. కోటిసూర్య ప్రభాభాసమానమగు ఆ దివ్య తేజస్సులో, ఈ దినములు, ఈ మాసములు, ఈ సంవత్సరములు ఎచ్చటగలవు? దైవము పరిమితములయిన దేశకాల నిమిత్తముల కతీతుడు.

73. విశ్వాసము చాల మంచిగుణము. కుక్కలు చాల విశ్వాసమైన వగుటచేతనే అవి యెక్కువగా ప్రేమింపబడుచుండును. తన ఆహార పానీయ ములను కూడ మరచి "ఓమీ"(కుక్కపిల్ల) నా వెంట నీడవలె జ్ఞాన గుహకు వచ్చుచుండును. "దానికెన్నడును నిరుత్సాహము కలిగించకుందునుగాక!" ఇది నా ప్రార్ధనలలో నొకటి.

74. దైవము మేల్కొంచియుండ నీవేల నిద్రింతువు? నేను రాత్రి 2గం॥కే మేల్కాంచి, అటుపై పరుండజాలక క్రిందను, మీదను, లోపలను, వెలుపలను, సర్వత్ర ఆ దైవ తేజస్సునే గాంచుచు, ఈ ఆధ్యాత్మిక మెఱుపులను లేక ఈ విస్ఫులింగములను వ్రాయుచుందును.

75. కోటిసూర్యులకైన తేజస్సు నొసంగునదా దైవమే. కాని ఆ దైవ తేజస్సును కాంచజాలకుండుట విచారము. అదియే మాయాప్రభావము. తెలివిగలవారు గూడ అంధులుగా నుండుట చూడ ఆశ్చర్యముగా నుండును.

76. మనలో ఏమిగలదో దానినే బాహ్యజగత్తున చూచుచుందుము. నీలో దైవమును గాంచగలిగిన, ఈ సృష్టియందంతటను దైవమునే గాంచ గలవు. నీ హృదయము మలిన రహితమొనర్చు కొనుము. అప్పుడు ఇతరుల లోని దోషములు నిన్ను బాధింపనేరవు.

77. ప్రతివారు ఆరోగ్యముగా నుండవలెను. లేనిచో దైవ స్వరూపులగు మానవాళిని సేవించుట సాధ్యముకాదు.

78. నా ప్రేమ పరిధిని దాటి ఎవ్వరును బైటనుండుటకు వీలులేదు. వారు ప్రేమింపకపోవచ్చు, అర్థము చేసికొన లేకపోవచ్చు. కాని దైవప్రేమలో

శత్రుత్వ మిత్రత్వములకు తావులేదు. ఆ ప్రేమ వెల్లువలో అందరును తేలియాడవలసినదే.

79. నేనొక అనారోగ్యవంతుని ఎరుగుదును. ఆతడెల్లప్పుడును అనారోగ్యముచే బాధపడుచుండును. తనబాధలో దైవమునుకూడ స్మరింపలేకుండెను. కాని ఆశ్చర్యము తనవద్దనున్న ధనములో ఒకపైస అయినను దానము చేయుటకు ఇష్టపడడు. ఈ శరీరము, ఈ ధన ధాన్యములు అన్నియును అశాశ్వతములని వినుచుండియు ధనదాసులగుట మాయాప్రభావము కాదా? రక్కసిని కొలుచుట కాదా ?

80. ఎవరినైన నీవు శత్రువుగా మార్చుకొనదలతువేని, వారి భౌతిక సంపదల నభ్యర్థింపుము. వారు నీకు శత్రువగుటయే గాదు తిరిగి నిన్ను చూడనైన చూడరు. నిన్ను తప్పించుకొనియే తిరుగుచుందురు. ఇది ధన దాసుల లక్షణము. ఆధనమంతయు స్వార్థము కొరకే వినియోగపడవలెనని వారు భావింతురు. మరియొక జన్మనుగూర్చిన ఆలోచనయే వారికుండదు. అట్టిభాగ్యము నాకువలదు. నన్ను మాత్రము దైవీసంపదతో బ్రతుకనిండు. అది అపహరింపబడదు, నశించదు, జీర్ణముకాదు, అది నిత్యసత్యమైనది.

81. ఎన్ని కష్టములు, ఎన్ని నష్టములు, ఎన్ని శోధనలు నాకు కలిగినను, అవి తాత్కాలిక మేఘములవంటివని నేను ఎల్లప్పుడు ఆనందముగానుందును. కాని నన్నే తమసర్వస్వముగా నమ్మినవారు దుఃఖించుచుండ, అనారోగ్యముగా నుండ నాకు విచారము కలుగుచుండును.

82. పసిబిడ్డలవలె, అప్పుడే పుట్టిన పసిపాపలవలె పవిత్రముగా నుండవలెను. ఎట్టి కోరికలు లేక అట్లు పవిత్రముగా నున్నవారే ఏ మతము వారైనను, ఏ దేశము వారైనను, నన్నుసరించుటకు అర్హులు.

83. దైవచట్టములు నీకును, నాకును, ఎల్లరకును ఒక్క తీరుగనే వర్తించును చెడుభావములనే తలంచుచుండిన చక్రములు బండి ననుసరించునట్లు నీ యొక్క చెడుభావములు, నీడవలె నిన్నంటి పెట్టుకొని యుండును.నీవు మంచి తలంపులను స్వార్థరహిత భావములను భావించుచుంటివేని నీ భావములు నీడవలె నిన్నంటి పెట్టుకొని యుండును.

84. "పవిత్రచ్ఛాయ" నెన్నడయినను మీరు చూచియుండిరా? లేదా ఎన్నడైన దానిని గూర్చి వినియుండిరా ? అది కంటిని రెప్పలవలెను, బిడ్డను తల్లివలెను మిమ్మంటి యుండి మిమ్ము సంరక్షించుచుండును.

85. ఇది మీకు ఆశ్చర్యముగా తోచవచ్చును. నాచుట్టును ఏవియో కొన్ని నీడలున్నట్లు నేను తరచుగా అనుభవించుచుందును. కొన్ని సమయముల వాని కొరకై నేను నావెనుక ముందుల చూచునంతటి సత్యముగా ఆ పవిత్రచ్ఛాయలు దేవతా స్వరూపములు తోచుచుండును. కాని అయ్యో! అవి దృగ్గోచరములు కావు. అదృశ్యములు ఏలయన వానికి రూపము లేదు.

86. ఈ ఆధ్యాత్మిక భావములు వ్రాయుచున్నది కూడ నేనుగాదు. లోనుండి ఆదైవమే వ్రాయుచుండెను. అప్పుడప్పుడు కొలదిగ అలసి ఇట్లను కొందును. "చలనరహిత,తరంగ రహిత దైవములో విశ్రమింతునుగాక!" నఖశిఖ పర్యంతము స్వయంప్రకాశమానమగు ఆ దివ్యతేజస్సును అనుభవించుచు దైవములోనే విశ్రమించుట యెంత యదృష్టము.

87. మీకు హాస్యముగ కన్పట్టవచ్చునుగాని శరీరము లేకుండుటయే యదృష్టము. ఇది హాస్యమేకాదు. ఆనందకరము. రక్తమాంస భూయిష్టమగు యీయస్థిపంజరమును మరచి సకలకష్టనష్టములకు, జరావ్యాధులకు నిలయమగు శరీరము నధిగమించి జీవించుట అదృష్టముకాదా ?

88. మండువేసవిలో సూర్యకిరణములను భరింపజాలనివారా సూర్యులకు సూర్యుడు తమలోనే కలదని బావింపకల్గిన కొంత యూరట చెందెదరు. అట్లే యెన్ని కష్టనష్టములు కలిగినను దివ్యశక్తి తమలోనే గలదని గ్రహించిన నవి యేమియు చేయజాలవు.

89. చల్లని నీలగిరిపర్వతము అతిశీతల ప్రదేశము. అచ్చట మలేరియా జ్వరమువచ్చి యెన్నియో దుప్పట్లు కప్పుకొనినను వణకుచునే యుందురు. కాని సర్వాంతర్యామియగు దైవపరిష్వంగములోనే యుంటిమని భావించు వారు వెచ్చని కరస్పర్శతో సుఖముగ నిద్రింపగలరు.

90. మంచియనున దెచ్చటనుండియైనను, పసిబాలుర నుండియైనను గ్రహించుకొనుటకు నేను సిద్ధముగా నుందును. వాస్తవమునకు యీ పసి పాపలనుండి, యీ పుష్పములనుండి, యీ మూగజంతువుల నుండి యభి వ్యక్త మగుచున్న దైవముగాక మరెవ్వరు ?

91. భౌతిక విజ్ఞానముతో నీ మనసును నింపినకొలది నది భారాన్వితమై నిన్ను కృంగతీయునేగాని, నీకు సుఖశాంతులు కలిగింప చాలదు.

92. అనారోగ్యవంతులెవరినైన చూచిన నాకిట్లు అనిపించును. అలసటచేతనో, మరి యితర కారణమువలననో శరీరము అనారోగ్యము నకు గురికావచ్చును. కాని యాత్మారామున కనారోగ్యమేలేదు. నిత్యమై సత్యమైన యాజ్యోతి సతతము ప్రకాశించుచునేయుండును.

93. ప్రార్థనాబల మపారము. అనారోగ్యముగానున్నవారి చెంత నుండు వారెవ్వరైన నిశ్శబ్దముగా ప్రార్థనసల్పుట చాలముఖ్యము. ఒకపర్యా యము శ్రీవిశ్వనాథముగారిట్లనిరి. “నాచెంత కూర్చుండి నాయనారోగ్య మును మీరు తీసుకొనిరి.” అట్లే యితరులనందరి నానంద పరచి యారోగ్య వంతులుగా చేయ నాహృదయము గోరుచుండును.

94. చల్లని నీలగిరి పర్వతములలో బాహ్యదృష్టతో బైటకుజని సూర్యుని వెచ్చనికిరణములలో జలకమాడవలెనని యుండును. నా యాంతర్య దృష్టితో చెంతనేయున్న పరుపుపై పరుండి యాయనంతుని నిశ్శబ్దపు పలుకులనాలించుచు ప్రేమసాగరమున తేలియాడవలెనని యుం డును. ఓ ప్రియతమ వత్సా ! వెచ్చని భగవంతుని పరిష్వంగములో నిమగ్నుడ వగుము.

95. చక్కని సూక్తులెన్నియో నాశ్రమగోడలందు జెక్కబడియున్నవి. కాని యవి యలంకార మాత్రమేనా యని నాకనిపించుచుండును. మన పొరుగు వారిని ప్రేమింప నభ్యసించుమాట యటుంచి మనల నర్థము చేసికొని యనుసరించుటలేదని గర్హించుట పొరపాటు.

96. ప్రపంచములోని ప్రజలందరు మనలను ప్రేమించవలెనని తలప రాదు. కొందరర్థముచేసికొనజాలక మనలను ద్వేషింపవచ్చును. కాని మనలో నుండి సతతము ప్రేమయే ప్రసరింపవలెను. దైవము ప్రేమస్వరూపికదా! అట్లు ప్రేమింపజాలనిచో మన కాధ్యాత్మిక తత్త్వమున ప్రవేశముగాని సంస్కృతితో పరిచయముగాని కలదని చెప్పుకొను నర్హతయుండదు.

97. జీవితము సరళముగా సాగుచున్నంతకాల మేమియు చింత యుండదు. కాని కష్టములు, నష్టములు, శోధనలు కలిగినపుడే యొకింత సహనము యోర్పు కలిగియుండవలెను. అవి జీవితమును పరీక్షించు గీటు రాళ్లవంటివి. అప్పుడు మీ హృదినుండి ప్రేమ చిప్పిలుచున్నదా లేదా యని పరీక్షించుకొనుడు.

98. బుద్ధునివలె కృష్ణునివలె మీరు కాదలంచిన తగిన మూల్యము మీరు చెల్లింపవలెను. వట్టిమాటలచే, పెదవుల కదలికతో చేయు ప్రార్థన లతో యెవరును సర్వజ్ఞుడగు దైవమును మోసగింప జాలరు. తగిన మూల్య మును చెల్లింపనిదే మీరెద్దియు పొందజాలరు.

99. భూదేవి యిట్లు చెప్పునట. "నేను దేనినైనను భరింతునుగాని యసత్యవంతుల భరింపజాలను" యని. ఆశ్రమములో యుండి కూడ నసత్యములు పలుకువారిని గాంచిన నా కెంతయో విచారముగ నుండును. వారిని దండించుటకు కూడ నామనసు నంగీకరింపదు. ఒక్కొక్కసారి వారి భవిష్యత్తును తలచి కొలదిగ మందలించినను యదికూడ నాకు కష్టముగనే యుండును. వారిని సరిదిద్దుటలో నా యమూల్యమగు కాలమునేల వ్యర్థ పుచ్చవలెనని యొక్కొక్కసారి విచారింతును. ఏమైనను వారుకూడ దైవ స్వరూపులేకదా ?

100. "ఇదికూడ వెడలిపోవునదే" ఆ భావన యెంతయో శక్తిని యుత్తేజితను కలిగించును. ముఖ్యముగ జనన మరణములవంటి క్లిష్టపరి స్థితులలోకూడ !

వెనుక నొక యధికధనాఢ్యు డింద్రియలోలుడై దుర్వ్యసనములన్నిటి పాలయ్యెను. క్రమక్రమమున నతని యారోగ్యము క్షీణించి యొక్క మెతుకు

కూడ తినలేని స్థితికి వచ్చెను. ఆ బాధలు సహింపజాలక అతడాత్మహత్య చేసికొనదలచెను. ఆతని యదృష్టముచే చిన్నతనముననే యొక మంచి గురువుకడ నుపదేశము పొందియుండెను. అతడు తన నిర్ణయము గురువు గారికి తెలియచేసెను. ఆతడు విచారించి "ఇదికూర వెడలిపోవునదే" యని యొక చీటిపై వ్రాసి దానిని పునఃపునః పఠింపవలసినదిగ నాదేశించెను. ఆతడట్లే చేయగా నా సిద్ధాంతము యొక్క సత్యప్రతిపాదన అతని యాంతర్య మునకు ద్యోతకమయ్యెను. తరువాత నతడుత్తముడుగా మారెను. ఈ మేఘములెంత దట్టమైనవైనను అవి స్థిరములుకాదు. సత్యములు కాదు. అవికూడ తొలగిపోవును. స్వయంప్రకాశమానమగు జ్యోతియొక్కటియే శాశ్వతము. సూర్యులకు సూర్యుడగు నా జ్యోతి నంటియుందుము గాక !

101. సర్వదుఃఖములకు మూలము "శరీరము తాననుకొను" భావనయే. రక్తమాంసపూరితమగు యీ యస్థిపంజరము నేనుకాదు. ఆత్మ స్వరూపమే నేను యని తెలిసికొన్నవారు ధన్యులు. శంకరులు నుడివినట్లు "శివోహం, శివోహం" యని తెల్పుచు సోహం భావముతో నుండుటే జీవన్ముక్తి.

102. ఎన్ని పరీక్షలు, శోధనలు, కష్టములు వచ్చినను యింకను "సేవ, సేవ" యని నాయాత్మ యగ్ని కణమువలె ప్రజ్వరిల్లుచునే యున్నది.

103. ఈ మిథ్యాజగత్తులో నజ్ఞానముచేత నహంకారముచేత యీర్ష్యా ద్వేషములచే పొడసూపిన ద్వైతభావన లెన్నియో యుండవచ్చును. కాని సత్యము మత్తగజమువంటిది. నిర్భయము సుస్థిరము. కుక్కలెన్నియో మొరిగి నను యేనుగునకేమి? యనెడు సామెత కలదు. అటులనే సత్యజ్ఞానముల ప్రతిహతమై సాగుచునే యుండును.

104. ఈ ప్రపంచ మానవులు నన్ను యర్థమొనర్చుకొనజాలక యెంతయో విమర్శింపవచ్చును. కాని నాకేమియు విచారములేదు. నానుండి ప్రేమయే వారికొరకు ప్రసరించును. ఆ విమర్శనయే నాకు యెంతయో మేలొనగూర్చును.

105. ఎవరినైనను పొగడి మెచ్చుకొనినచో వారు చాల నానందిం

తురు. కాని “సమః శత్రౌచ మిత్రేచ తథా మానావమానయోః” యని యాచరణయందు చూపగలిగినవాడే యాజకుడు. స్థితప్రజ్ఞుడు, అట్టివాడే సర్వులయందును దైవమును కాంచగలడు.

106. కాషాయవస్త్రములు ధరించుట చాల సులభము. పనిపాటలు చేయకయే యితరులను మోసపుచ్చి పేరు ప్రతిష్ఠలను యాహారవస్త్రములను సులభముగ పొందవచ్చునని వారు తలంతురు. అట్టి వారు మేకవన్నె పులుల వంటివారు, సత్యమెన్నటికి దాగునదికాదు. ఏనాటికైన గుర్తింపబడియే తీరును.

107. కాషాయమన ప్రజ్వలితాగ్నిహోత్రమువంటిది. ప్రాపంచక సుఖభోగములు, పేరు ప్రతిష్ఠలన్నియు నచ్చట భస్మము కావలెను. నిజమగు సన్యాసులు వేదాంత సింహములై సత్యగర్జన కావింతురు.

108. నే నెద్దియైన వ్రాయ తలచినపు డాంతర్యమునకుపోయి యా దైవానుభూతిని పొందుదును. కాని వ్రాయ మొదలిడినతోడనే దైవము మరుగునపడెనా యనిపించును. నన్ను నేను విమర్శించుకొనుచుందును. “వ్రాయుచున్న దా దైవమే” యనెడి భావన నాకు తిరిగి యూరట కల్గించును. దైవాజ్ఞ లేనిదే నొక్కగడ్డి పోచగూడ కదలదనుట సత్యముకదా !

109. జాగ్రత్ త్స్వప్న సుషుప్త్యావస్థలయందు నొక్క క్షణమైనను మనలో దైవము లేనిక్షణములేదు. అట్టి దైవమును గుర్తించుట కష్టమైనను యసాధ్యము మాత్రము కాదు. దైవసాక్షాత్కారమును తీవ్రముగా వాంఛించు వారికి మాత్రమే యది సాధ్యమగును.

110. దైవానుభూతిని పొందుటకు గుడులలో, గోపురములలో, మసీదులలో, చర్చిలలో మాత్రమే సాధ్యమనియు ప్రార్థన ధ్యానాది సమయములే యందుకు తగినవనియు భావించుట పొరపాటు. ప్రతిక్షణమునందు ప్రతికార్యమునందు, ప్రతి శ్వాసయందు యెడతెగక దివారాత్రములు దైవానుభూతిని జీవితమంతయు పొందుటయే మానవజీవిత ధ్యేయమై యుండవలెను.

111. నిరాశా నిస్పృహలతో నాందోళనకరమగు యీ జగతిలో నానందము మృగ్యము. ఎవరైన నన్ను చూచుటచే ఆనందము పొందిరేని

యేదో యొక రూపమున నావలన నితరుల కానందము కలిగినదికదాయని యది నా పూర్వజన్మ సుకృతమనియు తలచుచుందును. మంచితప్ప శాశ్వత ముగా నుండునదేదియు లేదు. మంచిచేయుటయే ధర్మము. ధర్మమేదైవము.

112. క్షణములో కోట్యంశభాగమైనను దైవమును మరచినచో నాకు నిరుత్సాహముగను నిర్జీవినై యున్నట్లుగను తోచును. కన్నుమూసినను తెరచి నను లోపలను వెలుపలను యాదైవమే. లోపలను వెలుపలను ప్రత్యణువు నందు నాదైవానుభూతిని కాంచుటెంత ధన్యము !

113. సన్యాసులైనను, సాధువులైనను యే గుడ్డలు ధరించినను యితరుల కాదర్శ ప్రాయులుగా నుండదలచినవారు ప్రజ్వలితాగ్ని హోత్రమువలె మలిన రహితముగా నుండవలెను. కోటిసూర్య ప్రభాభాస మానమగు దివ్య తేజస్సుతో ప్రకాశించువారికే గాని యితరుల కదిసాధ్యము కాదు.

114. కోరికలు యెట్టివైనను, మంచివైనను చెడ్డవైనను మానవునకు బంధహేతువులే. ఒకటి బంగరు సంకెళ్లు, రెండవది యినుప సంకెళ్లు. ఏదైనను బంధమే. ఈ సందర్భమున పురాణమందలి యితివృత్త మొకటి తలపునకు వచ్చుచున్నది.

ఒక సమయమున నొక సాధుపుంగవుని యాదర్శజీవితము ననుస రించుటచే మానవులెవరు నరకమునకు పోనవసరము లేకుండెడిదట. యమభటులు తమకుపనిలేదని చింతించి యమధర్మరాజుతో ఫిర్యాదుచేసిరి. యముడు కొంతతడవాలోచించి యిట్లు చెప్పెను. "మీరు విచారింపకుడు. ఈ సాధువు తన భక్తులతో స్నేహితులతో నాశ్రమమొకటి స్థాపింప చూచు చుండెను. దానితో నతనికి పతన మారంభమగును" కాన కోరిక యెట్టి దైనను బంధనమే అది మానవునకు పతనహేతువు.

115. వాసన లతిబలీయములైనవి. ఎంతటి తెలివి గలవారైనను, పండితులైన నా మాయలోబడి దైవమును మరచుట తప్పదు. ఈ మాయ చేతనే క్రీనీడలవంటి పేరు ప్రతిష్ఠలవెనుక పర్వెత్తెదరు గాని తమలోనే దివ్యతేజస్సు కలదని తామే దివ్యస్వరూపులమని మరచెదరు. వాసనాక్షయ మగుటతోడనే యా తేజస్సే మీరే అయి వెలుగగలరు.

(శాంతి ఆగస్టు 1976 నుండి ఏప్రిల్ 1977 వరకు)

## జీవితము యొక్క విలువ

దుర్లభమైన మానవజన్మ యొక్క ఆధిక్యమును, విలువను గ్రహించిన వారే కాలము యొక్క విలువనుగూడ గ్రహించగలరు. నా కాలము చాల విలువైనదని తరచుగ విలువైన కాలమును మాటలతో వ్యర్థము జేయుచున్న వారితో జెప్పుచుందును. నా కాలమే అననేల, మీకాలము మాత్రము విలువైనది కాదా ?

నా వద్దనున్న సీతారం అనెడి పిల్లి పిల్లను జూచిన అది గంటల కొలది అటులనే నిద్రించుచుండ, దానికి కాలము యొక్క విలువ తెలియదు గదాయని తరచు దానిని చూచినప్పుడు నాకు తోచుచుండును. జంతు జాలమునకు కాలము యొక్క విలువ తెలియకున్నను పూర్వ జన్మ సుకృతముచే మానవజన్మను పొందిన మానవులకైనను, కాలముయొక్క విలువ తెలియకుండ క్షణములు, నిముషములే గాక రోజులు, వారములు, నెలలు, సంవత్సరములుగూడ వ్యర్థమైన ఆలోచనలతో నిరుపయోగమైన మాటలతో వ్యర్థమగుచుండుట చాల విచారకరమైన, విషాదకరమైన అంశముగదా!

ఈ మధ్యను కొందరు స్త్రీలు విలువైన వస్తువులతో తమ్మలంకరించు కొని ఆశ్రమమునకు వచ్చిరి. మీరు ప్రార్థనచేయుచుంటిరా యని యడుగగా వారు లేదనిరి. వారి ఒడిలోనున్న పిల్లల అవస్థను, భావిస్థితిని ఆలోచించగా నాకు చింతగలిగెను. తండ్రి హరి జేరుమనియెడి తండ్రి, తండ్రి. యని భాగవతము జెప్పుచున్నది. దైవ సన్నిధిని జేర్చెడివారే నిజమైన తల్లితండ్రులు తాము ప్రేమించెడి తమ పిల్లలగురించియైనను తాము ప్రార్థన జేయుచు, తమ పిల్లలచే ప్రార్థన చేయించవలసిన బాధ్యత తల్లిదండ్రులకు లేదా ? నోరులేని మూగజంతువులు ప్రార్తన చేయుటలేదనిన ఆశ్చర్యములేదు. నోరు గలిగి యుండియు అన్ని జన్మలలో నుత్తమమైన నరజన్మను పొందిన మానవులుగూడ ప్రార్థన చేయుట లేదనిన అట్టివారిని ఏమి అనవలెను?

అట్టివారినే రెండుకాళ్ళ జంతువులని విజ్ఞులు నుడివియుండిరి. అమూల్యమైన నరజన్మను పొందియు ప్రార్థనధ్యానములు చేయని నరులు

గమ్యస్థానమును మరచి విలువైన జీవితమును, కాలమును, జంతువుల వలె వ్యర్థముచేయరాదు. ఇట్టివారిని గురించియే భాగవతములో చక్కనైన యీ క్రింది పద్యము చెప్పబడెను.

గీ. చేతలారంగ శివునిపూజింపడేని
నోరు నొవ్వంగ హరికీర్తినుడువడేని
దయయు సత్యంబులోనుగాదలపడేని
కలుగ నేటికి దల్లుల కడుపుచేటు

క్షణములను వ్యర్థము చేయువారు జీవితమునంతను వ్యర్థము చేయుదురు అని మన ఆశ్రమములో చాలచోట్ల వ్రాయబడియున్నది.

ఈ చిన్న వాక్యములో నెంత గంభీరమైన భావము గలదు! ఇట్టి మహావాక్యములను సదా చదివిన, స్మరించిన ధ్యానించిన కొంత ఉపయోగము కలుగును. కాలము యొక్క విలువకూడ గ్రహింప నగును.

జరిగిన దానికి విచారించిన లాభములేదు. ఇదివరకు వ్యర్థబుచ్చిన కాలము మనమెంత విచారించినను మరలరాదు. ప్రస్తుతము అమూల్యమైన క్షణములను వ్యర్థబుచ్చకుండ సద్వినియోగము చేయుడు. ఒలికి పోయిన పాలకై విచారింపక, ఇకముందైనను పాల నొలికిపోకుండ కాలము వ్యర్థము కాకుండ సదా యెన్ని పనులలో నున్నను దైవనామ స్మరణను జేయుచు దినదినాభివృద్ధిని గాంచుచు దీపము ఆరిపోకుండగనే తరించుటకు అహర్నిశములు ప్రయత్నము చేయవలెను.

"నేడే మనది. రేపు మనదికాదు" అని మరియొక మహావాక్యము ఆశ్రమములో వ్రాయబడియున్నది. నేడు మనది అని యెటుల చెప్పగలము? ఏ క్షణమున నేమి జరుగనున్నదో మనము చెప్పజాలము గదా ! మృత్యువు, మనతో చెప్పియైనను రాదుగదా !

కాన ఈ క్షణమే మనదని చెప్పవలెను. మానవుని పుణ్యపాపములు మాత్రమతడు చనిపోయిన నతనిని వెంబడించును. కొదువ ఆస్తులన్నింటిని,

వస్తువాహనములన్నిటిని, సిరిసంపదలన్నిటి నిచ్చటనే అనగా ఈ లోకము నందే యెచ్చటనున్న వాని నచ్చటనే వదలిపెట్టవలసి యుండును. ఎంత లుబ్ధుడైనను మొనబోయిన గుండుసూదినైనను, మొలనున్న తన మొలత్రాటినైనను తనవెంట తీసికొని పోజాలడు. అట్టి స్థితిలో తెలివిగల స్త్రీపురుషాదులందరును అతి ఉత్కృష్టమైన తమ మానవజన్మయొక్క ఆధిక్య మును గ్రహించి, ఏదినిత్యమో, సత్యమో, శాశ్వతమో, దేనిని తమ వెంట దీసికొని వెళ్ళగలరో, ఏది శరీరము విడచినను తమవెంట ననుస రించునో అద్దానినే, దైవనామామృతమునే నిరంతరము, ప్రార్థన ధ్యానాదులు చేయుచు, గ్రోలుచుండవలెను.

గృహస్థులైనవారు తాము తరించి, తాము ప్రేమించెడి తమ బంధు వులు, తమ పిల్లలు, అందరు తరించుటకు తోడ్పడుచుండవలెను.

ఈ శరీరములు యితరుల సేవకొరకే యివ్వబడెనని శాస్త్రములు “పరోపకారార్థ మిదం శరీరం” అనువాక్యములో చెప్పుచున్నవి. కాన మనము చేయవలసిన సేవను, ఉపకారమును, మంచిని నేడేచేసి మనము తరించి, మనవారందరకు, మన స్నేహితులకు శక్తికొలది తోడ్పడుచు మనము, వారు అందరు తరించుటకై ప్రయత్నింపవలెను.

భక్తులైనవారికి, దైవపరితాపముతో నిండియున్నవారికి ఒక చిన్నమాట చాలుననియు, దైవచింతనలేని భక్తిహీనులకు కోటిమాటలు చెప్పినను నిరుపయోగమని పెద్దలు చెప్పియుండిరి. మీరందరు భక్తులు గాన, ఈ బోధలను ఒక చెవిలో ప్రవేశించినవాటిని మఱియొక చెవిద్వారా బయటకు పోనీయకుండగా మీ హృదయములను శాంతితో, దైవప్రేమతో నింపుకొని ఎన్నిపనులలో నున్నను నిరంతరము దైవనామస్మరణజేయుచు తరించగోరెదను.

వెఱ్ఱిమానవులు తలచుచున్నట్లు పనులెప్పుడును దైవనామస్మరణకు అడ్డురావు. ఒక భక్తవరేణ్యుడు ఒక చెయ్యి పనిచేయుచున్న రెండవచేతితో దైవసేవ చేయమనిచెప్పెను. రెండుచేతులును పనిచేయుచున్న నోటితో దైవ నామమును స్మరింపవచ్చును. రెండుచేతులకు పనిలేనప్పుడు, చేతులతో,

నోటితో, మనస్సుతో, హృదయముతో నూరుపాళ్ళు మనస్సుతో దైవ ధ్యానము జేయుచు తరింపవచ్చునుగదా ! దైవ పరితాపము గలిగిన వారికి మోక్షము అరచేతిలోనే –చెంతనే–తమలోనేయున్నది. ఇక దైవపరితాపము లేని వారికో– అట్టివారికి యీ జన్మలోనేగాక, కోటి జన్మములెత్తినను మోక్షము దూరముగనేయుండును. ఈ వ్యాసము వ్రాయుచుండ “దొరకదురా యీ నరజన్మ” అని యొకభక్తుడు చెప్పిన కీర్తన జ్ఞప్తికి వచ్చుచున్నది.

ఉత్తమమైన యీ నరజన్మమును స్వార్థముతో నింపి దుర్వినియోగము జేసిన మరల నరజన్మ యెటులదొరకును? కాన ‘దొరకదురా నరజన్మ మరల’నని దైవ భక్తులు కీర్తించుచున్నారు. బొందిలో ప్రాణముండగనే మనము చేయవలసిన ఉపకారమంతయు, సేవనంతయు, మనవారికి, మన సన్నిహితులకే గాక వారువీరనక దగ్గరవారికి దూరమువారికి అందరకును సేవచేయుచు మీరందరును తరించెదరుగాక ! నేడీవ్యాసమును చదివిన జ్ఞాపకార్థముగా శాంతి ప్రార్థనను వల్లించి సదా స్మరించుచు తరించుడు.

దైవము మీ అందరిని ఆయురారోగ్యములతో నిరంతరము బ్రోచుగాక!

లోకాస్సమస్తాస్సుఖినోభవత్తు హరిః ఓం తత్సతత్

## నావద్ద ఆశ్రమములోనుండువారి వల్ల నేను ఆశించునదేమి?

1. ఆశ్రమములోనుండు భక్తులు ఉషారుగానుండి ఆంతర్యమున, బాహ్యమున సదా దైవజ్ఞప్తితో ఉండాలి.

2. భగవంతుడు ప్రసాదించిన అమూల్యమగు మానవజన్మను, వృధా చేసుకొను వారిని చూచిన నాకు చాలాబాధగా నుండును.

3. సోమరిపోతులను ఆశ్రమములోనుండుట చూచినా, నేను సహించలేను, అట్టివారివల్ల ఇతరులు కూడ చెడెదరు. సోమరితనం అంటువ్యాధి.

4. ఆశ్రమ జీవితము గడుపువారికి ఒకే ఒక ముఖ్యషరతు ఉన్నది. ఆ నియమము ఏమనగా, ఆశ్రమములో దైవజ్ఞప్తితోనె సదా ఉండాలి. ఇతర చింతనలు విడువాలి. బ్రహ్మముహూర్తములో లేవాలి.

5. ఆశ్రమవాసులను, భక్తులను సందర్శకులను, నేను కోరునదేమనగా సంసార బాధలను పూర్తిగ మరచి లోకశాంతి ప్రార్ధనను భక్తిశ్రద్ధలతో చేయుచు, సదా దైవజ్ఞప్తితో ఆశ్రమములో కాలంగడపాలి. కోరికయేబంధన యను సత్యం ఎన్నడు మరువరాదు కోరికలు జన్మలకు కారణము.

6. నేను ముఖ్యముగ కోరునది ప్రతిక్షణము ధ్యానములోను, లేక స్వార్ధరహితసేవలో గడుపగలగాలి. ప్రతిక్షణము అమూల్యము. అట్టి అమూల్య కాలమును తెలిసిగాని, తెలియకగాని వృధాచేయువారు, అనవసర ప్రసంగములతో ఆధ్యాత్మిక జీవితమునకు అవరోధము తెచ్చుకొందురు.

7. స్వార్ధులకు, ఆశ్రమములో స్థానము లేదు. నా హృదయములో వారికి అంతకంటె స్థానముండదు ?

8. భోజనమునకు, భోజనముకు మధ్యను చిరుతిండి తినుట మంచిది కాదు. పగలు నిద్రపోవువారిని చూచిన నాకు కష్టముగా యుండును. అది ప్రతివారిలో, సోమరితనమునకు దారితీయును.

9. నేను కోరునది, ఆశించునది, నిరుత్సాహులుగా నుండుట కాదు. మొఖము మాడ్చుకొనియుండుటకాదు. ఉత్సాహముగా, సంతోషముతో, నవ్వుచూ, సదా దైవచింతనతో వుండాలి.

10. స్వార్ధముతోను, కునికిపాట్లు, ఏమరిపాటుగా ఉండుట ప్రమాదము. ఈ దిగువ పద్యము భావము దీని రుజువు చేయును.

“స్వర్గ ద్వారమువద్ద ఒక భక్తుడు, వెయ్యి సంవత్సరములు కాచియుండెనుగాని, ఒకకునికిపాటువచ్చినది, అప్పుడే స్వర్గద్వారము తెరువబడెననియు, వెంటనే మూయబడెననియు ననిరి. ఆహా ! ఇతని ప్రయాస అంతయు వృధా అయ్యెనుగదా ? ఒక కునికిపాటువల్ల” సోమరుల జీవితము ఎంత హాని కరమో మరువరాదు. ఏమరిపాటు కూడదు.

11. ఏపనిలేని సోమరులమెదడులో దయ్యములు నాట్యము చేయునన్న వాక్యము ఎంతో సత్యము. పనియే ఆరాధనగాన మనము సదా ఏదో మంచిపనిని ఆచరించుచు కాలము సదా సద్వినియోగము చేయవలసియున్నది. అప్పుడు సోమరితనమునకు తావుండదు.

12. ఎంతపనియైనను ఎప్పుడు ఎవరిని, చంపదు, గాని మనోవ్యధ అనేక మందిని నశింపజేయును.

13. నావద్దనున్న పిల్లలను పెద్దలను, నేను సదాకోరునది, విశ్వప్రేమ, విశ్వమానవ సౌభ్రాతృత్వము, నిస్కామసేవ, ప్రతిఫలముకోరని ప్రేమ.

14. నేను స్వార్ధరహితులను రక్తబంధువులుగా భావింతును. స్వార్ధులను, రక్తముపీల్చు జోరీగలుగా భావింతును. ప్రపంచములో పేరు ప్రతిష్టలకు లొంగనివారిని, ఆశించిన వారిని, నిందాస్తుతులను సమంగా చూచుటకు యత్నించువారిని, ఆత్మబంధువులుగ ఎంచెదను. అట్టివారికి నా జోహారులు !

15. ఎవరిలోను, ఎన్నడు, చెడుచూడకుండుట, అందరిలోను దైవమునే చూచుచు, మంచినేచూచుచు ఆనందముతో, ప్రేమతో నుండగలుగువారు, అట్టి స్వార్ధరహిత జీవితములకు జీవితమును అంకితము

చేసినవారు ప్రతిక్షణము అమూల్యముగ నెంచగలరు.

16. క్షణములు వ్యర్థముచేయువారు. అమూల్యమగు జీవితము నంతను తెలియకుండగనే వృధాచేసుకొనెదరు.

17. ఆశ్రమవాసం చేయగల అదృష్టవంతులవద్ద నేను ఆశించునది మంచి సమర్థత, స్వార్థరహితసేవ నిత్యం ధ్యాన నిమగ్నులై యుండుట. మౌనం బాగా పాటించగలుగుటయును. అందరకు ఆశ్రమ సేవ, నివాసం ప్రాప్తించకపోవచ్చును, ఇప్పుడు దైవకటాక్షముచేత లభించిన అమూల్య అవకాశమును సద్వినియోగపరచెదరుగాక !

18. ఈ ఆశ్రమ స్థాపన ముఖ్యఉద్దేశ్యము భగవంతునిలో సదా నివసించుట. ఇతరులు కూడ అట్లు చేయుటకు తోడ్పడగలవారుండాలి. అనగా తాము ధర్మ ప్రవృత్తులైయుండి, ఇతరులను కూడ దర్మాచరణపరులుగా జేయు దీక్షగలవారుండాలి.

19. మానవసేవయే మాధవసేవ యని సదా తలంచుచుండువారుండాలి.

20. పరోపకారర్థ మిదం శరీరమని, సదా జ్ఞాపకముంచుకొన గలిగిన వారుండాలి.

21. పరస్త్రీని తల్లివలె భావించగలిగిన వారు, పరద్రవ్యమును విషతుల్యముగ చూడగలవారుండాలి.

22. ధర్మో రక్షతి రక్షితః అనుమహాభారత సారమును నిత్యము జ్ఞాపకముంచుకొనగలిగినవారుండాలి.

23. ద్వేషించువారిని దూషించువారిని కూడ దైవసమానులుగ జూచి ప్రేమించుటకు ప్రయత్నములు చేయువారుండాలి.

24. అబద్ధమాడుట, చేసినమేలును మరచుట మహాపాపములుగ గుర్తించువారుండాలి.

25. గాంధీమహాత్ముడు బోధించినట్లు, భోజనం శరీరమునకు

ఎంతగా అవసరమో, అంతే సాత్విక ఆహారం భుజించ ప్రయత్నించువారును ఈ మానవజన్మ భోజనమునకేగాదు దైవమును, తెలుసుకొనుటకే యని, సదా జ్ఞాపకముంచుకొనగలరు. జిహ్వాచాపల్యము లేని వారును,

26. భగవద్గీత, రామాయణం వగైరా సద్గ్రంథపఠనయందు ఆశక్తి గలవారును.

27. ఇతరమతములను ఎన్నడు ద్వేషింపనివారు, అన్ని మతములలో యున్న దైవము ఒక్కడే యని తెలుసుకొని, అందరికి మతసామరస్యమును బోధించుటయందు ఆసక్తిగలవారును.

28. మనదేశమునకు శాంతి ఆశ్రమమునకు మంచిపేరు ప్రతిష్ఠలు సంపాదించుటకు ప్రయత్నము చేయువారు. (అమూల్యమైన) మానవజన్మ మరువనివారును.

29. అందరిలోను కృష్ణుని (దైవమును) చూచుచు అందరిని ప్రేమించ గలిగినవారును.

30. ఇతరులలోమంచినే సదాచూచుటకు ప్రయత్నించువారును

31. తమ తప్పులను సదా తెలుసుకొని వాటిని సవరించుకొనుటకు ప్రయత్నం చేయువారును.

32. ప్రపంచములో పేరుప్రతిష్టలకు తాపత్రయపడక, నిత్యము సుఖ శాంతులు గలుగజేయు భగవధ్యానపరులు, ధర్మానుష్టానపరులు,

33. పూర్తిగా మౌనం పాటించలేకపోయినను మితంగాను, హితం గాను సత్యమును, ప్రియంగా మాట్లాడుటకు సాధనచేయువారును.

34. అమూల్యమైన కాలమును వృధాచేయక నిత్యము సత్కాలక్షేపము సద్గ్రంథపఠన చేయువారు, సర్వుల ప్రేమ క్షేమం కోరుచుండువారు ఆశ్రమాభివృద్ధిని అనగా ధర్మాభివృద్ధిని సదా అపేక్షించువారును.

35. సదాపవిత్రమైన భరతమాతకు సుపుత్రులుగ సుపుత్రిలుగ నుండ గోరువారును.

36. భగవంతుడు మనకు తెలియకుండగనే మన హృదయ నివాసిగా యుండి మన ఊహలను ఆలోచనలను గమనించుచుండునని గ్రహించు వారును.

37. మహాత్ముడు జీవితమంతయుతిరిగి రామరాజ్య స్థాపనకోరి, చివరకు హేరామ్! అని ప్రాణమువిడుచుట మరువక, తిరిగి రామరాజ్యం చేయుతలంపు గలవారును.

38. నిరంతరము శాంతిప్రార్థన భక్తిశ్రద్ధలతో జేయుచు, శాంతి ఆశ్రమమును ఆదర్శప్రాయముగ జేయు తలంపుగలవారును.

39. శాంతి ఆశ్రమములో, జరుపబడువర్ధంతులను, జయంతులను శ్రద్ధగా గమనించి, వాటిప్రయోజనములను తెలుసుకొని, వాటిని ఆచరణలో పెట్టు తలంపుగలవారును.

40. ఈ శాంతి ఆశ్రమ సిద్ధాంతము ప్రకారము అన్ని మతములలో ఉన్న దైవము ఒక్కడేయనియు, సర్వమతసారాంశము ప్రేమయేయని గ్రహించి మన దేశములో మతసామరస్యమును పెంపొందించు దీక్ష గల వారు, మతమార్పులు అనవసరమని చెప్పగలవారును.

41. తల్లి, తండ్రిని, గురువును అతిథిని దైవతుల్యులుగ జూచి ప్రేమించ గలిగినవారును.

42. ఈ ప్రపంచమంతయు ఒకే కుటుంబముగ భావించి అందరిని ప్రేమించగలవారులు.

ఈ ప్రపంచమునకు మనము వట్టిచేతులతోనే వచ్చితిమి, తిరిగి వట్టి చేతులతోనే విడువవలసియుండునన్న సత్యమును ఎన్నడు మరువని వారు ఎప్పుడో ఒకప్పుడు యీ ప్రపంచమును అందరం విడువవలసిన వారమేనను సత్యమును మరువక, ప్రపంచ వ్యామోహం విడిచి ధర్మ వ్యామోహంతో జీవించగలవారు ధన్యులు.

తిరిగి మానవ జన్మలభించునో లేదో జెప్పజాలము.

కర్మభూమిలో లభించునో లేదో చెప్పలేముగదా ! గావున భగవంతు

డిచ్చిన యీ సదవకాశమును అందరు సద్వినియోగం చేయుటకు నిత్యం ప్రయత్నించెదరుగాక !

ఇతరులను సంస్కరించు తలంపు విడిచి తమంతట తాము సంస్కరించు కొనుటకు నిరంతరము ప్రయత్నం చేయువారు ఎవరి అభివృద్ధి వారి యందేవున్నదను సత్యం మరువరాదు.

(శాంతి నవంబరు 1981)

## నీటిబుగ్గవంటి జీవితము

ఒకానొక రోజున సముద్రతీరమున ధ్యానము జేయుచు, చక్కనైన అనుభవమును పొందెడివరకు అచ్చటనుండి లేవరాదనెడి నిశ్చయముతో అటులనే ధ్యానించుచుంటిని. మనిషియొక్క జీవితము యెంత చదువరి యైనను, ధనవంతుడయినను, యెంత జ్ఞానియైయున్నను బుద్బుదప్రాయము గదా !

సముద్రపు యొడ్డున నీటి బుడగలు యెటుల ఉత్పత్తి అగునో, ఎటుల మనము జూచుచుండగనే మాయ మవ్వుచుండునో, మీరెప్పుడయినను జూచి యుండిరా ! జీవితము అంతలో వున్నది. అయినను, కించజ్ఞత్వము గలిగిన మనుజుడు, తానే సర్వజ్ఞుండనని, అన్నియు తెలిసియున్న వాడనని డంబము కొట్టుచు, ప్రగల్భములు పలుకుచు, అహంకారములో నిండియుండి, తన పాదములు భూమికి ఆనకుండగ, ఆకాశములో నడుచుచున్నట్లు సంచరించు చుండుట హాస్యాస్పదము.

కళాశాలలో యున్న పరీక్షలన్నింటిలో జయము పొందియున్నను, లోకములో యున్న ధనమునంతను సంపాదించగలిగినను, గొప్ప పేరు ప్రతిష్టలతో తులతూగుచు, ప్రపంచ మంతటా మహాబలవంతుడయి యున్నను, మనుజులయొక్క జీవితము గడ్డిపరకయొక్క చిన్నపువ్వువంటిదే గదా ! ఆ పువ్వు సడలును. అది కృశించి నశించును.

మానుష్య జీవితము అంతలోనే యున్నది. నేడున్నవారు రేపుండక పోవచ్చును. ఆ మరునాడు లేకపోవచ్చును. కాలచక్రము మహావేగముతో తిరుగుచున్నది. సుడిగాలివంటి మహా ప్రవాహములో మనుజుడు దారి, తెన్ను లేక కొట్టుకొని పోవుచుండెను.

ఎచ్చటకు ? అధోగతికి. తమ జీవితము యొక్క గమ్యస్థానమును యెరింగి, తమ దుర్దశను గ్రహించియున్న వారి జీవితములు గూడ కొంత అదృష్టమైనవే.

సముద్రతీరమున ఆ యిసుక తిన్నెమీద పరుండి 'ధ్యానము'

జేయుచుండ ఆకోటానకోట్లు యిసుక రేణువులలో మనుజుని జీవితము ఒక ఇసుక రేణువునకయినను పోలజాలదే, అని చింతించ దొడగితిని. అప్పుడా యిసుకరేణువను చేతిలోనకు తీసి, ప్రత్యేకించి రేణువవైపు జూచుచుండ అది మెరయ నారంభించెను.

ఓ మనుజుడా ! చూడుము. ఆ చిన్న యిసుక రేణువు, తళక్, తళక్ మనుచు మెరయుచున్నది. నీ జీవితములో మెరపుయేది? నీ వేమయిన మెరయుచుంటివా? నీ మెరుపును యితరులతో పంచుకొనుచుంటివా? లేక సదా మరుపులోనే, మృత్యువునందే జీవించుచుంటివా?

దుర్లభమయిన మానవ జన్మను బడసియు, చిన్న యిసుక రేణువంత విలువైన జేయని, ప్రకాశములు లేని జీవితములు, భూభారమేగదా! ఈ ఆలోచనలతో, నెమ్మదిగా ఇసుకలో, సముద్ర తీరమున నడచుచు వచ్చుచుండ ఒకచోట యిసుకలో కప్పుబడియున్న ఒక మూగ జంతువుయొక్క కళేబరము కనపడెను. అది యే దురదృష్టమైన జంతువుదో ! యెప్పుడు యెటుల చనిపోయెనో ! నీటిలో బడియుండుటచే కాబోలు దాని శరీరము వుబ్బి యున్నది. సముద్ర కెరటములచే, కొట్టబడి యిసుక పోయినందున సగము శరీరము కనిపించుచున్నది.

అప్పుడు యిటులనే నిలువబడి, ఆ వుబ్బిన శవమును జూచుచు 'ఆహా! మనిషి యొక్క బాహ్య జీవితము బుద్బుదప్రాయమే. నీటిబుడగ వంటిదేగాక, అతి అల్పమయిన, చిన్న యిసుక రేణువ వంటిదేగాక, చివరకు ఈ శరీరములు అన్ని శరీరములు, ఈ దిక్కుమాలిన విషాదకరమయిన దుర్దశకు రావలసినవేగదా !

ఇదియేనా మనుజుని, ధనవంతుడయిన, చదువరియైన, బలవంతు డైన, సర్వశక్తుడనని భ్రమించుచు దేశములను, లోకమును మార్చుటకు ప్రయత్నించుచున్న సంస్కర్తల గతి, అందరి మానవుల గతియును?

ఎట్టి వారికయిన బాహ్యజీవితము యొక్క గతి యిదియే. ఇక ఆంతర్య జీవితము యొక్క గతియో? నివృత్తి జీవితము యొక్క గమ్యస్థానమో? దాని గమ్యస్థానము కోటిసూర్యుల దివ్యతేజస్సే !

ప్రియమైన పాఠకులారా ! ఆ దివ్యతేజస్సును మన జన్మ హక్కయిన ఆ అఖండ తేజస్సు నెప్పుడు ధ్యానించుచు, బాహ్య జీవితముల నందు ఆహుతి జేయుచు, శాంతిని బడయుదము గాక !

సర్వేజనా స్సుఖినోభవంతు

ఓం తత్సత్ ఓం

# దైవము

ప్ర: దేవా నీవెప్పుడు వచ్చితివి ?

స : నేను బహుకాలము క్రిందనే వచ్చితిని. నీవు జన్మించినప్పటి నుండియు నీతోనే నుంటిని,కాదు,కాదు, నీవు జన్మించక పూర్వమే అనాదిగా నీతో నున్నాను. నీతో నుండని క్షణమేదైన నున్నదా? అనాదిగా నీలోనే వున్నాను. సర్వదా నన్నంటియున్న నిన్ను మరచి నిర్లక్ష్యము చేయుట నా దెంత తెలివితక్కువ ? సమీపముననే నిరీక్షించుచున్న తల్లినిమరచి సముద్ర తీరపుటిసుకలో ఆటలో నిమగ్నుడైన పసిబిడ్డ చందమున నున్నది నాతీరు. ఆటతో అలసీ సొలసి విసిగినప్పుడుగాని బిడ్డకట్టిన గూళ్లనువదలి, నాశనము చేసి, తల్లి యొడిలోనికి పరుగిడడు.

నా చెంతను, కాదు, నాలోనేయున్న నిన్ను మరచి సందేశములు, లేఖలనెడి ఆటలలో మునిగి తేలుచున్న నాదెట్టి బాల్యచేష్ట! కోటిసూర్య సమాభాసమైన నీజ్ఞానతేజము ముందు యీ సందేశములెంత అల్పమైనవి? నీముందు మాటలురావు, భావము నశించినది. కరములాడుటలేదు. మనసున ఆలోచనలు రూపుమాసినవి. వ్రాయుట కేమియు మిగులలేదు నా ఆట కూడ ముగిసినది.

ఆహ్వానింపబడని అతిధివలె నా హృదయ కుహరమున ఆసీనుడవై యున్ననూ నిన్ను గానక అయ్యో! అమాయక బిడ్డవలె నా లక్ష్యము. నాఆత్మ, నా సర్వమైన నిన్ను మరచి ఆటలో పడియుంటిని. నా హృదయ మానందముతో యిప్పుడు యిట్లు పలుకుచున్నది.

ప్రభువు పవిత్రమైన దేవాలయములో నుండెను. ప్రపంచమంతయు నిశ్శబ్దముగ యుండనిమ్ము !

ప్రియ ప్రభూ! నీవు వచ్చితివి. నీవు సదా నాతోనే యుంటివి. బాహ్యమున నిన్నే కాంచుచున్నాను. అంతరంగమున నిన్నే వీక్షించుచున్నాను. సర్వత్ర నీవే అగపడుచున్నావు.నేనింకేమి చెప్పను? యేమి వ్రాయను?

ఓ ప్రభువా ! మాట్లాడుము. నీ సేవకుడు వినగోరుచున్నాడు.

నా ఆట ముగిసినది. నీవే నా తల్లివి, తండ్రివి, హితుడవు, సర్వస్వము. నీలో నన్ను ఐక్యమవనిమ్ము. అనంతముగా నీలోనే యుండనిమ్ము.

నీవు వచ్చితివి. నేను ఆనందపారవశ్యములో మునిగియున్నాను.

ఓం ఓం ఓం

శాంతి శ్శాంతి శ్శాంతిః

# దైవానుభవము

పూర్ణము బ్రహ్మము, జగమిది పూర్ణము
యాపూర్ణునుండి పూర్ణము వెడలెన్
పూర్ణంబగు నీ జగతికి
పూర్ణత్వముగూర్చి యింక పూర్ణమే మిగులున్

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

దైవానుభవమే మానవుని జీవితమునకు ఆధారము, పరమావధియే గాక, గమ్యస్థానమై యున్నది.

దైవానుభవము లేని జీవితము చమురు లేని దీపము వంటిది. అది కేవలము భూభారము. అట్టి వ్యర్థమైన ప్రకృతి జన్మల భాగవతములో యీ చక్కనైన, క్రింది పద్యమును జ్ఞప్తికి తెచ్చుచుండును.

చేతులారంగ శివుని పూజింపడేని
నోరు నొవ్వంగ హరికీర్తన నుడువడేని
దయయు, సత్యంబు లోనుగాదలుపడేని
గలుగనేటికి తల్లులా కడుపుచేటు !

దైవమును ప్రార్థన ధ్యానాదులతో భజనలు జేయు సమయములలో అనుభవించుట సహజమే, తేలికయేగాని దైవమును పనిబాట్లు చేయు నప్పుడు, నిత్యకర్మానుష్టానములలో మునింగి యున్నప్పుడు గూడ అనుభవించుట ముఖ్యావసరము.

నేడీ వ్యాసమును వ్రాయుటకు ముఖ్యకారణము నాలో వుద్భవించిన చిన్న ప్రశ్న, ఆ ప్రశ్నావిమర్శనయే యీ వ్యాసమురూపముగా, పరిణమించుచు నా ఆంతర్యభావనలు వ్రాయబడుచుండెను.

దైవమును, ఏ పనీలేనప్పుడు అనుభవించుట, వ్యక్తపరచుట తేలికయా, లేక తాను చేయవలసిన విధికృతమైన పనులలో యున్నప్పుడు,

వ్యక్తపరచుట సులభమా ? ఏపనీలేనివాని మెదడులో దెయ్యములు నాట్యమాడుచుండునని, విజ్ఞులు నుడివియుండిరి. సంకల్పరాహిత్యులైన జీవన్ముక్తుల గురించి మనమిచ్చట విమర్శించుటలేదు. వారు లోకాతీతులు. వారు శరీర ప్రపంచకములను జయించి వాసనక్షయము, మనోనాశనము, విజ్ఞానము గల్గిన, మహనీయులు, అష్టతారమూర్తులు, అట్టివారి జీవితములు, దేశ వృద్ధికి, మానవాభ్యుదయమునకు, లోకశాంతికి ఆదర్శనీయమైన జీవిత ములు.

దైవపరితాపన మానవజన్మకు పునాదివంటిది. అట్టిపునాదులు గల్గియున్నవారు నిత్యా నిత్యవివేకము గలిగి, సాధన చతుష్టయముతో నిండి, మోక్షము నెప్పుడోగాక, ఇప్పుడే అనుభవించుచున్నారు.

నేనీవ్యాసము వ్రాయుచుండ దైవమును అనుభవించుచుంటినా? మీరీ వ్యాసము చదువుచుండ, దైవము ననుభవించుడిరా? ఈ ప్రశ్నలకు సరియైన సమాధానము పొందుటకు ప్రప్రధమముననే, దైవమనగా నేమి? దైవము నకు మనకుయున్న అవినాభావసంబంధమును తెలిసికొనవలెను.

ఏకమేవా ద్వితీయం బ్రహ్మ !

బ్రహ్మస్వరూపుడు, దైవము, ఏకమై, అద్వితీయుడై సర్వత్రా నిండి యుండ, సర్వము తానేయైయుండ ఇక దైవమును మరచుట యెటులను? దైవాజ్ఞ లేకుండగ గడ్డిపరకయైనను కదలనప్పుడు, యీ హస్తముతో వ్రాయునది యెవ్వరు? ఈ మనస్సులో ఆలోచించునది యెవ్వరు? హస్తమును మనస్సును కదిలేలాగున, ఆలోచించెడిలాగున చేయునది ఆంతర్యమున, బాహ్యమున నిబిడీకృతమైనది, ఆ దైవశక్తియే గదా ! దైవమే నాలో వ్రాయు చుండెను. అద్వితీయుండైన ఆ దైవతేజస్సే మీలో చదువు చుండెను. దైవము సర్వత్రా నిండియున్నవాడుగాన, మనము దైవములోనే, ఇప్పుడు, ఇచ్చటనే గాక, నిరంతరము ఆయనలో స్థిరమైయుంటిమి.

దైవము ఇప్పుడే గాక అనాదినుండియు, సర్వకాలసర్వావస్థల యందు, అప్రమేయుడై, స్వప్రకాశుడై, విలసిల్లుచుండెను గాన మనమెప్పు డును, ఎచ్చట యున్నను, ఏపని జేయుచున్నను, దైవములోనేయుండి దైవ

శక్తిచేతనే ఆయాపనులు జేయుచుంటిమి. దైవములేని క్షణము వక్కటియైనను యెంప్పుడును యెంచ్చటను లేదు. దైవములేని తావుగూడ సూదిమొనమోపుటకైనను ఆంతర్యమునగాని బాహ్యా మునగాని లేదు. భక్త ప్రహ్లాదుడు, నుడివిన చిన్న పద్యము చిరస్మరణీయ మైనది.

గీ॥ ఇందుగలడందు లేడని సందేహమువలదు
చక్రి సర్వోపగతుం డెందుందు
వెతకి చూచిన నందందే గలడు
దానవాగ్రణి వింటే.

తీవ్రమైన పరితాపనవల్ల దైవానుభవము ప్రాప్తించును. ఆ దైవానుభవము గల్గియున్న మహనీయులు. పనిలోనైనను ఏపనియులేనప్పుడైనను దైవమునే అనుభవించుచుందురు. ఇక దైవానుభవములేనివారో! వారు, అట్టి దురదృష్టవంతులు, పనిచేయుచున్నను దైవమునునుభవించజాలరు. ఏపనియు లేకున్నను దైవము ననుభవింపజాలరు. చివరకు వారు గుడిలో కూర్చుని ప్రార్థనజేయుచున్నను, భజనలు జరిగెడి తావులలో యున్నను, వుపన్యాసములు వినుచున్నను, వారి చంచలమైన మనస్సులు అస్థిరమైన నామరూపముల గురించియే ఆలోచించుచుండును. గాన, ఆంతర్యమున, బాహ్యమున, సర్వకాల సర్వావస్థలయందును అఖండకోటిసూర్యదివ్య తేజస్సుతో వెలుంగుచున్న దైవమును, అనుభవముగా స్థిరముజేయుట ముఖ్యావసరము. అపరోక్షముగా ఆ దివ్యానుభవమును యెప్పుడు, పొందితిమో, అప్పటినుండియు పనిలోనైనను, ఏపనియులేని సమయముల యందైనను, ఏకాకిగాయున్నను, జనసమర్థములోయున్నను, మాట్లాడుచున్నను, మౌనముగా యున్నను కలిమిలేములలోనైనను, నిందాస్థుతులలోనైనను ఇప్పుడప్పుడనక, సర్వకాల సర్వావస్థల యందును దైవమును సహజముగా సూక్ష్మముగా అనుభవించుచుందురు.

గులాబీపుష్పమునకు, సువాసన ఇచ్చుట ఒక పనియా! పక్షికి పాడుట ఒకపనియా! పసిబిడ్డ నవ్వుట ఒకపనియా! గాలికి వీచుట ఒక పనియా!

సూర్యునకు ప్రకాశమిచ్చుట ఒక పనియా! సూర్యుని సూర్యరశ్మి నుండియు, గాలిని చలనమునుండియు పసిబిడ్డను అమాయకమైన నవ్వునుండియు, ఆనందముతో నిండియున్న పక్షిని పాటనుండియు, పుష్పమును దాని పరిమళము నుండియు రెండుగా జేయుటకు (విడదీయుటకు) వీలులేదు. సాధ్యముగాదు.

అగ్నిలో వెచ్చదనము మంచులో చల్లదనము, రాయిలో గట్టిదనము సహజముగా, నిబిడీకృతమై స్థిరమైనట్లు, మానవునిలో దైవత్వము గూడ సహజముగానే ఇమిడియున్నది. ఈ సత్యమును, ఎంత త్వరలో మానవులు గ్రహించిన, అంత త్వరలో తమ జన్మహక్కుయైన దైవతేజస్సును, దైవానుభవమును, బ్రహ్మ సాక్షాత్కారమును ఆంతర్య దైవమును ప్రార్థన ధ్యానాదులలోనేగాక, తమ నిత్యకృత్యములు చేయునప్పుడేగాక, ఏ పనియు లేని సమయములలో గూడ దైవమునే, ప్రతీక్షణములో అప్రయత్నముగా, సహజముగానే, వ్యక్తపరచుచుందురు.

తోటపల్లిలో నేను నివసించుచున్న నిర్వాణమందిరము ముందు శ్రీకృష్ణ, శ్రీబుద్ధ, శ్రీ క్రీస్తు, శ్రీ గాంధీజీ పొడవైన విగ్రహములు గలవు. ఆయా విగ్రహముల ముందు ఈ క్రిందిరీతిగా వ్రాయబడి యుండెను.

Krishna - Wisdom - జ్ఞానము
Buddha - Compassion - దయ
Christ - Love - ప్రేమ
Gandhi - Service - సేవ

ప్రాతః కాలమునందును సాయంత్ర సమయమందును తరచు, ఆ విగ్రహముల ముందు పచార్లు జేయుచు (అటూ, ఇటూ తిరుగుచుండ) ఈ అవతారమూర్తులు, నాకు బాహ్యమున యుండిరన్న భావనకంటె, వారును ఆంతర్యముననే, నాలోనే యుండిరన్న భావన ఎంతయో శక్తివంత ముగా, ఆనందముగా శాంతిగా యుండెను.

శ్రీకృష్ణభగవానుడు నాలో శ్వాసరూపముగాను, బుద్ధ దైవము మనస్సు గాను, క్రీస్తు ప్రభువు హృదయముగాను, గాంధీజీ సేవారూపముగాను,

యీ జీవితములో ప్రతీక్షణము నందును నిరంతరము వ్యక్తమగు చుండెనన్న అఖండమైన భావన, ఖండమైన మాటలచే వర్ణించుటకు వీలుపడదు.

ప్రియమైన పాఠకా ! నీవుగూడ కృష్ణుని నీ శ్వాసలో, బుద్ధుని నీ మనస్సులో, క్రీస్తుని నీ ప్రేమ హృదయములో, గాంధీజీని నీ సేవలో మనోవాక్కాయములలో సత్యము, అహింస అనెడి సూత్రముల ద్వారా వ్యక్త పరచెదవుగాక !

నేనిప్పుడీ వ్యాసమును ప్రాతఃకాలములో వ్రాయుచుండ, వర్షము హోరాహోరీగా కురియుచుండెను. ప్రతీవర్షపు బిందువులో ఆ శబ్దములో గూడ దైవమే అనెడి భావన యెంతయో ఆనందము నిచ్చుచున్నది. వర్ష మును జూచుచుండ, యీ మధ్యను ఆశ్రమములో వ్రాయబడిన ఒక చక్కని వాక్యము జ్ఞప్తికి వచ్చుచున్నది. నా స్వభావము, ఏది జ్ఞప్తికి వచ్చిన అద్దానిని మీతో పంచుకొనుటయే. నేను దేనినీ హృదయములో దాచజాలను. ఆ మహా వాక్యమిదిగో.

TROUBLES ARE GOD'S RAIN ON EARTH

కష్టములు, భూమిమీద దైవమిచ్చెడి వర్షబిందువులు. ఆహా ఏమి ఆనందమైన వార్త ! గాన మనకష్టములకు, పరీక్షలకు గూడ జడవనవసరము లేదు క్లిష్టపరిస్థితులలో గూడ దైవమే. "ఈశావాశ్యమిదం సర్వం."

అంతా రామమయం బీజగమంతా రామమయం. ఈ మధ్యను, తరచు వుత్తరములు, వ్యాసములు వ్రాయునప్పుడు, దైవమును వ్యక్తపరచుట యెటులను? ఫలహారము తీసుకొనుచున్నప్పుడు దైవానుభవమును గల్గియుం డుట యెటులనని, ఆలోచనలు వచ్చుచుండును. గంటలకొలది వ్రాయు చున్నప్పుడు ఒక్కొక్కమారు, ఒక్కొక్క సమయమందు, చాలతీవ్రముగా ఆలోచనలతో మునింగియున్నప్పుడు దైవమును మరచితివా అని భ్రమ గలుగుచుండును. అటులనే ఆహారము రుచిగానున్నప్పుడు ఏదుంపయో, అరటిపండో, కొబ్బరియో నమలుచుండ, దైవమును మరచుచుంటివా, అని విమర్శించు కొనుచుందును.

అప్పుడు సమాధానముగా, "నీలో వ్రాయునది దైవమైయుండ, దైవ

శక్తియే నీ హస్తములో కదలుచు వ్రాయుచుండ, నీ మనస్సులో దైవమే ఆలోచించుచు వ్రాయుచుండ ప్రత్యక్షముగా కదలుచు మెదలుచు వ్రాయించుచున్న దైవమును మరచితినని భ్రమపడనేల" అని సమాధానము వచ్చుచుండును. అటులనే ఆహారమును భుజించునప్పుడు పాలును, జలమును త్రాగునప్పుడును గూడ, "నీలో నమలెడిది, త్రాగెడిది అదియే. ఆ శక్తియే! ఆ దైవశక్తి లేకుండగ, నీనోరే కదలదు. నీవు తీసుకొనెడి ఆహారమును దైవానుభవముతో తీసుకొనుచు ఆ శక్తిని, శరీరమంతయు నింపి జీర్ణింప జేసుకొని, దైవానుభవమునే నీమనోవాక్కాయములలో వ్యక్తపరచెదవుగాక! అని నామనస్సునకు నేను జెప్పుచుందును.

ప్రియమైన ఆశ్రమ భక్తులారా ! శాంతిపాఠకులారా ! ఈ నా చిన్న ఆధ్యాత్మిక అనుభవములను మీరుగూడ, మీ పనిపాట్లులో మీ ఆహారవిహార సమయములలో ఇప్పుడప్పుడనక, నిరంతరమును, మీ జీవితములలో వ్యక్తపరచెదరు గాక యనియు, నా అనుభవములు మీకు గూడ తోడ్పడుననే భావనతో నా ఆంతర్య ఆలోచనలను, మీ ఆధ్యాత్మిక వృద్ధికి కోరుచు వ్రాయబడుచుండెను.

ఇప్పుడు ఒకతరి నిమీలిత నేత్రులమై, స్వయంజ్యోతి స్వరూపుండైన స్వప్రకాశమానుని, అఖండకోటిదివ్యస్వరూపుని ధ్యానింతుము.

మీలో దైవము, నాలో దైవము, అందరిలో దైవము, ఆంతర్యమున దైవము, బాహ్యమున దైవము. చుట్టును దైవము. శబ్దములో దైవము, నిశ్శబ్దములో దైవము. నిశ్శబ్దములో ధ్యానగడియలలో దైవముననుభవించుచు, శబ్దములో, బాహ్యమున, పనిపాట్లలో గూడ, నిరంతరము దైవమునను భవించుచునే, మన జీవయాత్రలను గడుపుచు తరించెదము గాక !

ఓమ్ సర్వేషాం స్వస్తిర్భవతు ఓమ్ సర్వేషాం శాంతిర్బవతు
ఓమ్ సర్వేషాం పూర్ణంభవతు ఓమ్ శాంతి శ్శాంతిః శ్శాఆంతిః
ఓమ్ తత్ సత్ ఓమ్

## పశ్చాత్తాప ప్రార్థన

సత్యసుందర స్వరూపుడవైన ఓ పరమేశ్వరా ! సత్యముగను, పవిత్రముగను, మృదువుగను ఉండువాక్కును, నిర్మలమగు అంతః కరణమును మాకు ప్రసాదింపుము.

అవ్యాజ కరుణామూర్తి ! తను మన ధనములతో సదా యితరులకు మంచినే చేయుటకును, యితరులయందు మంచినే గ్రహించుటకును, తగిన సద్బుద్ధిని దయసేయుము.

దీనబంధూ ! దయానిధే ! మా మనస్సు అచంచల విశ్వాసముతో, నిరంతరము నీయందే నిలిచియుండునట్లు అనుగ్రహించుము. మాలో భక్తి, జ్ఞాన వైరాగ్య బీజములు అంకురించి పెంపొంది ఆత్మానంద ఫలమును ఒసగులాగున ఆశీర్వదింపుము.

పరంజ్యోతి స్వరూపా! మార్గదర్శకుడవై చీకటినుండి వెలుగులోనికిని, అసత్యమునుండి సత్యమునకును, మృత్యువునుండి అమృతత్వమునకును మమ్ము నడిపింపుము.

దేవదేవా! నీ కృపచే మానవునికీ మానవునికీ మధ్యబేధబుద్ధి నశించి, సర్వజీవులు సమభావముతోనూ, ప్రేమదృష్టితోనూ మెలగుదురుగాక. లోకములన్నియూ శాంతిసౌఖ్యములతో వర్ధిల్లునుగాక.

ప్రభూ ! అనుక్షణమునూ అంత్యకాలముననూ నీ స్మరణయే మా జిహ్వాయందు నిలిచియుండుగాక. నీరూపమే మా ధ్యానమందు నిలుచుగాక. ఈ జన్మయే కడసారి జన్మయై నీ సాయుజ్యమును పొందించుగాక.

పాహిమాం పాహిమాం పాహిమాం పాహి పాహి

ప్రతిపని దైవభావముతో చేయుడు.

పవిత్రమైన మనస్సు కొరకు దైవధ్యానము చేయుడు.

# మనన వాక్యములు

( నా ఆధ్యాత్మిక వృద్ధికి తోడ్పడిన ఉపదేశ వాక్యములు )

పుష్పము వికసించుటకు, పండు పక్వమగుటకు, సూర్యరశ్మి ఎంత అవసరమో, నక్షత్రములు ప్రకాశించుటకు, సముద్రములో కెరటములు ప్రణవగానము జేయుటకు, దివ్యశక్తి యెంత అవసరమో, మానవుని ఆధ్యాత్మిక వృద్ధికి, బ్రహ్మసాక్షాత్కారమును బడయుటకు, జన్మరాహిత్యమును జేసుకొనుటకు, పూర్ణశాంతి ననుభవించుటకు యీ క్రింది మహావాక్యముల మననముగూడ అంత ముఖ్యావసరమై సహకారిగా యుండును.

ఈ క్రింద వ్రాయబడెడి ఉపదేశ వాక్యముల నిరంతర మననము నా ఆధ్యాత్మిక వృద్ధికి యెంతయో ఉపకరించెనుగాన, వాటిని శాంతి పాఠకులందరితో, ఆశ్రమభక్తులందరితో, దైవపిపాసకులతో పంచుకొనుటకు, చిరకాలమునుండి కోరుచుంటిని.

సాధకుడు, ఒక్కొక్క మెట్టును యెక్కుచుండ ఆధ్యాత్మిక జీవితములో ఒక్కొక్క మహావాక్యము, ఒక్కొక్క స్థితిలో చాల సహకారిగా యుండును.

నా ఆధ్యాత్మిక సాధనలో తోడ్పడిన మనన వాక్యములను ఒక్కొక్కటి యిప్పుడు తీసుకొని క్లుప్తముగా వివరించెదను.

## బ్రహ్మము - శక్తి

ఇవి చిన్న మాటలుగా ఉన్నను వీటిలో అఖండమైన శక్తి యిమడ్చబడి ఉన్నది. బ్రహ్మము మూడు అక్షరముల మాటయే. శక్తి రెండు అక్షరముల మాటయే. బ్రహ్మము అనెడి చిన్నపదమును స్మరించినంత మాత్రముననే అంతయు పరిపూర్ణముగా, నిండుగా స్వప్రకాశముగా యుండును.

శ్లో॥ బ్రహ్మానందం, పరమసుఖదం, కేవలం జ్ఞానమూర్తిం
ద్వంద్వాతీతం, గగనసదృశం, తత్త్వమస్యాది లక్ష్యం
ఏకం నిత్యం విమలమచలం, సర్వధీ సాక్షిభూతం
భావాతీతం, త్రిగుణ రహితం సద్గురుం తం నమామి॥

బ్రహ్మస్వరూపమును నిరంతరము పూజించెడివారికి ధన్యవాదములు. పైన వ్రాయబడిన గురు శ్లోకము బ్రహ్మస్వరూపమును, తేలికయైన చిన్న మాటలతో వెల్లడి చేయుచున్నది. బ్రహ్మము అచంచలమైనది. అలలులేని అఖండ సచ్చిదానంద సముద్రమునకు పోల్చబడెను.

ఇక శక్తియో, శక్తి బ్రహ్మము యొక్క కదలికయే !

సముద్రములో ఉన్న కెరటములే శక్తిస్వరూపము. స్థిరమైనది సంకల్ప రాహిత్యమైనది బ్రహ్మము.

కదలికతో కూడి వున్నది సంకల్పములు గలిగినది శక్తి, స్వరూపము. కెరటము సముద్రమునుండిలేచి సముద్రమునందే నిలచి మరల సముద్రము లోనే లీనమౌచున్నట్లు, శక్తి బ్రహ్మమునందే వ్యక్తమై అందే మరల విలీన మగుచున్నది. అఖండమైన శక్తినిగలిగిన, యీ రెండు చిన్నమాటలను, స్మరించుచు మననము జేసినంత మాత్రమున, నాకెంతయో బ్రహ్మానందము గలుగుచుండును.

OMNIPRESENT, OMNIPOTENT AND OMNISCIENT

సర్వవ్యాప్తి, సర్వశక్తి మరియు సర్వజ్ఞత, ఈ మూడు చిన్నమాటలను, మననము జేసినంత మాత్రముననే మనస్సు, హృదయము, ఆత్మ, సర్వమును నూతనమైన శక్తితో నిండియుండును.

ఆపాదమస్తకమును కాలిగోరు మొదలు శిరస్సువరకు, సర్వవ్యాప్తి, సర్వశక్తి, సర్వజ్ఞతయే. శరీరములో ప్రతీ అణువులో యీ దివ్యశక్తియే!

I AM IN THE LIGHT

THE LIGHT IS IN ME

I AM THE LIGHT

నేను తేజస్సులో యుంటిని

తేజస్సు నాలో యున్నది

నేనే తేజస్సును

ఈ పై మూడు చిన్న మహావాక్యములను స్మరించుటచే గలిగెడి, అఖండ శక్తిని, ఆనందమును, సాధకులు వారి అనుభవములో రుచి చూడ వలసినదేగాని, యీ చిన్న మాటలతో ఆ దైవానుభవనమును వర్ణించి వ్రాయజాలను.

I AM THE LIGHT

నేను తేజస్సులో యుంటిని

దివ్యతేజస్సే నా జన్మ హక్కుగాన నేను తేజస్సులో సదా యుంటిని. నేను యెచ్చట తిరిగినను, యెచ్చట యున్నను, ఆ దైవ తేజస్సుచే నింపబడి, ఆవరింపబడి, ఆ తేజస్సునందే కదలుచు, మెదలుచు, ఆలోచించుచు, నాపనిపాట్లు జేసుకొనుచుంటిని.

ఆహా! ఎంత ఆనందమైన సత్యవార్త ! మానవుడు తరించుటకు శాంతిని బడయుటకు యీ చిన్న వాక్యమును, అనుభవములో ఉంచిన చాలునుగదా ! నేనే తేజస్సులో యుంటిని, అనాదినుండియు సర్వకాల సర్వావస్థల యందును నేను తేజస్సులోనే యుంటిని.

THE LIGHT IS IN ME

తేజస్సు నాలో యున్నది

ఏ దివ్యతేజస్సులో నేను కదలుచు, మెదలుచు, ఆలోచించుచు, నిరంతరము జీవించుచుంటినో, ఆ దైవతేజస్సు నాలోనే యున్నది. అఖండ మైన దివ్యతేజస్సు, ఖండమైన శరీరములో ప్రతి అణువులో వ్యక్తమగుచున్న దనెడి ఆనందవార్త యెంత బలమును నూతన శక్తిని కలిగించు చున్నదో జూడుడు.

I AM THE LIGHT

నేనే తేజస్సును

నేనే ఆ తేజస్సును, ఇచ్చట మాటలు అర్థరహితము, అసందర్భము,

ఆ దివ్యతేజస్సుయొక్క అనుభవము పరవశత్వమునే గలిగించుచున్నది.

తత్త్వమసి – అదియే నీవు

THOU ART THAT

ఈ పై మూడు మహావాక్యములును ద్వైత, విశిష్టాద్వైత, అద్వైత మత సిద్ధాంతములను, విశదీకరించుచున్నవి.

మరియొక చిన్న మహావాక్యము యొక్క స్మరణ నాకు తోడ్పడుచు, నా నిద్రనుండి మేల్కొలుపుచుండును.

WHEN GOD IS AWAKE, HOW CAN YOU SLEEP ?

దైవము మేల్కొనియుండ, నీవెటుల నిద్రపోగలవు? ఈ వాక్యమును మననము జేసిన నిద్రపోవుటయే సిగ్గుగా ఉండును. మరియొక ఆదర్శనీయ మైన, పట్టుదలను వైరాగ్యమును గలిగించెడి వాక్యమును జూడుడు.

THE DAY HAS GONE, WILL YOU WASTE THE NIGHT ALSO?

పగలు గతించెను, రాత్రిగూడ వ్యర్థబుచ్చెదవా ?

ARISE, AWAKE AND STOP NOT UNTIL THE GOAL IS REACHED

లెమ్ము, మేల్కొనుము. నీ గమ్యస్థానము చేరెడివరకు ఆగకుము. ప్రియమైన పాఠకా, నీవు లేచితివా ? నీవు మేల్కొనియుంటివా ! నీవు సత్యమార్గముననే నడుచుచుంటివా ! నీ గమ్యస్థానము చేరెడివరకును, వెనుకకు జూడకుండ, దారిలో ఆగకుండ, నడచుచుంటివా, అటులైన, నీ జీవితము ధన్యవంతమైనది. ఒక్కొక్క స్థితిలో యీ క్రింది వాక్యము ఆధ్యాత్మిక వృద్ధికి నూతన శక్తిని గలిగించుచుండును.

IF YOU CANNOT FEEL GOD'S PRESENCE NOW, HOW CAN YOU FEEL HIM IN THE DIM UNCERTAIN FUTURE

దైవశక్తిని, ఇప్పుడు యీ ప్రత్యక్ష క్షణమునందు గుర్తించజాలని యెడల, అస్థిరమైన భవిష్యత్తులో, యెప్పుడో, యెన్నడో యెటుల అనుభవించ

గలవు?

THE TIME TO FEEL GOD'S PRESENCE IS HERE AND NOW

దైవ సన్నిధిని అనుభవించెడి సమయము, ఇప్పుడే యిచ్చటనే ఈ ప్రత్యక్ష క్షణమునందే !

THE REICHEST TREASURE IS THYSELF

అమూల్యమైన ధనరాశి నీవే, ఆత్మధనము నీనుండి వేరుగా ఎచ్చటనో లేదు. అదియే నీవు నీవే అది, నిన్ను మించినది, మీరినది, నీ నుండి భిన్న మైనది, ఎచ్చటను ఎప్పుడును, యేలోకములోను లేదు.

PRAJNANAM BRAHMA

ప్రజ్ఞానం బ్రహ్మ

ప్రజ్ఞయే బ్రహ్మము, నీలో యుండెడి తెలివియే బ్రహ్మస్వరూపము. నీలో కదులుచు, మెదలుచు ఆలోచించుచున్న ప్రజ్ఞయే బ్రహ్మశక్తి.

KNOW THYSELF

వెఱ్ఱిమానవుడు తన్ను తాను తెలుసుకొనుటకు బదులు, లోకమంతను తెలిసికొనుటకు ప్రయత్నించుచుండెను.

తన్ను తాను కనుట పరమ రహస్యమని వేదాంత గ్రంథములు జెప్పు చున్నవి.

I CANNOT AFFORD TO FORGET GOD EVEN FOR THE FRACTION OF A MILLIONETH OF A SECOND

ఒక క్షణములో కోటవవంతు కాలమైనను, దైవమును మరచి నేను జీవింపజాలను. లిప్తకాలమైనను, ఒక్కక్షణమైనను జీవించజాలనప్పుడు తన ప్రాణమునకు ప్రాణముగా తన సర్వస్వముగా, మూలముగా, ఆధారముగా, గమ్యస్థానముగా యున్న, ఆ సచ్చిదానందస్వరూపమును మరచి సాధకుడు దైవ పిపాసకుడు, క్షణములో కోటవవంతు కాలమైనను యెటుల గడిపి

జీవించగలడు ?

మరియొక చిన్నపద్యము, చిన్నతనములో సీతారామాంజనేయ సంవాదమునుండి చదివినది. స్మరించినంత మాత్రముననే నాకెంతయో ఆనందము నిచ్చుచు దైవానుభవమును ప్రత్యక్షము జేయుచుండును.

గీ॥ చెలువుగ బువ్వులు చీరుటకంటెన్
బొలుపుగ గన్గవ మూయుటకంటెన్
నలువగు నీ యమనస్క పదంబే
సులభము, సౌఖ్యము, సూక్ష్మము వత్సా॥

తా. పుష్పముల యొక్క రేకులు విడదీయుటకంటెను, కన్ను యొక్క రెప్పమూయుటకంటెను యీ అమనస్కయోగమే సులభము, సౌఖ్యము, సూక్ష్మమని చెప్పబడుచున్నది. ఇటులనే, యెన్నియో మహావాక్యములు శ్లోకములు, పద్యములు, సాధకుని పరిస్థితిని వృద్ధినిబట్టి వాటి మననము తోడ్పడుచుండును.

మరియొక మహావాక్యము యితరులకు విపరీతముగా తోచినను నాకు గొప్ప సహాయము జేయుచున్నదానిని గూడ మీకు జెప్పుటకు కోరుచుంటిని.

SWAMI IS DEAD AND OMKAR IS ALIVE IN ALL OF YOU

స్వామిచనిపోయెను. ఓంకారము మీ అందరిలో జీవించుచుండెను. ఈ స్థితిలోనే బైబిలులో

BE DEAD THAT YE MAY LIVE

నీకు జీవించవలెనని యున్న చనిపోవుము. అని క్రీస్తు ప్రభువు నుడివి యుండెను.

ప్రాణతుల్యమైన సృష్టికే ఆధారమైయున్న మరియొక చిన్న మహావాక్యమైన మహామంత్రమును మీతోపంచుకొని, నా ప్రస్తుత వ్యాసమును

ముగించుటకు కోరుచుంటిని.

అదియే SOHAM, AUM, OM అదియే నీవు, సోహం, ఓమ్, ఓమ్ ఏక మేవా ద్వితీయం బ్రహ్మ, పరబ్రహ్మము రెండుగాదు ఒక్కటియే.

నీ వుచ్ఛ్వాస, నిశ్వాసలలో సోహమే ఆడుచున్నది. సముద్రము యొక్క ఆటుపోటులలో అలలయొక్క చలనములో సోహం, దివ్యశక్తియే వ్యక్తమగు చున్నది. సోహమే ప్రణవము, ప్రణవమే సోహం.

శ్లో॥ దేహో దేవాలయ ప్రోక్తో జీవో దేవ సనాతనః

తృజే దజ్ఞాన నిర్మాల్యం, సోహం భావేన పూజయేత్ ॥

దేహమే దేవాలయము, జీవుడే దైవము గాన భేదభావన యనెడి అజ్ఞానమును, విడిచిపెట్టి సోహం భావేన పూజయాత్, సోహం భావనతో పూజచేయుము. పూజలన్నింటిలో సోహం పూజయే మహాపూజ, "సోహం అస్మి"

నేను సోహం అగుచున్నాను. అగుచున్నాననుట అసందర్భము. నీవే సోహం, అదియే నీవు.

ఎన్నడును పంచదార చూడనివానికి, దానిని రుచిచూడనివానికి పంచదార రుచిగా యుండునని యెన్ని వ్యాసములు వ్రాసినను, యెన్ని ఉపన్యాసము లిచ్చినను, యెన్నిబోధలు ఉపదేశించినను, ఇసుమంతయైనను, పంచదార మాధుర్యమును గ్రహింపజాలడు గదా !

మన శాంతి ప్రార్థనగూడ, దైవ సన్నిధిని అనుభవించుటకు ఎంతయో సహకారిగా యుండును.

ఈ చిన్న శాంతి ప్రార్థనలోయున్న గొప్పదనము, గోప్యమైన రహస్య మేమనగా యీ ప్రార్థనను స్మరించుచుండగనే దైవసన్నిధిని అనుభవించ వచ్చును. ఈ సత్యమును, యీ దైవసన్నిధిని ఎవరంతట వారే శాంతి ప్రార్థనను స్మరించుచు శాంతి ననుభవించవలసినదేగాని మాటలతో దాని ఆధిక్యతను వర్ణింపజాలము.

ఆకాశమునందు, ఏపక్షిని జూచినను, నాకెంతయో ఆనందము. ఆ పక్షివలె, మనముగూడ అఖండ దివ్యతేజస్సునందు నిరంతరము, యెగురు చుంటిమనెడి భావన నూతనశక్తిని గలిగించుచుండును. సముద్రములో యున్న మత్స్యములను జూచినను,ఆ మత్స్యములు, జలముచే క్రిందను, మీదను, చుట్టును, చుట్టబడియున్నట్లు మనముగూడ సచ్చిదానందజలముచే, శాంతి అమృతముచే, మీదను, క్రిందను, ఆంతర్యమున, బాహ్యమున చుట్టును నింపబడి యుంటిమి గదాయని ఆనందించుచుందును. నేను చిన్న తనమునందే సముద్రములో యీదుటయేగాక, సముద్రముమీద తేలుట గూడ నేర్చుకొనియుంటిని. నాకది ఎంతయో సులభముగా ఆనంద ముగా యుండును. గాని సముద్రమునే చూడనివారికి, సముద్రమును తాకనివారికి, యీత తెలియనివారికి, సముద్ర జలముమీద తేలుటయనగ, భీతిని గలిగించును. అది దుర్లభముగా వారికి తోచును. ఆ అనుభవము గలిగిన వారికి అతి సూక్ష్మముగా తేలికగా యుండును.

ప్రియమైన శాంతి పాఠకా ! ఆత్మసోదరీ, సోదరా! అఖండ సచ్చిదా నంద పరబ్రహ్మమనెడి సముద్రముమీద తేలుటకు, నీకు నేర్పుటకు నాకు సావకాశ మిచ్చెదవా ? సముద్రము మీదను నేను తేలుటయే గాక దైవకృపచే ఆశ్రమవాసులలో, భక్తి జ్ఞాన వైరాగ్యములతో నిండియున్నవారికి కొందరికి, సముద్రజలమున తేలుటగూడ నేర్పగలిగి యుండుట నాకు ఆనందము నిచ్చెడిదిగా యుండును. సంసార సముద్రములో, యెవ్వరును, మునిగి పోకుండగ, అందరునూ తేలవలయుననే, యీ మనస్సు కోరుచుండును. ఏలనన, మీశాంతియే నా శాంతి, మీ తరింపే నాతరింపు. మీ ఆనందమే నా ఆనందము. మీ మోక్షమే నా మోక్షము.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు. హరి ఓం తత్సత్.

# రక్తము

రక్తమంతయు, యెవ్వరిదైనను, యెట్టిగానున్నను, రక్తముగూడ, మూడు విధములుగా విభజింపబడియుండెనని, పరిశోధకులైన వైద్యవేత్తలు జెప్పుచుండిరి. మానవులలో ఈ రక్తము మూడు గ్రూప్స్. గ్రూప్స్ సంపుటములో ఏదోఒక సంపుటికి గ్రూపుకి చెందియుండునట.

'ఎ' గ్రూప్ 'బి' గ్రూప్ 'ఓ' గ్రూపు

ఈ సమ్మేళన, విభజన గుణములనుబట్టి స్వభావముననుసరించి ఏర్పడును. చుట్టమును గూడ, నిపుణులైన వైద్యులే వారి పరిశోధనలచే జెప్పవలసియున్నది.

తామస, రాజస, సాత్విక గుణములననుసరించి, రక్తముగూడ, ఆయా వేరు వేరు గ్రూపులను చేరియుండునేమో అనెడి, అంశమును యోగశాస్త్రజ్ఞులు నిర్ణయించవలసిన సత్యము.

'ఎ' గ్రూపు రక్తము కొందరికి పనికివచ్చునట.

'బి' గ్రూపు దెవ్వరికి పనికిరాదట

'ఓ' గ్రూపు రక్తము అందరికీ పనికి వచ్చునట. (యూనివర్శల్ బ్లడ్) దీనినే విశ్వరక్తమనెడి పేరుతో గూడ వాడెదరట. మొన్న నేను ఒక సందర్భములో కె.జి.హాస్పటల్‌లో రక్తమును దుర్భినీయంత్రము ద్వారా పరీక్ష చేయించగా, అది "ఓ" గ్రూపుకు చెందియున్నదన్న విశ్వజనీయమైన, అందరకూ పనికివచ్చెడి గ్రూపుకు చెందియున్నదని వినుటకెంతయో ఆనందించితిని.

దయామయుడైన, సర్వాంతర్యామియైన ఆ దైవమునకు ధన్యవాదములు. ఈ శరీరము, మనస్సేగాక, యిందువున్న రక్తము గూడ అందరకూ పనికివచ్చెడి గ్రూపుకు చెందియున్నందుకు ఆ కృపామయునకు ధన్యవాదములు.

ముఖ్యముగా రక్తము క్రోధముచే విషముగా మారునని శాస్త్రజ్ఞులు, నిపుణులైన వైద్యవేత్తలు మరల మరల నొక్కి వక్కాణించియుండిరి. ఈ మధ్య నొక చదువరియైన తత్త్వ విచారణ జేయుచున్న ఒక భక్తుడు, తాను పెద్ద జబ్బుతో బాధపడుచుండియు రౌద్రాకారమును దాల్చి లోకమునంతను భస్మము జేయుచున్నట్లు, కండ్లను చింత నిప్పులువలె జేసి, కేకలు వేయ నారంభించెను. అట్టి స్థితిలో అతని రక్తమెంత విషముగా మారియుండునో నని విచారించితిని. ప్రప్రథమమున అతనికి పెద్ద జబ్బు వచ్చుటకు ఏ చెడురక్తము కారణమైయున్నదో తెలిసికొనియైనను, అతని మనస్సు కోపతాపముల కిచ్చి అధోగతి పాలవుచుండుట చాలా విచారకరము గదా! మరొకతత్త్వ విచారణ చేయుచున్న చదువరులు, విజ్ఞాన వంతులైన దంపతులు గలరు. పాపము వారిద్దరూ గూడ క్షయ వ్యాధిచే బాధపడుచుం డిరి. ఈ అవస్థలో అందరిలో దైవమును గాంచుచు, ప్రేమతో నిండియుండు టకు బదులు తమలో వున్న చెడ్డనే, అందరిలో గాంచుచు, వారి జుట్లు, వీరి జుట్లు ముడి పెట్టుచూ శాంతిగా జీవించెడి వారి కొంపలు అంటించుచు, అమాయకుల మీద కల్లలు, కల్పనలు కట్టుచూ, పన్నుచూ ఇతరుల అవస్థలు జూచి, వారు పోరాడుచుండ వీరుజూచి, ఆనందించుచుందురు. వీరి రక్తమెటు లుండునో ఏ గ్రూపుకు చెందియుండునో మీరే ఆలోచించాలి. మరొక భక్తుడు నిత్యము వేదపారాయణ జేయుచూ, తన్ను నిందించిన వాని మ్రింగి వేయుటకు, పరాభవము గల్గించుటకు అహర్నిశములు తిండి, నిద్రమాని, కక్ష, క్రోధముతో నిండి తదేక దృష్టితో జీవించుచుండెను. ఇట్టివారు లెక్కకు మీరి, మనకు అన్నివైపులనూ గానవచ్చుచునే యుండిరి. ఇప్పుడు మనము తెలుసుకొనవలసిన ముఖ్యవిషయము కోపతాపములు. క్రోధముచే, కక్షచే, రక్తము విషముగా మారును. ఒక తల్లి, తన బిడ్డకు పాలు నిచ్చుచు, క్రోధావేశముతో, అరవనారంభించెనట ! కొంత తడవునకు ఆమె పాలు త్రాగుచున్న బిడ్డ చనిపోయెను. అప్పుడు వైద్యులు ఆ బిడ్డను పరీక్షించగా విషపూరితమైన తల్లిపాలు త్రాగుటచే చనిపోయెనని రక్తము పరిశీలించి జెప్పిరి.

అందుచేతనే క్రైస్తు ప్రభువు మొదలైన శాంతిదూతలు నీ విరోధులను ప్రేమించు మనియు, అపకారము జేసినవారికి, వుపకారము జేయు మనియు, ఎడమ దవడను కొడితే, కుడి దవడ అర్పించమనియు, నీ చొక్కా అడిగిన, కోటు గూడ యిమ్మనియు ప్రేమయే దైవమని వక్కాణించి యుండిరి.

ప్రియమైన పాఠకులారా ! మార్పులతో నిండియున్న ప్రపంచములో మానావమానములు నిందాస్థుతులు సుఖదుఃఖములతో మిశ్రమైయున్న యీ సృష్టిలో మనకు గూడ పరీక్షలు, కఠిన పరీక్షలు రాకమానవు. ఎన్ని పరీక్షలు వచ్చిననూ చివరకు శరీరములు శిలువ మీద కొరతవేయబడినను హింసించెడివారి మేలు కోరుచూ తన రక్తమునందెంత మాత్రము, మార్పు గలుగునీయకుండ ప్రేమతో జీవించెడివారి జీవితములే ధన్యవంతములు.

సర్వేజనా స్సుఖినోభవంతు !

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

# వజ్రోత్సవ సందేశము

( జనవరి 21-1977 శాంత్యాశ్రమ వజ్రోత్సవము )

అగాధమునుండి నూతనశక్తి

అంధకారమునుండి నూతన తేజస్సు

అజ్ఞానమునందును మార్గమునందే యుంటిమి.

(అబ్రహాం లింకన్)

ఈ పై మాటలు నాలుగుసార్లు నేను అమెరికా వెళ్లినప్పుడు పొందిన అమోఘసంపద, ఇది అబ్రహాంలింకన్‌చే పలుకబడిన అనుభవ పూర్వక పలుకులు. ఈ అరువది సంవత్సరముల ఆశ్రమజీవితములో కలిగిన కష్టములు నష్టములు, సాధనలలో ఆ పలుకులు నాకెంతయో శక్తిని, ధైర్య మును ఓదార్పును కలిగించుచుండును.

దైవాజ్ఞ లేనిదే ఒక్క గడ్డిపోచైనను కదలదుకదా ? గతములో ఏమి చేసితిమో, ఆ కర్మానుసారమున కలిగెడి ప్రారబ్దకర్మను అనుభవించక ఎవరికిని తప్పదుకదా ? ఏ విత్తులు విత్తుదుమో ఆ ఫలములనే అనుభవించ వలెననెడి సత్యమును గుర్తించి, ప్రతివారును నిశ్శబ్దముగా, చిరునగవుతో సమస్తము అనుభవించవలెను. "సర్వశక్తి పనిచేయుచున్నది. జీవుని విశ్రమించనిమ్ము" కాని అజ్ఞాని అయిన మానవుడు జీవుని విశ్రమించ నీయడు. దివారాత్రములు ఏమేమో చేయతలంచుచునే యుండును. ఈ వజ్రోత్సవమునకు శాంతి జ్యోతి స్తంభమును, ప్రార్ధన ధ్యానాదులకు ప్రార్ధనామందిరము మొదలగు వాటి గురించి తలపోయుచునే యుండును. అజ్ఞాని అయిన మానవుని కోర్కెలకు అంతు అనునదే యుండదుగదా !

"కోరికయే బంధన" అని తెలిసినవారు కూడ అంతులేని కోర్కెలచే ఇంకను ఇంకను అధోస్థితికి పోవుట విచారము. విశ్వమానవ కల్యాణమునకై విశ్వగృహముగా వెలుగొందు ఈ ఆశ్రమమును గూర్చి తలపోయుటకూడ ఒక బంధనయేగదా ? ఆద్యంతములు లేక సర్వసృష్టికిని మూలాధారమైన సర్వశక్తి ఎడతెగక కృషి సల్పుచుండ అందుచేయుటకు మన మెవరము?

మనమెంత ? పరిమితమైన మన భావములను, ఊహలను ఆ సర్వజ్ఞుడైన దైవమునకు తెలియదనుకొనుట అవివేకముకాదా ? మేల్కొనుము. ఓ మానవుడా మేల్కొనుము! ఈ ఎనుబది మూడవ జన్మదిన సుప్రభాతముననైన మేల్కొనుము. కోటిసూర్య ప్రభాభాసమానమగు దివ్యతేజస్సు నీలోనే గలదని గుర్తించి, మేల్కొనుము.

నీ సహజస్థితిని నీవు గుర్తించుము. నీవు సింహమవు. సింహమువలె గర్జించుము. నీ ప్రతిశ్వాసతోడను సోహం భావనతో గర్జించుటే నీ సహజ స్థితి. రక్తమాంసభూయిష్టమగు యీ శరీరమే తానని భావించి భయమెందు మేకవలె నరవకుము. ఈ ఆశ్రమము నీవుకాదు. శుద్ధచైతన్య స్వరూపుడవు అని గుర్తించుము. ఆశ్రమము పేరిటగాని, మరెద్దానికైగాని యాచకులైన వారి నుండి యాచింపవలదు. ఇమ్ము. ఎల్లప్పుడును నయాగరా జలపాతము వలె నిమ్ము. సత్–చిత్–ఆనంద సాగరమువలె సతతము యిచ్చుచునే యుండుము. ఆ సత్–చిత్–ఆనంద సాగరమందలి ప్రతి అల లేచునపుడు, పడునపుడు "ఓం నమశ్శివాయ" "ఓం శివాయ నమః" అని గర్జించుచున్నది అటులనే నీ ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసలందును "ఓం నమశ్శివాయ" "ఓం శివాయనమః" అని పూరింపుడు. మీ ప్రతిశ్వాసను శాంతిమయముగా నొనర్పుడు.

ఈ వజ్రోత్సవ శుభసమయమున మీకు ఇంక నేనేమి చెప్పగలను? ఒకే ఆపరిచ్ఛిన్న దైవముయొక్క బిడ్డలగు మీ అందరి శాంతిసుఖములకై అరువది సంవత్సరముల క్రిందట ఈ ఆశ్రమము స్థాపింపబడెను. ఒలికి పోయిన పాలకై విచారించవలదు. గతమును విస్మరించి కాలగర్భమున కలసిపోనిండు అమృతత్త్వము మీకొరకై సిద్ధముగా నున్నది. ఈ మాటలతో యీ విలువైన కాలమును వ్యర్థము చేయకుందుముగాక ! క్షణములను వ్యర్థముచేయువారు జీవితము నంతయు వ్యర్థముచేయుదురు అనునది సదా జ్ఞప్తియందుంచుకొనుడు. ఆ అమృతత్త్వమును ఇప్పటినుండైనను గ్రోల ప్రయత్నింపుడు.

వాల్తేరునగర ఋషికొండ సముద్రతీరపు శాంత్యాశ్రమమును, ఉప్పాడ సముద్రతీరమందలి మౌనాశ్రమమును దర్శింప రండు, రండు "సముద్రము అవిరళముగ ప్రార్థించుచున్నది. ఓ మనుజుడా నీవేల ప్రార్థింపవు?" అనెడి సందేశము నందుకొనుడు. ఈ వజ్రోత్సవ శుభ సమయము నుండి నా ప్రతి శ్వాసను ఒక నూతన శ్వాసగా నొనర్తును.

ఈ వజ్రోత్సవజ్ఞాపకార్థముగా మన ప్రతిశ్వాసను ఒక సోహం శ్వాసగా ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసలను శాంతిమయముగా నొనర్తుముగాక ! మనము సోహం నుండియే వచ్చితిమి. అందే ఉంటిమి. మన మందుననే కదలుచు, మెదలుచు సమస్తమును చేయుచుంటిమి. నమ్మినను నమ్మకున్నను మనము కడకు అందులోననే కలసి లీనమై పోదుము. అమూల్యమగు మానవజన్మకు సోహం భావనయే గమ్యము ధ్యేయము సర్వమునని ఎరుంగవలెను. అదియే సర్వసృష్టికిని ఆద్యంతములు.

ప్రాక్పశ్చిమమునగల సత్యాన్వేషకు లందరకు ఈ సోహం సందేశమే ప్రేమ, పవిత్రత, ప్రకాశమునందించు సందేశము. ఈ వజ్రోత్సవము స్మృతి చిహ్నముగా సోహం భావనను తైలధారవలె అవిరళముగ కలిగియుందుము గాక !

శ్లో॥ దేహో దేవాలయ ప్రోక్తో జీవోదేవ స్సనాతనః

త్యజే దజ్ఞాన నిర్మాల్యం సోహం భావేన పూజయేత్.

సర్వకాల సర్వావస్థల యందును సోహం ఒక్కటియే సర్వవ్యాపకమై సర్వజ్ఞమై సర్వశక్తియుతమై వెలుంగునది. ఈ పరిమిత మైనదానిని ఆ అపరిమితము నిత్యసత్యమైన దానిలో లయింతముగాక !

హరి ఓం తత్సత్ ఓం
లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

**అర్పణ**

ప్రాక్పశ్చిమమునగల సోహం భక్తులందరకు విశ్వమానవాళికంతకు ప్రేమ పూర్వక అర్పణ.

## వ్యర్థమని యెంచిన మూడు దినములెవ్వి ?

ఒక భక్తుడు తోటపల్లి ఆశ్రమమునకు చిరకాలమునుండి రాగోరు చుంటినని నేను వాల్తేరు ఆశ్రమము నుండి తోటపల్లి రాగానే తెలియపరచు మని వ్రాయుచుండెను. తోటపల్లి ఆశ్రమమునకు వచ్చిన తరువాత ఆయన కోరినట్లు ఆశ్రమమునకు వచ్చి కొంతకాలము విశ్రాంతిగా, శాంతిననుభ వించుచు వృద్ధి చెందవలసినదని వ్రాసితిని.

ఆ యుత్తరమునకు జవాబుగా ఆశ్రమమునకు వచ్చిన మూడురోజులు తనపని వ్యర్థముగా పాడగునని యతడు వ్రాసిన ఉత్తరమును చదివి చింతించుచు యీ వ్యాసమును వ్రాయ నారంభించితిని. ఆశ్రమములు దర్శించి శాంతిగా ఆత్మానుభవములో గడిపిన రోజులే మన జీవితములో వ్యర్థమైదినములా ? అకస్మాత్తుగా రేపు వైకుంఠము నుండి వెంటనే బయలుదేరి రమ్మని వార్తవచ్చినప్పుడెన్ని రోజులు పని దండుగవునుగదా యని యాలోచింపరేల? ఆశ్రమములకు వచ్చుటకు తీరిక లేకపోవచ్చును అనేకమగు జరూరు పనులు, చక్కబెట్టుకొనవలసిన వ్యవహారములు మొదలగునవి చాలగ వుండవచ్చును. ఆశ్రమములకు యీనెలగాకున్న వచ్చేనెల రావచ్చును. తీరికలేనియెడల మానివేయవచ్చును.

గాని వైకుంఠమునకు వెంటనే వెళ్ళుటకు నిశ్చయమైనపుడో! ఒక్క క్షణమైనను వప్పగింతలకుగాని, కష్టపడి ఆర్జించిన ధనమును కూడబెట్టి లెక్క వేసుకొనుటకుగాని, పిల్లలకు తమ ఆస్తులను అప్పజెప్పుటకుగాని, కాలదోషము పట్టకుండగనే, వసూలుచేసికొనవలసిన బాకీలు, వడ్డీలు చూచు కొనుటకుగాని, లేశమైనను సావకాశమొసంగబడదుగదా ! ఒకటి రెండు రోజులు వ్యవధి కోరినను, ఒక గంటలో వచ్చెదనన్నను, ఒక్కక్షణమైనను సావకాశమివ్వబడదు గదా !

కావున వెలుతురుండగనే మనయింటిని చక్కబరచుకొనవలయును. దీపమారి పోయిన తరువాత చీకటిలో నేమిచేయగలము? ఏ రోజున, ఏ గంటకు, ఏక్షణము నందు వైకుంఠయాత్రకు దయచేయమని సందేశము వచ్చునో యెవరు చెప్పగలరు? నేడున్నవారు రేపుండక పోవచ్చును. రేపున్న

వారు మరునాడు వైకుంఠయాత్రకు ప్రయాణము కట్టవచ్చును. కాన యీ క్షణమే మనది. మరుక్షణము మనదికాదు. ఈ క్షణమునందే మన మనస్సులను దైవమునకర్పించి మేల్కొనవలయును. దైవ పిపాసకులు జన్మతరించెడి శాంతినిచ్చెడి పనియెద్దియో, కాలయాపనచేసెడి వ్యర్థమైన పనియెద్దియో, స్వపరీక్షచే తెలిసికొని అనిత్యమైన పనులకై నిత్యమైన పనిని త్యాగము చేయరాదు.

ఆత్మ స్వరూపులారా ! మీ పనులను మానుకొని, సన్యసింపమనుచుంటినని యభిప్రాయపడవలదు. నేను చెప్పెడిదేమన ఎన్నిపనులలోనున్నను, అసలుపనిని, దైవపనిని, ఆత్మవృద్ధిని గలిగించెడి పనిని మరువరాదు. ఆత్మ వృద్ధికితోడ్పడని పనులన్నియు వ్యర్ధములే. ఆత్మననుభవించుచు శాంతితో గడపెడి పనిమాత్రమే నిజమైనపని. అదియే యెన్నటికైనను శాశ్వతమైన శాంతిని జేకూర్చును. మనభక్తుడిప్పటిలో ఆశ్రమమునకు వచ్చిన మూడు రోజులు తనపని వ్యర్థమగునని వ్రాసెను. ఇక శ్రీరామకృష్ణులు యీ కలియుగములో నీమూడు రోజులు మాత్రమే, ఏకాగ్రతగా, ఏకాంతమైన నిర్జన ప్రదేశములో భగవధ్యానముతో గడిపిన తరించెదరని నుడివియుండిరి. ఏది పనియో, ఏదిపనిగాదో, ఏ పని ముక్తినిచ్చునో, ఏ పని బంధములు కల్పించునో సాధకులు తమ జీవితములను పరిశీలించి తెలిసికొని, దుర్లభడమైన మానవజన్మ పొందగలిగినందులకు, నరజన్మయొక్క గమ్యస్థానమైన శాంతిని బొంద ప్రయత్నింపవలెను.

ప్రియమైన ఆత్మసోదరులారా ! సోదరీమణులారా ! కాలము చాల విలువైనది గాన సంవత్సరమంతయు మీరెట్లు గడపుచున్నదీ, స్వపరీక్షజేసి తెలిసికొనుడు సంవత్సరములో మూడువందల అరవది యైదు రోజులు సంసారతాపత్రయములకు, ధనదేవతారాధనలకు, మీమీ కుటుంబ సంరక్షణములకు, పెండ్లిండ్లలో నుత్సాహముతో నూరేగుటకు, చనిపోయిన వారికి సానుభూతి జూపుచు విచారముతో సాగనంపుటకింకను యెన్నియో లాంచనములతో గడపినను, సంవత్సరములో మూడురోజులైనను, భక్తులేకాంతముగా శాంతిననుభవించుచు మీరందరు తరించుటకై స్థాపింపబడిన శాంతి

నిలయములో గడపుటకిక ముందైనను ప్రయత్నించుడు. దుర్లభమైన మానవ జన్మ పొందగలిగి యేకాంతవాసములో దైవమునసుభవించుటకు, తరించు టకు మీకు తీరిక లేకుండుట చాల విచారమైన విషయము.

"బ్రతికి నన్నాళ్ళు నీభజన తప్పనుగాని

మరణకాలమునందు మరతు నేమొ"

అని యొకభక్తుడు విలపించియుండెను. జీవించియున్నపుడు నిరంత రము భజన చేయుచున్నను, మరణకాలమునందు కఫ, వాత, పైత్యములచే పీడింపబడి దైవమును మరతునేమోయని యాభక్తుడు పరితపించుచుండ, నిక బ్రతికియున్నప్పుడు కూడ దైవమునుమరచి జీవన్మృతులుగాయున్న, నిస్సహాయులైన మానవులగతి యేమి? ఇప్పుడు దైవమును మన మనుభవింప గలిగిన, యెప్పటికైనను దైవము ననుభవింప గలము. ఇపుడనుభవింపజాలని యెడల భవిష్యత్తులో, రాబోవు అస్థిరమైన కాలములో దైవము ననుభవింపగలమని యెట్లుచెప్పగలము?

ఏ దైవస్వరూపము, నిత్యము, సత్యము, శాశ్వతము, మీ జన్మహక్కై యున్నదో, దేనిని పొందుటకు యీ దుర్లభమైన మానవ జన్మయివ్వబడినదో, ఆ దైవస్వరూపము ననుభవించుటకు మీ జీవితములో కొంతకాలమైనను వినియోగించి తరించెదరుగాక ! అశాశ్వతము, అనిత్యము, క్షణభంగురము, కేవలము మాయయనుచు, సంవత్సరమంతటిలో ప్రతిరోజును, ఉదయము లేచినది మొదలు పరుండువరకు, పుట్టినది మొదలు గిట్టువరకు, వ్యర్థము లైన ఆలోచనలతోను, నిష్ప్రయోజనమైన మాటలతోను, నిరుపయోగమైన పనులతోను విలువైన కాలమును వ్యర్థపుచ్చుచు జీవించుట చాల విచార కరము. చీకటిని వెలుతురుగా, విషమునే యమృతముగా భావించుచు, గేలపుముల్లును మ్రింగిన మత్స్యమువలె గిలగిల కొట్టుకొనుచు జీవించు చుండుట చాలా హాస్యాస్పదమును, విచారకరమైన దుస్థితిగా నున్నది. గేలమున నున్న యెరను మ్రింగుచున్నచేప దాని నాహారముగా భావించుచు భ్రమపడుచున్నదిగాని అది తన్ను చంపనున్న గేలపుముల్లనియు, దానినున్న యెరను మ్రింగుటయే తన మృత్యువునకు హేతువనియు భావించుటలేదు.

జన్మించినపుడేమియు మనవెంట తీసుకొని రాలేదు. వైకుంఠమునకు వెళ్ళునపుడు మొలత్రాడైనను తీసుకొని వెళ్ళజాలము. శాంతి నిలయములలో శాంతిగా మన స్వస్వరూపము ననుభవించుచు గడపెడి క్షణములును, స్వార్ధరహితులై మానవసేవయే దైవ సేవగా భావించి గడపెడి కాలమును యెన్నటికైనను మన ఆత్మవృద్ధికి తోడ్పడును గాన నిత్యా నిత్య వస్తు వివేకము గలిగి, దీపము ఆరిపోవక ముందే, మృత్యువాత పడకముందే యెన్ని పనులలో యున్నను, అసలుపనిని, ఆత్మసాక్షాత్కారము నొసంగెడి అన్ని పనులలో నుత్క్రృష్టమైన పనిగా, జీవితములో మహత్తరమైన పనిగా తప్పనిసరియైన పనిగా, జీవితమునకు శాంతిని, మోక్షమును గలిగించెడి పనిగా జేసికొని నేటినుండియైనను తరించ ప్రయత్నించెదము గాక !

లోకాస్సమస్తా సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

## సందర్శకులకు సందేశము

శ్రీ శాంతి ఆశ్రమము మీకు స్వాగతము నొసంగుచున్నది.

దైవ సన్నిధిని ఇచ్చటనే అనుభవించుచు తోడ్పడుడు
ప్రియమైన ఆత్మసోదరీ ! సోదర స్వరూపులారా !

మీరు శ్రమపడి వ్యయప్రయాసలతో ఆశ్రమమునకు వచ్చినందులకు ఆనందము. కాని మీరు శ్రమపడి వచ్చిన ఫలితముగ, ఆశ్రమమునకు వచ్చిన భక్తులందరూ, గేటులోపల ప్రవేశించగానే, పాత చిత్త వృత్తులు, బైటవిడిచిపెట్టి, మీ హృదయములను విశ్వప్రేమతో, నూతనమైన శక్తితో నింపుకొని, ఇచ్చట శాంతిననుభవించి, వృద్ధియై వెడలిన మీకును, మాకును గూడ ఆనందముగా నుండును.

ఫలితములేనిపని శరీరమునకు శ్రమయేగాక, మనస్సునకు అశాంతిగా నుండును. ఏదైవముగురించి తెలిసికొనుటకు, శాంతిననుభవించుటకు ఆశ్రమమునకు వచ్చితిరో ఆ దైవము మీ హృదయములలోనే యుండెను. ఆ దైవశక్తియే మీ నేత్రములలో ప్రకాశించుచు మీ శరీరము నందలి ప్రతి అణువునందును నిండియున్నది. కనుక దైవ సాన్నిధ్యము ననుభవించుటకు యిదియేతావు. ఆయనను నిశ్శబ్దములో తెలిసికొనుటకు యిదియే సమయము. మనము లోపలనున్న దానినే, బాహ్యమున గాంచెదము. మనము అంతర్యమున దైవమును గాంచగల్గిన, బాహ్యమున గూడ అందరిలోను మనకు దైవమేగాన వచ్చును. “యద్భావం తద్భవతి”.

కాలము చాల విలువైనది. మీ విలువైన కాలమును, ముఖ్యముగా ఆశ్రమములోనున్నప్పుడైనను, ప్రార్థన ధ్యానాదులతో హరినామ సంకీర్తనతో సద్వినియోగము చేయుచు, మీరుతరించి, మీ బంధుమిత్రుల అభివృద్ధికి తోడ్పడగోరెదము. నేడేమనది రేపు మనది కాదనెడి సత్యమును గ్రహించి– నేడే తరించ ప్రయత్నించుడు. శాంతి ఆశ్రమము మీ స్వంతమైన జ్ఞాన గృహము మీరు ఆశ్రమమునకు వచ్చిన జ్ఞాపకార్థముగా శ్రీ స్వామీజీకి ప్రియమైన శాంతి ప్రార్థనను స్మరించి, మీ హృదయములను శాంతితో నింపుకొని వెళ్ళి, మీ గృహములందెగాక, మీ గ్రామముల, పట్టణముల లోకమంతయు శాంతిని వ్యాపింప చేయుదురు గాక !

# శాంతిప్రార్థన

( సూక్ష్మములో మోక్షము లోకశాంతి కొరకు )

శాంతిప్రార్థన వేదసారమేగాక అన్ని మతముల సారాంశమైయున్నది. ఒక్క ప్రార్థనతోనే మీరు మీ హృదయనివాసియగు దైవముతో మాట్లాడ గలరు. మీరు పిలిచినంత మాత్రమున దైవముపల్కునన్నట్లు, ఒక్కమారు హృదయపూర్వకముగా శాంతిప్రార్థననుజేసిన, ఈ ప్రస్తుత క్షణమునందే దైవసన్నిధిని మీరు అనుభవించగలరు.

పొలుపుగ పువ్వులు చీరుటకంటెను, కనురెప్ప మూయుటకంటెను, దైవసన్నిధిని అనుభవించుట సులభము. సౌఖ్యము, సూక్ష్మమని చెప్పబడెను ఏలనన, దైవము స్వర్గములోను, ఆకాశములోను దూరముగా మనకు భిన్నముగా లేడు.

దైవము మనకు పాదములకంటెను, చేతులకంటెను దగ్గరగా యుం డెను. ఆయన నేత్రములకు నేత్రముగా, కర్ణములకు కర్ణముగా, మనస్సు లకు మనస్సుగా, హృదయములకు హృదయముగా, శ్వాసలకు శ్వాసగా మనలో ప్రతియణువుననిండి నిబిడీకృతమై యుండెను.

అద్వితీయముగా, విడదీయుటకు వీలులేకుండా, రెండుగాకుండగా నిరంతరము మనతోఏకమై మనసర్వస్వముగా, ప్రతిఅణువులో నిండి యున్న సచ్చిదానంద స్వరూపమును అనుభవించుట ఎంతసులభము.

సూక్ష్మములో మోక్షమనగా ఇదియే. ఒక్కమారు శాంతి ప్రార్థనను స్మరించుచూ దైవమును మన ఆంతర్య హృదయములలో సాక్షిస్వరూపునిగా యున్న, సర్వత్రా నిండియున్న సర్వశక్తిమంతుడైన, సర్వజ్ఞుడైన, ఆ దైవ తేజస్సును అనుభవించుటకు ఇదియే సమయము ఇదియే తావు.

పెక్కుమాటలు వ్రాతలుయేల ? ఇప్పుడే ఇచ్చటనే. ఈ సులభమైన లోకశాంతి ప్రార్థనను ఒక్కమారు స్మరించుచు, దైవములో విలీనమయ్యె దుముగాక! శాంతిప్రార్థనను స్మరించుచు, మన హృదయములను అఖండ మైన శాంతితోనింపి, మన గృహములను స్వర్గధామములుగా జేసు

కొందము గాక ! తరించుటకు ఇదియే సమయము. ఏలనన యీ క్షణమే మనది. వచ్చెడి క్షణము మనదికాదు. గాన దైవపరితాపనతో నిండి యుండి నూరు పాళ్ళు మనస్సుతో హృదయపూర్వకముగా శాంతి ప్రార్థనను స్మరించుచు తరించెదముగాక !

ఇప్పుడే, ఇచ్చుటనే ముక్తి, మోక్షము ఇదియే మన హృదయములలో శాంతిని, మన గృహములలో శాంతిని, మన సంఘములలో శాంతిని, మన దేశములో శాంతిని స్థిరముచేసి ప్రపంచ శాంతికి తోడ్పడును. ఏలనన వ్యక్తిశాంతియే లోకశాంతికి దగ్గరమార్గమై శాశ్వతమైన శాంతిని స్థాపింప జేయును. గాన లోకశాంతి ప్రార్థనను ఇప్పుడు, ఇచ్చుటనేగాక, ఎచ్చుట యున్న వారచ్చుటనే హృదయపూర్వకముగా స్మరించుచు తరించెదరుగాక!

## లోకశాంతి ప్రార్థన

పూజనీయమైన ఓ దివ్యస్వరూపా !

మా లోపలను, వెలుపలను, మీదను, క్రిందను, అంతటనూ నిండియున్న ఓ సర్వాంతర్యామీ ! మా లోపల ప్రత్యణువునందును యిమిడి యుండి మా నేత్రములకు నేత్రము, కర్ణములకు కర్ణము, హృదయములకు హృదయము, మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాస, జీవనములకు జీవనము, ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా ! ప్రేమైకమూర్తీ! నిన్ను తెలుసుకొను భాగ్యము ఇప్పుడు, ఇచ్చుటనే మాకు ప్రసాదింపుము.

ఓ తేజోమయమూర్తీ ! తూర్పుపడమరల, ఉత్తర దక్షిణముల, ఈ విశ్వమందంతటను, అందరునూ నీ దివ్యతేజస్సును గ్రహింతురుగాక. ఓ సచ్చిదానంద స్వరూపా ! ప్రతీమానవ హృదయమునందును, నానాజాతి మధ్యస్థమందును శాంతి, సామరస్యములను ప్రతిష్ఠింపజేయుము, ఓ దేవా! ఇదియే మామనః పూర్వకమైన ప్రార్థన.

దీనిని సదాస్మరించుచు తరించెదరుగాక !

ఈ చిన్న శాంతిప్రార్థనను మొదట వాక్కుతోను తరువాత పెదవుల తోను అటుపిమ్మట మౌనముగా మనస్సుతోను స్మరించుచు మనము శాంతిని

పొంది తరించుటయేగాక సర్వులశాంతికి తోడ్పడెదము గాక !

నేడే మన హృదయములలో శాంతి ఆశ్రమ శాఖలను స్థాపించి మన గృహములను స్వర్గధామములుగా జేసుకొని ఆ దివ్యశాంతినే ప్రపంచ మంతటా ప్రసరింపచేయుచు లోకశాంతికి తోడ్పడెదముగాక !

లోకాసమస్సా స్సుఖినోభవంతు !

ఈ శాంతి ప్రార్ధన వివిధ భాషలలో సంస్కృతము, ఆంగ్లము, హిందీ, తమిళము, కన్నడము, తెలుగు, మళయాలము, గుజరాతీ, ఒరియా, ఉర్దూ, ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, డచ్, రష్యన్ మొదలైన భాషలలో లభ్యముగా నున్నది.

శాంతి ప్రార్ధన మీరంతా స్మరించుచు తరించగోరెదము.

"తండ్రి హరిజేరుమనియెడి తండ్రి తండ్రి" అని చెప్పబడెనుగాన దైవమును జేర్చెడి తల్లిదండ్రులే నిజమైన తల్లిదండ్రులుగాన మనము సదా శాంతి ప్రార్ధన స్మరణతో దైవసన్నిధి ననుభవించుచు మనబిడ్డలను బంధు మిత్రులను దైవమువైపు మరల్చుచు, మన హృదయములను, గృహములను శాంతిశాఖలుగా జేసుకొని లోక కళ్యాణమునకు తోడ్పడెదముగాక !

ఇదియే మిమ్ము ప్రేమించెడి మీ అందరి శాంతిని కోరుచున్న మీ ఓంకారుని నిరంతర ప్రార్ధన.

సర్వేజనా స్సుఖినోభవన్తు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

**అర్పణ**

హృదయములందు, గృహములందు శాంతి ఆశ్రమ శాఖలను స్థాపించి విశ్వశాంతికి తోడ్పడుచున్న సోదర సోదరీమణులందరకు ప్రేమపూర్వక ముగా ఈ శాంతి ప్రార్ధనను అర్పించుచుంటిని.

ఓం ఓం ఓం

# శ్రీ సాయిపూజ

## (ఆశ్రమముతో నెటుల ప్రారంభించబడెను)

**ఉన్నదొక్కటే :**

ఆశ్రమవాసుల పూర్వజన్మ సుకృతముచే, ఆశ్రమ అదృష్టముచే, శ్రీ శాంతి ఆశ్రమము నందు శ్రీ సాయినాథుడు వెలసెను.

శ్రీ సాయి అన్నను, ఈషా యన్నను, క్రీస్తు అన్నను, బుద్ధుడన్నను, శ్రీరాముడన్నను, శ్రీకృష్ణుడన్నను, ఆత్మయన్నను, సోహం అన్నను, శాంతి అన్నను ఒక్కటే నని చిన్నతనమునుండియు నమ్మకము గలిగిన వారలలో నే నొకడను.

ఉన్నదొక్కటే సద్వస్తువు. అద్దానినే మహనీయులు అనేకమైన నామము లతో పిలుచుచుండిరని వేదములు అనాది నుండి ఘోషించుచున్నవి.

దుర్లభమైన మానవజన్మ యొక్క గమ్యస్థానము దైవమును చేరుటయే– బ్రహ్మసాక్షాత్కారమే! ఏ పూజచేసియైనను దైవానుభవమును శరీరముండగనే పొందుట ముఖ్యావసరము. దీపముండగనే మేల్కొనెడివారు, కాలమును సద్వినియోగము చేయుచు నేడే తరింపవలెను. దైవములో లీనము కావలెననిన, దైవమును గూర్చి తీవ్రముగా పరితపించవలయును. అట్టి వారి జీవితములు పరమ పావనమైనవి.

**ఆరంభము :**

శ్రీసాయిబాబా పూజలు దేశము నందెల్లడల జరుగుచున్నవి. ఎవరెవ రెందులకీ పూజల నేయే సంకల్పములతో జేయుచుండిరో, ఎవరి మనస్సులకు వారే సాక్షి !

ఈ సంవత్సరము జన్మదినమునకు ఆశ్రమాభిమానులైన యొక భక్తుల కుటుంబము రాజమండ్రి నుండి ఆశ్రమమునకు వచ్చి యిచ్చటనే వారు రెండు నెలలు శాంతిగా గడపుట జరిగెను. ఆశ్రమములో నిత్య ప్రార్థన జరుగుచున్నను, వారు ప్రతి లక్ష్మీవారము వారి పట్టణములో నున్నప్పుడు

జేయుచున్న శ్రీసాయి పూజను యీ శాంతి ఆశ్రమములో గూడ జేయ నారంభించిరి. ఏ పూజ పేరునైనను దైవనామమును స్మరించుచు దైవములో లీనమగుటే ముఖ్యముగాన, ఆశ్రమవాసులలో కొందరు అందు పాల్గొన సాగిరి.

నేనొకసారి వారుండెడి గదికి వెళ్లి చూచితిని. చాల యిరుకుగా నొక మూలను శ్రీసాయి ఫోటోయుండెను. వెంటనే ఆ గది మీదను క్రొత్తగా కట్టబడిన గదిలో ఈ సాయి పూజచేయుడని కోరితిని.

**శ్రీ సాయి మందిరము :**

వ్యయప్రయాసలతో ప్రార్థన ధ్యానాదుల కొరకు కట్టించబడుచున్న ఆ క్రొత్తగది అప్పుడే పూర్తియగుచుండెను. ఇంకను తలుపులు పెట్టలేదు. అన్నియు సిద్ధముగా నుండెను. రెండవ ఆలోచనయైనను లేకుండగ నేను ఆ గదిని శ్రీ సాయినాథుని పూజలకు అర్పించి 'శ్రీసాయి మందిరము' అనెడి నామకరణము జేసితిని.

శ్రీసాయినాథుడు నా చిన్న ప్రేమపూర్వకమైన అర్పణకు ఆనందించె నన్నట్లు, ఆయన లీలలను వ్యక్తపరుప నారంభించెను.

**శ్రీసాయి లీలలు :**

ఏ పండు ప్రసాదముగా నర్పించినను దాని మీద 'సాయి' అనెడి అక్షరములు వ్రాయసాగెను. కొంత ప్రసాదమును గూడ స్వీకరించుచుండెను. అరటిపండు మీద అక్షరము లుండవని నేను వెలగపండు పంపగా దానిమీద గూడ పవిత్రమైన ఆ అక్షరములను వ్రాసెను.

వెలగపండు మీద అక్షరములు చాల కాలముండవని, శ్రీసాయినాథుని జ్ఞాపకార్థమై, ఆయన వ్రాసినది నా దగ్గర ఉంచుకొనుట కని, కురిడీ కట్టిన చాలచిన్న కొబ్బరికాయను, బాగుగా గీచి దానిని పూజలో పెట్టగా, 'సాయి' అనెడి పెద్ద అక్షరములను రెండువైపుల ఆ కొబ్బరికాయ మీద వ్రాసెను. ఇప్పుడు నేనీ వ్యాసము వ్రాయుచుండ ఆ పావనమైన చిన్న కొబ్బరికాయ నా చెంతనే యున్నది. 'సాయి' అనెడి పవిత్రాక్షరములు గానవచ్చుచున్నవి.

ఈ కాయ ఎంత గట్టిగా నున్నదనగా, కత్తితో గీచినను గీతపడనంత గట్టిగా చేవదేరి యుండెను. కాని శ్రీ సాయినాథుని కసాధ్యమైన పనిలేదు గదా! అరటిపండ్లు, కొబ్బరికాయ మీదనేగాక, ఏ పండ్లు పెట్టిన ఆ పండ్లమీదనే శ్రీసాయి నామము వ్రాయబడుచుండెను. జీడిమామిడి పండ్లు పెట్టగా పండ్ల మీదనే గాక, వాటి పిక్కల మీద గూడ బీజాక్షరములు వ్రాయబడెను.

ఇద్దరు సాయి భక్తురాండ్రు చీకటిపడు సమయమున నా కుటీరము నుండి వెళ్లుచుండ పెద్ద పాము వారి కాళ్లలో పడెను. ఒక ఆమె దాని తోకను త్రొక్కెను. వెంటనే 'ఓం సాయి' అనగనే ఆ పాము తల వంచుకొని నెమ్మదిగా చెట్టెక్కి పోయెను. నేను నా మందిరము నుండి యీ దృశ్యమును జూచుచు, వారు దారిలో ఆగుట 'ఓంసాయి', అనెడి మాటలనుట గూడ వినుచుంటిని. ఇట్టి నిదర్శనములు శ్రీ సాయి మహాత్మ్య మని సాయిభక్తు లందురు. పాము కరవకుండుట పూర్వజన్మ సుకృతమని విమర్శకులు అన వచ్చును.

పిఠాపురము నుండి వచ్చిన ఆశ్రమ భక్తులొకరు, ఆయన బంగారపు యుంగరమును శ్రీసాయి పూజలోవుంచి, దానిమీద శ్రీసాయినాథుడు తన నామమును వ్రాసిన ఆ ఉంగరమును శ్రీసాయిపూజ కర్పించెదనని తలచెను. తర్వాత చూడగనే సాయి అను అక్షరములు వ్రాయబడి యుండెను. ఆయన తన వాగ్దానము ప్రకారము ఆ ఉంగరము యొక్క విలువ ముప్పది రూపాయలను శ్రీసాయిపూజ కర్పించెను. ఆ ఉంగరమును శ్రీసాయి జ్ఞాపకార్థముగా వాడుచుండెను. అనేకమంది భక్తులు వారి వారి ఉంగరములను, గొలుసులను, గడియారములను, లాకెట్టులను పెట్టగా అన్నిటి మీదను శ్రీ సాయి నామాక్షరములు లిఖింపబడి యుండెను.

**శ్రీసాయి సేవ :**

శ్రీ సాయినాథుడు వ్రాసిన అక్షరములు ఆదర్శముగా నుంచుకొని ఆయన సన్నిధిని నిరంతరము అనుభవించుచు, ఆధ్యాత్మికముగా వృద్ధి నొందుట ఆనందకరమే! ఐనను ప్రత్యక్షముగా నిరుపేదలగు రోగులకు శ్రీసాయిసేవ అందుబాటులో నుండుట ముఖ్యావసరమని తలచి ఒక

విభూతి పండును పూజలో నుంచగా 'శ్రీసాయిమందు' అని దాని మీద వ్రాయబడెను.

ఆశ్రమములో నౌకరు తీవ్రమైన జ్వరముచే వణకుచుండగా–భస్మమును వారికి మంచి తీర్థములో కలిపి యివ్వగా వెంటనే జ్వరము తగ్గుటే గాక ఆయన తన పనిపాట్లు జేయుచుండుట జూడ చాల ఆశ్చర్యమును, ఆనందమును జనియించెను.

ఏ కారణముచేతనో ఆశ్రమములోని ఆవుపాలు రెండు రోజుల నుండి త్రాగుటకు వీలు లేనంత చేదుగా మారుచుండెను. శ్రీ సాయినాథుని విభూతి ఆవునకు పూసిన వెంటనే దాని పాలు యథారీతి మాధుర్యముగ నుండెను. ఇటులనే అనేకమందికి అనేక విధముల సేవ శ్రీ సాయిబాబా భస్మముచే చేయుట జరిగెను.

దగ్గర, దూరమున నున్న రోగులందరికీ భస్మము ఆయన పేరున పంపబడుచున్నది. అందరికి ఆరోగ్యము కలుగుచున్నది. ఇదియొక అద్భుత లీల !

శ్రీ సాయి లీలలు ఆశ్రమములో నుండి ప్రత్యక్షముగా జూచుచున్న మాకే ఆశ్చర్యము కలుగుచుండ, దూరముగా నున్నవారికి, పైవారికి కొందరికి నమ్మకము గూడ కలుగకుండ యుండవచ్చును. అది వారి ప్రారబ్ధము ననుసరించియే యుండునని చెప్పవలసి యున్నది.

**శ్రీరామనవమి :**

అర్థరాత్రిలో ఒంటిగంటకే మెలుకువ వచ్చినది. శ్రీసాయి లీలలను శ్రీసాయి సందేశముగా వ్రాసితిని. ఈ పవిత్ర దినమున, ఆశ్రమవాసులందరు ఈ సందేశమును చదువుకొని మిక్కిలి యానందించిరి. తామందరి యుపయోగార్థమైన శాంతిలో గూడ ప్రకటింపబడుచున్నది.

ఈ సాయినాథుని అపారమైన కృపలను నాపై వర్షించుచున్నందున నే నుండెడిగదిలో గూడ నొక మూల బీరువాలో ఆయన చిత్తరువును ఉంచి, అచ్చట పండుగాని పుష్పముగాని ఉంచుచుందును. చివరకు

సంపెంగ పుష్పము యొక్క ప్రతిరేకు మీదను 'సాయి' అనెడి పవిత్రాక్షరములు వ్రాయబడి యుండును. మనుష్యమాత్రులెవరైన అక్షరములను పుష్పముల యొక్క రేకుల మీద వ్రాయ ప్రయత్నించిన వెంటనే రేకులన్నియు నూడి పోవును.

శ్రీసాయినాథునకు అర్పించిన పుష్పము ముడుచుకొని యుండగనే లోపల ప్రతీరేకు మీదకూడను 'సాయి' అనెడి నామము చిత్రించి యుండుట బహు ఆశ్చర్యకరముగా నుండును.

నేను అర్ధరాత్రిలో లేచి శ్రీసాయి సన్నిధికి వెళ్లగనే శ్రీరామనవమి జ్ఞాపకార్థమా యన్నట్లు, బత్తాయి పండును సగముగా చీల్చి సగము పండు వరకు ఆరగింపబడియుండెను. ఆహా ! ఆ యానందమును మీకెట్లందించ గలను?

ఈ పవిత్రదినములలో నేనెచ్చట నున్నను, యేమి చేయుచున్నను, యేదో యొక మహా పావనమైన దివ్యసన్నిధిని నా ఆంతర్యముననేగాక, మీదను, క్రిందను, చుట్టును వ్యాపించి యున్నట్లు అనుభవించుచున్నాను. ఈ దివ్యసన్నిధి మమ్ములను కంటికి రెప్పవలె గాచుచున్నది. మరియు మనస్సునకు మనస్సుగను, హృదయమునకు హృదయముగను, శ్వాసకు శ్వాసగను అహర్నిశములు మనలను అభేదముగా గాంచుచున్నది. ఇట్టి స్థితిలో మనమెటుల ద్వైతభావనతో మనోవాక్కాయ కర్మలను చేయగలము? శ్రీసాయినాథుడే నా చెంత నుండి నాచే యీ వ్యాసమును వ్రాయించుచుండె నన్న భావన నాకెంతయో ఆనందమును కలిగించుచుండును. మనంతట మనము చిన్న గడ్డిపరకనైనను కదల్పజాలముగదా ! అంతయు దైవకృప!

**శ్రీరాజాజీ :**

ఆశ్రమస్తులును, స్వార్థరహితులును, భక్తి ప్రేమస్వరూపులునైన మా రాజాజీ శ్రీసాయినాథుని లీలలు అనేకములు నిత్యముగాంచుచు శ్రీసాయిబాబా కొక పెద్దదగు చక్కని దేవాలయమును కట్టించవలెనని సంకల్పించిరి. తత్సంకల్పమును శ్రీ సాయినాథునికి వారు నివేదింపగా పరమాశ్చర్యము కలుగునట్లు శ్రీ సాయి ఒక కాగితము మీద 'శ్రీసాయి

సన్నిధి యిదియే' అని వ్రాసిరి. పూజామందిరము గోడ మీదనుగూడ 'శ్రీసాయి సన్నిధియిదియే' యని వ్రాయబడి యుండెను. స్వోపయోగమునకై నిర్మింపబడిన కొత్తగదిని అవ్యాజ ప్రేమతో నా చిన్న కానుకగా శ్రీసాయి మందిరమునకై సమర్పించి నందుకు, శ్రీసాయి అందు వెలయుటకై సమ్మతించి నందులకు ఆశ్రమ వాసులు, భక్తులందరు మిక్కుటముగ ఆనందించుచుండిరి.

**శ్రీసాయి తటాకము :**

ఇప్పటికే లోకములో శ్రీసాయినాథుని, ఇతర దేవతలను, మూర్తులను, దారు, శిలా నిర్మితములగు దేవళములలో అశేషముగా వెచ్చించి విగ్రహములుగా చేసి యుంచుట జరిగెను. దీనికంటె నుత్తమతరముగా నుండునటుల జేయుటకు బాటసారులలోనున్న దైవమును సేవించుటకు, పక్షులలో నున్న దైవ సేవకు, వృక్షములలోని దైవసేవకు, ఆశ్రమవాసులు, భక్తులలో నున్న దైవమును సేవించుటకు సర్వజీవరాసులకు శాశ్వతముగ నుపయోగపడులాగున నొక 'సాయి తటాకము'ను నిర్మించుటకు నిశ్చయింప బడి పవిత్ర శ్రీరామనవమి దినమున శంఖుస్థాపన జేయబడెను. దైవకృపచే శ్రీసాయితటాకము త్వరలో పూర్తియై శ్రీసాయి భక్తులందరకును, ఆశ్రమ వాసులకును, జంతుజాలమునకును శాశ్వతముగ నుపయోగపడు గాక !

**శ్రీసాయి భక్తుల కాహ్వానము:**

పలుతావుల నుండి శ్రీసాయి లీలలను ఆశ్రమములో జూచుటకు ఆశ్రమభక్తులు చాలమంది వచ్చుటకు కోరుచుంటిమని ఉత్తరములు వ్రాయు చుండిరి. దైవపరితాపనతో నిండియున్న భక్తులందరకును సుస్వాగతము. కాని ఉంగరముల మీదను, పండ్లమీదను పేర్లు వ్రాయించుకొనుటకు రావలదు. మీరందరును ముఖ్యముగ రావలసినదే; దైవపరితాపముతో నిండి రండు. దైవసన్నిధి ననుభవించుటకు రండు. శ్రీసాయిలో విలీనమగు టకురండు. స్వార్థరహితమైన విశ్వప్రేమను చవిచూచుటకు రండు. శ్రీసాయినాథుని సేవను అనుష్ఠించుటకు, దేశవృద్ధికి, లోకశాంతికి తోడ్పడు టకు రండు. ఇదియే మీకు శ్రీశాంతి ఆశ్రమ వాసులర్పించెడి ఆహ్వానము.

## శ్రీసాయినాథునికి నా వకాల్తనామ :

శ్రీసాయినాథుడు ఆశ్రమములో వెలసినప్పటి నుండియు నా బాధ్యత చాలభాగము తగ్గినట్లు స్వతంత్రముగాను, ఆనందముగాను జీవించ గలుగుచుంటిని. అనేకమంది భక్తులనేక మగు కోరికలతో నావద్దకు వచ్చుచుందురు. వారందరిని యిప్పుడు శ్రీసాయినాథుని వద్దకు పంపుచుంటిని. దూర దేశముల నుండి నా సహాయము కోరుచు నుత్తరములు వ్రాయువారికి గూడ ఏ, ఏ అవస్థలలో నున్నవారికైనను శ్రీసాయి భస్మము పంపుచు, శ్రీ సాయినాథునే పూజింపమని కోరుచుందును.

మొన్న ఒక ఆయుర్వేద వైద్యులు తనకు పిల్లలు లేరని, సంతతి కలిగెడు లాగున ఆశీర్వదించమనికోరెను. వెంటనే ఆయనను శ్రీసాయి మందిరమునకు పంపితిని. యం.ఏ. చదివి,పెద్ద కళాశాలలో పనిచేయు చున్న ఆశ్రమభక్తులొకరు యూనివర్శిటీ వైస్‌ఛాన్సెలర్‌గారి సహాయము కావలెనని చాలకాలము నుండి విసుగు విరామము లేకుండ ప్రార్థన పూర్వకముగా నాకు వ్రాయుచుండవారిని శ్రీ సాయిబాబాతో కలిపితిని. ఇప్పుడు వారికిని నాకును గూడ తృప్తికలిగెను. క్రిందటి వారమున మరియొక భక్తుడు వచ్చి న్యాయమైన తన దావాలో జయము కలుగులాగున ఆశీర్వదించ మని కోరెను. వెంటనే శ్రీసాయి మందిరమునకు పంపితిని. ఎవ్వరెవ్వరు వారి వారి అవస్థలలో నన్నేమి కోరుచున్నను వారిని శ్రీసాయినాథునికి అప్పగించు చుంటిని. మరొక భక్తురాలు తన తండ్రికి జబ్బుగా నున్నదని వ్రాయగా శ్రీసాయి విభూతిని చెన్నపట్టణము పంపితిని. మరొక భక్తురాలు, హిందీ ఉపాధ్యాయురాలు తన పరీక్షలో జయము కలుగుటకు ఆశీర్వదించమని వ్రాసెను. ఇటులనే నిత్యము వచ్చెడి భక్తుల కోరికలను వారి వారి అర్హతలను బట్టి తీర్చుటకై శ్రీసాయినాథునికి నా వకాల్తనామాను అర్పించి, నేను నిమిత్త మాత్రముగా స్వస్వరూపము ననుభవించుచు జీవించుచుంటిని.

## నా అర్పణ :

శ్రీసాయి సన్నిధిని ప్రత్యక్షముగా,ఆంతర్యమున, బాహ్యమున అన్ని

వైపులను అనుభవించుచుండుటచే నీ దినములలో నేది భుజించినను ముందు శ్రీసాయినాథునకు అర్పించకుండ తినబుద్ధి కలుగుటలేదు. ఆశ్రమములో తేనెపెట్టెల నుండి తేనెను దీసి దానిని నావద్దకు తీసుకొని రాగా ఆ సీసాను శ్రీసాయినాథుని వద్ద నుంచితిని. మరునాడు గట్టిగా బిగింపబడిన ఆ సీసామూత తీసివేయబడి యుండెను. మరునాడు రెండు అవున్సుల తేనె ఆరగింపబడి యుండెను. నే నుండెడి చోటునకు ఎవ్వరును రారు. శ్రీ సాయినాథుడును, నేనేయుందుము. దాని మూతను సాయియైన తీయవలెను; లేదా నేనైనను దీయవలెను. ఈ ఆరగించెడి పండ్లనుగూడ యిద్దరిలో నొక్కరు ఆరగించవలెను. నేనారగించుట లేదు. కాన శ్రీసాయియే ప్రేమతో నారగించుచుండెనని ఆనందించుచున్నాను. పూర్వము పురాణములలో భక్తులర్పించెడి నైవేద్యములను దైవము స్వీకరించుచుండెనని చదివి యుంటిమి. అట్టిది నేడు స్వయముగా ఆశ్రమములో ప్రత్యక్షముగా జూచుట అదృష్టవంతము.

**నిత్యపూజ :**

శ్రీసాయిపూజ లక్ష్మీవారమునాటి రాత్రి మాత్రమే జేయబడుచుండెను. ఒక్క లక్ష్మీవారమే జేయనేల? రోజును చేయుడని కోరితిని. రాత్రివేళనే చేయ నేల? ప్రాతఃకాలమున గూడ చేయమంటిని. కాన యిప్పుడు శ్రీసాయి పూజ నిత్యము ఉదయము, సాయంత్రము నియమముగా జరుగుచున్నది. శ్రీసాయినాథుడు తన సన్నిధిని నిరంతరము వ్యక్తపరచుచుండెను. కాన దైవ పూజను అప్పుడిప్పుడనక ప్రతి గంటలోను, ప్రతినిముషమందును. సర్వకాల సర్వావస్థల యందును, ఆత్మపూజను భక్తి శ్రద్ధలతో దైవపరితాపముతో నిండి చేయమని కోరుచుంటిని.

సర్వాంతర్యామియైన, సర్వ హృదయ వాసియైన దైవమును అనుభవించుటకు కాలనియమ మేల? ఇప్పుడప్పుడన నేల ?నిరంతరము ప్రతిశ్వాసతో గూడ దైవమును అనుభవించగలిగినట్టి జీవితములే, ఉత్తమములైన, పావన ములైన జీవితములు.

**తుదిపలుకు నా గానము :**

ప్రియమైన శాంతి పాఠకులారా ! ఆధ్యాత్మిక జీవితములను, కొన్ని ఆంతర్య అనుభవములను గోప్యముగా నుండుటకు బదులు, ప్రతివారికిని తెలియచేయుట అవివేకమైనను, భక్తి ప్రేమలతో నిండియున్న మీ అందరి శారీరిక, మానసిక, ఆధ్యాత్మిక వృద్ధిని కోరుచు శ్రీసాయి లీలలను మీతో పంచుకొనుట జరిగెను.

మీకేవిధమైన సహాయము కావలసియున్నను, ఈషా రూపమున మీలో, సోహంగా, ప్రజ్ఞ రూపముగ వెలింగెడి మీ హృదయాంతర్వర్తి యగు శ్రీ సాయి ద్వారానే పొందగోరెదను.

నేనీ రోజులలో పాడెడి నా ఆత్మగానమును గూడ మీ కందజేసి శ్రీసాయి వ్యాసమును పూర్తి చేసెదను.

శ్రీసాయినాథుడే నాచే యీ వ్యాసమును వ్రాయించుచుండెను. కాన, నిది ఆయనకే అర్పితము. మీరుగూడ నాతో కలసి యీ చిన్న గీతమును కీర్తించెదరా ?

నేను సాయిలో నుంటిని.

సాయి నాలో నుండెను.

సాయి నేను రెండు గాదు; వేరు గాదు.

ఉన్నదొక్కటియే.

అదియే నీవు.

తత్త్వమసి

హరిః ఓం తత్ సత్ ఓంః

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి మే, 1954)

# శ్రీ సాయిపూజ- రెండవ భాగము

## శ్రీసాయిపూజ : మొదటిభాగము:

'శాంతి'-2 వ సంచికలో 'శ్రీసాయిపూజను' గురించిన వ్యాసము ప్రకటింపబడినప్పటి నుండియు అనేక వ్యాఖ్యలు, విమర్శలు బయలు దేరినవి. ఎవరి శ్రద్ధాభక్తులను బట్టివారు, ఎవరి సంస్కారములను బట్టివారు, ఎవరి విశ్వాసావిశ్వాసములనుబట్టి వారు వ్రాయుచున్నారు. కొందరు రాళ్లు విసరిరి. కొందరు తటస్థముగ నుండిరి. కొందరు పుష్పవర్షము కురిపించిరి. రాళ్ళు విసిరిన వారికిని, తటస్థులకును, పువ్వులు వేసినవారికిని అందరకును నా కృతజ్ఞతా వందనములు.

శ్రీశాంత్యాశ్రమ స్థాపన జరిగి సుమారు నలుబది వత్సరములయినది. ఆంగ్లమున 'పీస్' తెలుగున 'శాంతి' పత్రికలు ఇరువది వత్సరముల నుండి వెలువడుచున్నవి. ఈ పత్రికలలో నిదివరకు లేనిది, యిపుడు శ్రీ సాయి లీలలను గురించి యేల వ్రాయవలసి వచ్చినదని యెవరైనను ప్రశ్నించినచో నదివరకట్టివి శాంతి యాశ్రమములో కనుపించకపోవుటచే వ్రాయలేద నియు, నిపుడు కనుపించుచుండుటచే వ్రాయుచుంటి ననియు నా సమాధానము.

నేనుకూడ, ప్రత్యక్షముగ చూచి యనుభవించు వరకు దేనిని సులభ ముగ నమ్మువాడను కాను. ఇంతకు పూర్వము, నాకు సన్నిహితులయిన యాశ్రమవాసులు కొందరు, యితర ప్రదేశములలో తాము ప్రత్యక్షముగ ఈ లీలలను, అనగా పండ్ల మీద వ్రాతలు మొదలగునవి చూచితిమని చెప్పినను నేను పూర్తిగ విశ్వసించలేదు.

ఇపుడు, ఆశ్రమములో నా కన్నుల యెదుట ప్రత్యక్షముగ అనుదినము జరుగుచుండ నేను నమ్మకుండుటెట్లు?మూర్ఖుడు తన కుందేటికి కాళ్ళు మూడేనని వాదించును. కాదని చూపినను తన యభిప్రాయమును మార్చు కొనడు. బుద్ధిమంతులు, జ్ఞానముగలవారు, సందర్భములనుబట్టి తప్పనపుడు తమ యభిప్రాయములను మార్చుకొందురని పెద్దలు చెప్పియున్నారు.

## శ్రీ సాయిలీలలపై వ్యాఖ్యలు :

గత సంచికలోని వ్యాసమును ప్రకటించక పూర్వము, శ్రీసాయి కను పరచుచున్న లీలలను గురించి, అమెరికా నుండి మలయా వరకు గల దేశములలో నివసించు ననేకమంది జ్ఞానులు, అనుభవజ్ఞులు, భక్తులు, ఆశ్రమ శ్రేయోభిలాషులు నగు చాల మందితో ఉత్తర ప్రత్యుత్తరములను జరిపితిని. మనదేశములో కూడ సుప్రసిద్ధులయిన మహనీయులను సంప్ర దించితిని. ప్రసాదమును ఎలుకలు తిని యుండవచ్చునని కొందరు యభి ప్రాయము పడిరి. పండ్లపై చెక్కు చెదరకయుండ నెలుక లోనికి దూరి తొనలను మాత్రమెట్లు తినగలుగును? ఆశ్రమములో నెవరయినను యీ పనులను చేయుచుండవచ్చునని కొందరి మతము. ఫలపుష్పముల మీదను, రేకులమీదను బీజాక్షరములను వ్రాయుటకు వలసిన శక్తి సామర్థ్యములు, తెలివి తేటలుగలవారుగాని, నన్ను వంచించు నుద్దేశము గలవారు గాని యాశ్రమమున నెవరును లేరు. చిన్న సంపంగి పుష్పముయొక్క రేకులమీద రెండు ప్రక్కలను పేరు వ్రాయప్రయత్నించినచో రేకులు తప్పక యూడి వచ్చును. అరటిపండు నొలవకయే లోపల నామమును వ్రాయుట మానవు నకు సాధ్యముకాదు.

మరికొందరిదంతయు భూతములపని యనిరి. భూతములు బల్లలను కుర్చీలను కదపుట, వానినిపైకెత్తి పడవేయుట, రాళ్ళు వేయుట పలు తావుల జరుగుచుండునని వినుచుందుము. కాని ఆశ్రమములో ఈ లీలలను కనుపరచు చున్న భూతము, యితరులకు హానిచేయు పనులను చేయక భక్తులకు శ్రద్ధ, విశ్వాసము కలుగునట్లు బీజాక్షరములను వ్రాయుట, భక్త విజయము మున్నగు గ్రంథములలో వ్రాయబడిన రీతిని భక్తుల భక్తి బలము ననుసరించి ప్రసాదము నారగించుట మాత్రమే జరుగుచున్నది.

ఈ లీలలను గురించి నా మిత్రులును, కోయంబత్తూరులో నాధ్యాత్మిక చికిత్సాలయ కార్యదర్శులగు నొకరికి వ్రాయ, వారు 'సాయి' యన 'ఈసా' యనియు, ఈసా యన దేవుడనియు, నొకే సద్వస్తువు అనేకముగ వ్యక్తమగు చున్నదనియు, ఆశ్రమవాసుల పూర్వ సుకృతముచే నట్టి లీలలు ద్యోతకమగు చున్నవనియు నానందించుచు బదులు వ్రాసిరి.

**శ్రీ శివానందస్వామీజీ, ఋషీకేశము :**

జగద్విఖ్యాత యశోదురంధరులును, ఆధ్యాత్మిక లోకమున నగ్రగణ్యులైన భక్తకోటి కపారమైన సేవచేయుచున్న శ్రీ శివానంద స్వాముల వారికీ లీలలను గురించి సవిస్తరముగా వ్రాసియుంటిని. వారెంతయో ఆనందించుచు నిట్లు వ్రాసిరి.

యోగవేదాంతారణ్య విశ్వవిద్యాలయము

అధ్యక్షులు : శ్రీస్వామీజీ శివానంద

ఆనంద కుటీరము

ఋషీకేశము, హిమాలయములు,

2.5.1954

పరమపవిత్రులగు శ్రీ ఓంకార స్వాములవారికి,

శ్రీశాంత్యాశ్రమము

యశోరాశి యగు నమృతాత్మా !

నమోవాకములు, సాష్టాంగదండ ప్రణామ పురస్సరముగ ఓం నమో నారాయణాయ.

తాము దయతో వ్రాసినది 15-4-1954 తేదీ గల జాబు చేరినది. ఆశ్రమములోని శ్రీసాయి పూజను గురించి తాము వ్రాసినది చదివి యమందానంద మొందితిని. నిశ్చయముగ దేవుని యొక్కయు, సాధువుల యొక్కయు విధానములు దురూహ్యములు. ఔను. బ్రహ్మజ్ఞాన శోభితులగు మహాత్ములును భగవంతుడు నొక్కటియే.సృష్టియందలి యీ పరస్పర విరుద్ధములగు విషయములను పరమేశ్వరుని దివ్యశక్తి స్పష్టీకరించినది. పరమేశ్వరుని హృదయము ద్రవించునంతటి భక్తితో, దేనినైన నర్పించి నపుడు, ఆ భక్తినిగ్రహించినట్లు గుర్తుగ, శ్రద్ధాభక్తులున్నచోట తన యునికిని తెలియజేయుటకు పరమేశ్వరుడపుడు నైవేద్యములో కొంత భాగమును తనదయిన యేశక్తి యీ సృష్టికి కారణమో ఆ శక్తిలోనికి స్వీకరించుట

జరుగును. పరమేశ్వరుని యీ యద్భుతమయిన లీలావిశేష ములు స్తోత్రార్హ ములు. అవి జయమగునటుల చేయగల భక్తి బలమంత కంటె నుతింప దగినదియు, నద్భుతమునైయున్నది. అట్టి భక్తులు కీర్తింప బడుదురుగాక!

తమ నందరిని పరమేశ్వరుడాశీర్వదించుగాక !

భవదీయాత్మ

శివానంద

**ఆనందాశ్రమ ఋషిపుంగవులు, పరమపూజ్యులు నగు శ్రీరామదాసజీ మహరాజ్ వారు శ్రీసాయి లీలలను గూర్చి ఉత్తేజకరములగు నీ దిగువ మాటలను వ్రాసిరి.**

శ్రీసాయి పూజ సమయములో జరుగు అసాధారణ విషయమును గూర్చి రామదాసు చెప్పగలిగినది భగవల్లీల ఆశ్చర్యజనకమని, అనేక విధముల తన నిగూఢశక్తులను ఊహింపజాలనటుల ప్రకటించువానిని సరిగనే సూత్రధారి యని చెప్పిరి. ఇతర ప్రదేశములలో శ్రీసాయి బాబా ఇదే విధముగ చేసిన అద్భుతమగు కార్యములను రామదాసు వినినాడు. భారత దేశమం తటా వేలమంది చేత సాయి పూజింపబడుచున్నాడు. శ్రీసాయి బాబా వంటి ఆత్మ తేజస్సుతో ప్రకాశించుచున్న వారి యందున్న దివ్యశక్తిని భక్తుడు తన శ్రద్ధచేత వ్యక్తమగునటుల చేయుచున్నాడు. అంతరంగ రాజ్యములో ఇట్టి సంఘటనలు సహజము. ఈ విషయములో రామదాసు చెప్పగలిగిన దంతయు ఇంతియే.

ఉపనిషద్విహారాశ్రమ సంస్థాపకులు, అధిపతులు, వేదాంతపితామహ, జ్ఞానభాస్కర, పరమ పూజ్యులునగు శ్రీరాజేశ్వరానంద స్వాములవారు ఆశ్రమములోని సాయి లీలలను గణుతించి తన శిష్యుల ఉపయోగార్థమై శ్రీసాయి విభూతిని పంపమని కోరిరి.

హిమాలయ ప్రాంత మహాత్ములు కూడ సాయి విభూతిని పంపమని కోరుతూ వుత్తరములు వ్రాయుచున్నారు. కోరిన భక్తుల కందరికి విభూతితో పాటు లోకశాంతి ప్రార్థన కూడ పంపబడుచున్నది.

## నైవేద్యము నారగించు విగ్రహము:

ది 13-6-1954తేదీగల 'సండేటైమ్సు' పత్రికలో 'నైవేద్యము నారగించి మాటలాడు విగ్రహము' అను శీర్షిక క్రింద నీ దిగువ పొందు పరుపబడిన విషయము ప్రకటింపబడినది.

చిదంబరములో ఎనుబది సంవత్సరముల వయసుగల బ్రాహ్మణోత్త ముడు కలడు. ఆయన గణేశోపాసకుడు. ఆయనపూజ చేయునపుడు గణేశ విగ్రహము నైవేద్యము నారగించును. చాలమంది భక్తులా దృశ్యమును చూచుచున్నారు.

ప్రకృతి శాస్త్రజ్ఞానలవవిదగ్ధులు సర్వజ్ఞత్వము నారోపించుకొని వెంటనే, యాలోచించకయే దానిని బూటకము, మోసము అని నిరసించివైతురు. తమ మానసిక స్థితినిబట్టి వారట్లు పలుకుదురు. అనుభవజ్ఞులగు భక్తి భావశోభితులు సర్వజ్ఞుడగు నీశ్వరుని ముందు మన యల్పబుద్ధులు నిరుప యోగములని గుర్తించి, 'ఒరులను విమర్శించకుము, నీవుకూడ విమర్శనము నకు గురియగుదువు,' అను క్రీస్తు మహోపదేశమును స్మరించి తెలియని విషయముల నధిక్షేపించుట తగదని యెంచి దైవలీలకు దాసోహమని యానందింతురు.

## భగవల్లీలలు :

ఇట్టి లీలలు శ్రీసాయితోనే ఆరంభము కాలేదు. మన పురాణముల లోను, భక్తవిజయము మున్నగు గ్రంథములలోను వర్ణింపబడిన భక్తుల జీవితము లన్నియునిట్టి చిత్రములతో నిండియుండెనని యాయా గ్రంథము లను చదివినవారి కవగతమే. అవతారమూర్తి యని పేరుగాంచిన శ్రీరామ కృష్ణ పరమహంస శిష్యులలో నొకరు, ఆయనశక్తిని పరీక్షించుటకు ఒక చెట్టున రెండు రకముల పువ్వులు పూయునట్లు చేయుమని కోరెననియు, శ్రీకాళీమాత యట్లుచేసి శ్రీరామకృష్ణుని మహిమను వెల్లడించెననియు, యీ క్రింది సంభాషణవల్ల తెలియగలదు.

దక్షిణేశ్వరాలయమును కట్టించిన శ్రీమతి రాణీరాసమణీదేవి యల్లుడు

శ్రీమధరనాథ్‌విశ్వాస్ ఒక దినమున భగవంతుడు గూడ తన శాసనములకు తలయొగ్గ వలసి యుండుననియు, ఒకసారి శాసించిన పిమ్మట దాని నుల్లంఘించుట కాయనకు కూడ వీలుపడదనియు, శ్రీరామకృష్ణునితో వాదించెను. శ్రీరామకృష్ణుడు “నీవాదము సరియైనది కాదు. శాసకుడు తన శాసనము నుల్లంఘించవచ్చును. లేక దానిని రద్దుచేసి క్రొత్త శాసనమును చేయవచ్చును’ అనెను. అది నచ్చక మధురబా బింకను ఇట్లనెను.” ఎఱ్ఱని పూలు పూయుమొక్క ఎఱ్ఱని పూవులనే పూయును. తెల్లని పూవుల నెన్నడును పూయనేరదు. మంచిది, ఎఱ్ఱనిపూవులు పూయు నీ మొక్కకు తెల్లని పూవులు పూయునట్లు చేయనిండు. చూతము’.మఱునాడు మామూలుగ నెఱ్ఱనిపూలు పూయు చీనా గులాబీ మొక్క యొక్క కొమ్మ రెండు రెమ్మలమీద రెండు పుష్పములను శ్రీరామకృష్ణుడు గాంచెను. అందొకటి యెఱ్ఱగను, మఱియొకటి స్వచ్ఛముగ తెల్లగ నుండెను. శ్రీరామకృష్ణుడు కొమ్మను చేతబట్టుకొని, ‘ఇదిగో చూడుము.” అని మధురబాబునకు చూపెను. ఆయన ‘తండ్రీ ! నేనే ఓడి పోయితిని’ అని యొప్పుకొనెను.

మన యల్పబుద్ధుల కందని మహత్పూర్ణమయిన, దుర్గ్రాహ్యమయిన భగవల్లీలలను, మనము చిన్నతనముచే మాయ, మోసము అని నిరసింపబూనుట కేవలము అజ్ఞానము, అవివేకము.

**భావస్వాతంత్ర్యము :**

నేను, నా సన్నిహితులు సదా స్వతంత్రముగ నుండి వారి వారి భావములు, నమ్మకముల ననుసరించియే తమ గమ్యస్థానమును చేరుటకు తోడ్పడుచుందును. కృష్ణభక్తులను రామభక్తులుగను, విష్ణుభక్తులను శివభక్తులుగను, క్రైస్తవులను మహమ్మదీయులుగను మార్చుట కెన్నడును నేను ప్రయత్నించను. అట్లే శ్రీసాయి యందనురాగము గలవారిని వలదని వారించను. శ్రీసాయి యందు నమ్మకము లేనివారికి శ్రీసాయి నారాధించిననే గాని ముక్తిలేదని బోధించను. ఎవరి భక్తి విశ్వాసములనుబట్టి వారు తమ ఇష్టదేవతను నిత్యము స్మరించి ధ్యానించుచు లక్ష్యమును పొందుటయే ముఖ్యము. గోదావరిని దాటుటకు, పడవయో, రైలుబండియో, మరి యేదైన

నౌకసాధనము కావలెనుగదా ! దేనితో దాటి నను గోదావరిని (భవసాగర మును) దాటుట ముఖ్యముగ కావలసినది. ఎట్టి సాధనములు లేకయే, బాబాలు, అవతారమూర్తుల ప్రసక్తిలేకయే నదిని దాటి గమ్యస్థానమును చేరుటకు వీలులేదా యను ప్రశ్న రావచ్చును. గోదావరిని యీది దాటగలమాయని యాలోచింతుము. మనలో కొందరికి యీత యననేమో తెలియక పోవచ్చును. ఈత వచ్చినను గోదావరి నంతను ఈదగల శక్తి లేకపోవచ్చును. అపుడేదైన నౌకసాధన మవసరము. లక్షకే యొకరో గోదావరిని పూర్తిగ నీదగల వారుండవచ్చును. అట్టి శక్తియుతులను పడవ నెక్కుమని గాని, బాబాలను పూజింపుడని గాని నేను కోరను, అట్టివారి జీవితములు ధన్యములు, ఆదర్శప్రాయములు.

**'సాయి' యను నక్షరములు :**

నా చెంతనుండి సేవచేయుచు నాశ్రమ నిర్వహణమును చేయు నతడే నిస్సంకోచముగ నన్నిట్లు ప్రశ్నించెను. "స్వామీజీ! 'సాయి' యను నక్షరములు వ్రాసిన, నెవరి కేమిలాభము? దాని వలన ప్రయోజనము ముక్తియా మోక్షమా?" అందుకు సమాధానముగ నేను "నాయనా ! ఆ యక్షరములు నీకును నాకును అర్థరహితములుగ గన్పట్టవచ్చును. అవి రాతి మనములను, ఇనుప హృదయములను కదల్పలేకపోవచ్చును. కాని శ్రీసాయిని ప్రేమించు వారికి, తామర్పించిన ఫలపుష్పముల మీద శ్రీసాయి నామము దృశ్యమయి నపుడు శరీరములు పరవశములగును. ఒకదివ్యశక్తి తమ చెంత నుండి తమ్ము కాపాడుచున్నదను నానందముతో, నూతన శక్త్యుత్సాహములతో నుత్తేజితులగుదురు. ఇటీవల 'సాయి' యను పవిత్రాక్షరములు తామర్పించిన ఫలపుష్పములమీద గాంచిన మాత్రమున పూర్తిగ మారిపోయిన జీవితము లెన్నియో కలవు. వారిపుడు నియమముగ స్నానమాచరించి నిత్యము పూజాదికము లొనర్చుచున్నారు. ప్రార్థన ధ్యానమున నేమియో నిదివరకు తెలియని వారిపుడుదయము సాయంత్రము శుచిగా పూజ యొనర్చినగాని యేమియు భుజింపమని దీక్షతో యున్నారు. అంతయు దైవకృప, ఎవరెవరికి ఆత్మానుభవమే యే దివ్యమూర్తి యారాధనముచే కలుగవలయునో, అది

వారి పూర్వపుణ్యము వలనను, భక్తి శ్రద్ధలనుబట్టియు లభ్యమగుచుండును.

**ఈ మధ్య జరిగిన శ్రీసాయి లీలలు :**

కాకినాడ నుండి కొందరు భక్తులు తమ స్త్రీలతో కారుమీద ఆశ్రమమునకు వచ్చిరి. శ్రీసాయి మందిరములో పూజ, ప్రార్థన ధ్యానాదికముల నొనర్చి శ్రీసాయికి ఫలముల నర్పించి భోజనమునకు వెడలిరి. కాకినాడకు మరలిపోవుటకు ముందు ప్రసాదము కొరకు శ్రీసాయి మందిరమున కరిగి చూడ వారు నైవేద్యముగ నర్పించిన మామిడిపండ్లమీద 'సాయి' యను బీజాక్షరములనుగాంచి వారు తన్మయులైరి. రాజమహేంద్రవరము నుండి కొందరు ఆశ్రమభక్తులు, శ్రీసాయీ ప్రచారకులగు శ్రీ విశ్వనాథముగారితో కలసి యాశ్రమమునకు వచ్చి పది దినములు నిత్యము ప్రార్థన, ధ్యానము, భజన మున్నగు వానితో నానంద ముగ గడపిరి. వారు ప్రతిదినము అర్పించు ఫలములమీద 'సాయి' అను నక్షరములు ద్యోతకమగుచుండెను. శ్రీవిశ్వనాథముగారు శ్రీ సాయీ ప్రచారకులగుట వలననో, మరెందువలననో తమ గడియారము లోపల వెలుపల కూడ 'సాయి' యని వ్రాయబడెనని నాకు చెప్పిరి. దానిని నాకు చూపమంటిని. చూడగా లోపలి డిప్పమీద, క్రింద, పైన నలుమూలలా కూడ వ్రాయబడిన వానిని చూపిరి.

మొన్న తుని నుండియొక శ్రీసాయీభక్తసమాజము వారు ఆశ్రమము నకు వచ్చి చాలసేపు భజనచేసిరి. వారు కొబ్బరికాయలను, ఇతర ఫలములు మొదలగు వానిని నైవేద్యముగ శ్రీసాయి కర్పించిరి. వారు తొందరగ నింటికి పోవలసియుండుటచే నొకరిని మాత్రముంచి మిగిలినవారు వెడలిపోయిరి. నాటి సాయంత్రము, వారు నైవేద్యముగ నుంచిన అన్ని పదార్థముల మీదను 'సాయి' యను నక్షరములుండెను. కొందరు విభూతి పండ్లను, చిన్న వెండి రేకుల నుంచిరి. వాని మీద కూడ నక్షరములుండెను. నిలిచిపోయిన భక్తుడు వాని నన్నిటి నానందముతో గొనిపోయెను. ఒకచిన్న విభూతి పండును, ఒక వెండి రేకును మాత్రము జ్ఞాపకము కొరకాశ్రమములోనుంచితిమి.

ఒకనాడు వాల్తేరులోని యాశ్రమ నిర్వాహకులిచటికి వచ్చిరి. వారికి శ్రీసాయిలీలల యందంత నమ్మకమున్నట్లు నాకు తోచలేదు. నాటిరాత్రి ఆయన నాగదిలో పండుకొనెను. నేను వెలుపల పరుంటిని. ఆ రాత్రి శ్రీసాయి విగ్రహముకడ నుంచబడిన పండు ఉదయమునకు కొంత యారగింపబడి యుండుటను జూచి యాయన యాశ్చర్యపడి శ్రీసాయి గాకున్న తానే దానిని తినియుండవలెనని, పండును పరిశీలింపసాగెను. ఈ యలౌకిక చిత్రములెట్లున్నను, వ్యాధి బాధితులు శ్రీసాయి మందును శ్రీశాంతి ప్రార్థన సహితముగ వాడుచు ఆరోగ్యమును పొందితిమని వ్రాసిన జాబులను చదువునపుడు నాకు అనిర్వచనీయమైన యానందము కలుగుచుండును. వానిని నా జీవితములో నత్యంత పవిత్రమైన క్షణములుగ నెంచి యానందించుచుందును. ఏ విధముగ నైనను దైవసాన్నిధ్యమును నిరంతర మనుభవించుచు మానవ జీవిత గమ్యమును చేరి, పునరావృత్తి లేకుండ జేసికొనుట వాంఛనీయము, ముఖ్యావసరము.

**శ్రీసాయి పుష్కరిణి :**

పుష్కరిణికి శ్రీసాయి పేరెందులకుంచవలె నని కొందరు సర్వజ్ఞులు సందేహించుచున్నారు. రామకృష్ణ చికిత్సాలయమని, వివేకానంద గ్రంథాలయమని, రామతీర్థ ఆశ్రమమని, గాంధీ శరణాలయమని, శివానంద నగరమని, జహ్వారు వీధి యని వివిధములగు సంస్థలు అవతారముల, దేశనాయకుల నామములతో వెలయుచుండ, శ్రీసాయి పేరు మాత్రమే యుంచరాదనుటకు శ్రీసాయి ఈ విమర్శకాగ్రేసరుల కెట్టి యపకారమొనర్చెనో? శ్రీసాయి లీలలను ప్రత్యక్షముగ నాశ్రమములో ననుదినము గాంచు చుంటిమి గనుక మానవులకు, పశుపక్ష్యాదులకు, వృక్షములకు నుపయోగపడు చెరువును త్రవ్వించుటకు నిశ్చయించి దానికి శ్రీసాయి పుష్కరిణి యని నామకరణమొనర్చితిని. నేనిది వ్రాయుచుండ దైవానుగ్రహము వలన నలుబది మంది శ్రీసాయి పుష్కరిణిని త్రవ్వుచుండుట అత్యంత ముదావహము.

భగవత్సంకల్పముచే నెపుడు, ఎచట నెవరిచే యేపని జరుగవలయునో అది యట్లే జరిగి తీరును. సర్వాంతర్యామియు, సర్వజ్ఞుడునైన యా సర్వే శ్వరునకు ధన్యవాదములు.

**గురుశిష్య భావన :**

మొదటినుండియు గురువుగ నుండవలెనను భావము నా యందు లేకుండుట నా పూర్వ సుకృతము. అందరును దైవస్వరూపులే. అందుచే నేనందరిని నా గురువులుగనే చూచుటకు యత్నించెదను. నా జీవితానుభవ మంతయు నీ క్రింది మూడు చిన్న వాక్యములలో నిమిడి యున్నది.

1. నాపై నాధారపడ వలదు.

2. ఇతరుల మీద నాధాపడవలదు.

3. మీ హృదయమునకు హృదయమై యుండి, మీ శ్వాసకు శ్వాసగ నహర్నిశలు 'సోహం, సోహం' అని వచ్చు నజపగాయత్రీ మహామంత్రమును గుర్తించుచు ఆ దివ్య తేజమునందే లీనముకండు. మీలోనే యుండి మీ జీవితమున కాధారమై భాసిల్లుచున్న జ్యోతిమీదనే యాధారపడుడు.

అటులయిన మీ సహాయము నర్థించి వచ్చువారిని శ్రీసాయికడ కేల పంపుచుంటిరని ప్రశ్నింపవచ్చును. ఉన్నదొక్కటియే! శ్రీసాయి యందు భక్తి ప్రేమలతో నిండియున్న పసిబిడ్డలను, ఆ సాయినే ప్రేమించుచు తమ గమ్యస్థానమునుచేరుటకు తోడ్పడుచుంటిని. ఎచటెటచ మహాత్మ్యము కలదో, ఏ మహనీయుల నుండి యాత్మతేజము, లోకశాంతి కలుగుచున్నవో, అట్టి వారందరిలో వ్యక్తమగుచున్న తేజస్సునకు, ఆత్మశక్తికి నా శిరమును వంచి నమస్కరించెదను. శ్రీశంకరభగవత్పాదులుకూడ తమ మనీషా పంచకములో చండాలుడైనను, బ్రహ్మజ్ఞానము, విశ్వప్రేమ, అపరభక్తి కలవారికి నమస్క రింతునని నుడివి యున్నారు.

**శ్రీసాయి మందు :**

"భస్మమును 'శ్రీసాయి మందు' అని యేలనియ్యవలెను? శ్రీ ఓంకార స్వామి మందు అని యేల నియ్యరాదు?" అని నన్ను ప్రేమించు వారును

ఆశ్రమాభిమానులు నగు కొందరడుగుచున్నారు. “స్వామి మరణించెను; ఓంకారమే మిగిలియున్నది” యను భావముతో నివృత్తి యందు కాలము గడపెడి నేను “ఓంకారస్వామి మందు” అని యిచ్చుటకంటె హాస్యాస్పద మును, అహంకార భూయిష్ట మయినదియు నగు నింకొకటి యుండునా? ఆ మాటయే నాకు నవ్వు పుట్టించుచున్నది. అదిగాక విభూతి పండ్లమీద “ఓంకారస్వామి మందు” అని వ్రాయబడలేదు. ఏ మహనీయుడు వానిమీద తన పవిత్రమైన నామమును వ్రాయుచున్నాడో ఆయన పేరిటనే వ్యాధి బాధితుల కారోగ్యము కలుగుగాక ! ఓంకారస్వామి మరుగుపడి యాత్మ తేజము నందు విలీనమై యుండుగాక !శ్రీసాయి తేజముచే, శ్రీసాయిభక్తు లకు, వ్యాధులవలన, బాధలవలన పీడింపబడువారి కందరికిని శాంతి చేకూరుగాక ! మందిరములో శ్రీసాయి పటముతో,శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, బుద్ధదేవుడు, గాంధీజీ, శ్రీరామకృష్ణ, రామతీర్థమున్నగు మహనీయుల పటములు కూడ నున్నవి.కావున శ్రీసాయి భక్తులును, శ్రీసాయి మందును వాడుచున్న వారందరునుపైన పేర్కొనబడిన అందరు అవతార పురుషుల యాశీర్వాదములు తమకు కలవని దృఢముగ నమ్మి మందును శాంతి ప్రార్థనతో నుపయోగించుచు నారోగ్యవంతులై తరింతురుగాక !

**శ్రీసాయి సర్వవ్యాపకత్వము, అంతర్యామిత్వము :**

ఒకసారి శ్రీమతి తర్ఖడు అను నామె షిర్డీలో నొకయింట బసచేసెను. మధ్యాహ్నము భోజనము సిద్ధమయి వడ్డన జరుగుచుండెను. అపుడొక యాకలిగొన్న కుక్క యచటికి వచ్చి మొరగ నారంభించెను. ఆమె వెంటనే లేచి దానికొక రొట్టెను వేసెను. అది యా రొట్టెను ఆవురావురుమని తినెను. సాయంత్రమామె మసీదునకు పోయి శ్రీ సాయికి కొంత దూరమున కూర్చుండెను. శ్రీసాయి యిట్లు సెలవిచ్చెను. తల్లీ ! నీవు నాకు కడుపు నిండ గొంతువరకు నాహార మిడితివి. శోషిల్లిన నా ప్రాణములు కుదుట పడినవి. ఎల్లపుడు నిట్లు చేసినచో నీకు మేలు కలుగును. నాయందు కనికరముంచి, ఆకలిగొన్న వారికి ముందుగ నాహార మిచ్చి పిమ్మట నీవు భుజింపుము. దీనిని బాగుగ జ్ఞప్తియందుంచు కొనుము.” ఆమెకిది యంతయు మొదట నర్థము కాలేదు. అందుచే నామె యిట్లనెను. “బాబా!

నేను నీకెట్లు భోజనము పెట్టితిని? నేనే నా భోజనము కొరకు ఇతరులపై యాధారపడుచుంటిని."శ్రీ సాయి యిట్లు బదులు చెప్పెను. ఆ కమ్మని రొట్టెను తిని పూర్తిగ సంతుష్టుడనైతిని. నాకింకను త్రేనుపులు వచ్చుచున్నవి. భోజనమునకు ముందు నీవు రొట్టెవేసిన కుక్కయు, నేను నొకటే, అట్లే యితర జీవులను (పిల్లులు, మేకలు, ఆవులు, ఈగలు మొదలయినవి) నేను నొకటే. ఆ యా రూపములలో నేను తిరుగుచుందును. అన్ని జీవులలో నన్నెవరు చూతురో వారు నాకు ప్రియతములు. అందుచే బేధభావమును, హెచ్చుతగ్గులను విడనాడి నేడు నన్ను సేవించినట్లెల్లపుడును సేవింపుము." అమృతోపమానములగు నీ వాక్యములను గ్రోలి యామె మైమరచెను. ఆమె నేత్రములు బాష్పపూరితములయ్యెను. కంఠము రుద్ధమయ్యెను. ఆమె యానందమునకు మేరలేకుండెను.

నేను గుహలో ధ్యానము చేయుచుండ నల్ల కుక్క యొకటి గుహ మీద గదిలో గంటలతరబడి ధ్యానములో నున్నట్లు పండుకొని యుండును. దానిని జూచినపుడెల్లను శ్రీసాయి నాకు స్మరణకు వచ్చుచుండును. దానికి జత మరియొక ఎఱ్ఱకుక్క వచ్చి చేరెను. అదికూడ గుహమీదనే ధ్యానము నారంభించెను. వాని నెవరయిన పిల్లలు తరుమ ప్రయత్నించిన నవి శ్రీసాయి రూపములని వారికి చెప్పి, తరుమనీయక వాటికి ప్రతిదినము అన్నము పెట్టించుచుందును. ఈ శ్రీసాయి రూపములు నిరంతరము గుహ నంటిపట్టుకొని యుండుట నాకాశ్చర్యము కలిగించుచుండును.

నైవేద్యము మీద ప్రాకుచు నారగించు చీమలు కూడ తానే నని శ్రీసాయి చెప్పుచుండును. చీమలను పండ్లనుండి దులుపునపుడు, భగవంతునికే బాధకలిగించుచుంటినని నా మనసు బాధపడుచుండును. ఏలనన అణువు మొదలు అజాండము వరకు, బ్రహ్మపర్యంతము, అంతయు సర్వవ్యాపియు, సర్వాంతర్యామియు నయిన భగవంతుని చేతనే నిండి యున్నది గదా! ఏ బాబా పేరునైన నేమి, యీ విశ్వరూప సందర్శనమును పొందగలిగిన వారి జీవితములు ధన్యములు.

## శాంతి ప్రార్థన :

శ్రీసాయి మందును శ్రీశాంతి ప్రార్థనతో కలిపి సేవింపుడని చెప్పుచు కోరిన వారందరికిని మందుపంపుచున్నాము. శ్రీసాయి మందు శరీరము నందలి వ్యాధులను పారద్రోలుచున్నది. శ్రీశాంతి ప్రార్థన మానసిక బాధలను బాపి యాధ్యాత్మికాభివృద్ధికి తోడ్పడుచు శాంతి నొసంగుచున్నది. అదివరకు ప్రార్థన యన నేమో తెలియని చాలమంది శ్రీసాయి మందు పేరిట తమ వ్యాధులను కుదుర్చుకొనుటకైనను శాంతిప్రార్థనను వల్లించి, నిరంతరము స్మరించుచు శారీరక, మానసిక వ్యాధులను నివారించుకొనుట మిక్కిలి సంతోషించదగిన విషయము. శ్రీశాంతి ప్రార్థనను వల్లింప, లేని పసిబాల బాలికల విషయమున వారి తలిదండ్రులు ప్రార్థనను వల్లించి, మందును బిడ్డలనే సేవింప జేయుచున్నారు. శ్రీ శాంతి ప్రార్థన స్మరణ మాత్రముచే దైవసాన్నిధ్యమును కలుగ జేయును.

ప్రియమైన శాంతి పాఠకులారా ! మన మందరము నిపుడు మన శాంతినే గాక లోకశాంతిని కూడ కోరు నీ శాంతి ప్రార్థన నొకసారి హృదయ పూర్వకముగ స్మరించి మన జన్మహక్కును, కోటిసూర్య ప్రభాభాసమానము నగు నా దివ్యతేజము నెపుడోగాక యిపుడే, యెచటనో గాక యిచటనే అపరోక్షముగ ననుభవింప ప్రయత్నింతుముగాక !

అపరోక్షానుభూతి కలుగనంతవరకు ఈ దివ్యమయిన లోకశాంతి ప్రార్థనను మరల మరల స్మరించుచు మన గమ్యస్థానమును చేరెదముగాక!

(శాంతి ఆగస్టు 1954)

## శ్రీమతి సరోజినీదేవి జన్మదిన జ్ఞాపకార్థంగా ఇచ్చిన సందేశము

నేడు దేశభక్తురాలైన, లోకప్రసిద్ధిజెందిన, రచనలలోను, పద్యములు వ్రాయుటలో హిందూదేశపు కోకిల అని పేరు సంపాదించిన శ్రీమతి సరోజినీదేవి యొక్క జన్మదినము.

శ్రీమతి సుశీలాదేవి గారు హిందూదేశములో నుండగా ఒక్కసారి మేమిద్దరము హైదరాబాదు నుండి బొంబాయికి వెళ్లుచు ఆ రైలుబండిలోనే సరోజినీదేవి ప్రయాణము చేయుచున్నందున, స్త్రీల పెట్టెలో సోదరి సుశీలా దేవి ఆమెతో కలసి ప్రయాణము జేయుటయు ఆనాడు నేనుగూడ ఆమెను జూచుటయు తటస్థించెను.

ఆ రోజున సరోజినీదేవి అస్వస్థతగా నున్నందున, సేవా స్వరూపం బైన సోదరి సుశీలాదేవి నర్సుగా, రోగుల సేవలో ఆమె జీవితమును గడపి యున్నందున, ఆరోజున శ్రీమతి సరోజినీదేవికి గూడ సేవజేసి ఆమె మన్ననలను పొందెనని విని నేను చాల ఆనందించితిని.

దేశభక్తుల, దైవభక్తుల జన్మదినములు జరుపునప్పుడు, వారి గుణ గణములను, నీవు ఇంద్రుడవు, చంద్రుడవు అని పొగడుచు, పెద్ద ఉపన్యాసము లిచ్చుట కంటెను, వారిలోనున్న ఏ ఒక్క మంచి గుణమైనను మన జీవితములో అనుభవములో పెట్టుకొన్న అదియే నిజమైన జన్మదిన ముగా భావించెదను, అట్టిమార్పు, ఆంతర్యవృద్ధియే, మనము జన్మదినములు జరుపుకొనుచున్న వ్యక్తులకును పైనుండి జేయించువారికిని సహకారిగా నుండును.

డాక్టరు రమణి సోదరి – సరోజినీదేవి జన్మదినము సగము పూర్తియైన తరువాత Sceptred flute songs of India అనెడి పుస్తకమును నాకు అందజేసి, ఆమె జన్మదినముగాన, శ్రీమతి సరోజినీదేవి పేరున ఏమైనా వ్రాయమని కోరినందున యీ రెండు మాటలు వ్రాయుట జరుగుచున్నది.

ఈ పై పుస్తకములో ఆఖరిపేజీ తెరచి చివరి పద్యము డివోషన్ (భక్తి) అనెడి యీ క్రింది యెనిమిది పంక్తుల పద్యము చదవగా నా జీవితమే ధన్యవంతమైనట్లు భావించి, తృప్తి పొందితిని.

ప్రియమైన సోదరీ! సోదర స్వరూపములారా ! జీవితమునకు ఉత్తేజము,నూతనమైన శక్తిని గల్గించెడి ఆ పద్యమును మీతో పంచుకొనుటకు కోరుచుంటిని.

## భక్తి

మూలం : అనువాదం :

శ్రీమతి సరోజినీదేవి శ్రీ దివాకర్ల రామమూర్తి

ఓయి ! ప్రేమావతార ! మహోజ్జ్వలుండ
ఇదియె, నీ కోర్కెయే యైనదేని నాశ
రీర మాంసకృత్తుల కత్తిరించి వైచి
ఇంత లింతలుచేసి తిన్పింపు నీదు
కుక్కలన్ బిల్చుకొని ప్రీతి కొరకు, సామి!

నా శరీర రక్తంబును నదుల వోలె
బారగాజేసి కోర్కె యేపార నీవు
సామి, యుష్మ దుద్యాన వృక్షములకెల్ల
ఆలవాల పూర్ణంబుగా నరుగనిమ్ము.

కాదయేని నా హృదయంపు బాదు పెటికి
యిమ్మగు కుటీరంబు నిర్మించు కొనుము
లేదయేని కోరియున్న లీలగాంచు
నాదు, కలల, దుమ్ముగను క్షుణ్ణంబొనర్పు.

ఇంతకును నే నెవండ ప్రేమింప బడగ
లేద హింసింప బడగ తూలింపబడగ
స్వామి ! తలపోయ నేను నీవాడగానె !
మెడనులిమి, యుఱిదీసి, యేమేనిజేసి
విసరికొట్టుము, జ్వాజ్జ్వల్య వీతిహోత్రు
గర్భమందున సరి ! సరే ! కాని ఏల
అస్మ దమలప్రేమ, మఱి, భయంబునొంద
ప్రతిఘటింప స్ఖాలిత్య సంభరము నొంద ?

ఓయి ! నీవాడను దయాపయోబ్ధి నేను !
త్వద్విశాల వక్షస్థల భాగమందు
నొక విరిగులాబిగా బడియుండ నెంతు
కాదయేని నీకోసమై గడ్డిపఱక
నగుచు, నరకాగ్ని కాహుతి నగుదు స్వామి!

ఈ పద్యముల యొక్క గూఢమైన గాంభీర్యమైన అర్ధము భావనలు డాక్టరు రమణి సోదరి మీ అందరకూ విపులముగా బోధపర్చును.

పరమపావనమైన శ్రీమహాత్మాగాంధీ గారి ప్రియ శిష్యురాలైన శ్రీమతి సరోజినీదేవి జన్మదినము జ్ఞాపకార్థముగా, మన అందరి జీవితములు నూతనమైన త్యాగము, శక్తితోనిండి మాతృభూమికి తోడ్పడుగాక !

ఇదియే మీ అందరి శ్రేయస్సును వృద్ధిని కోరెడి మీ సోదరుని ఓంకారుని ప్రార్థన.

లోకా స్సమస్తా స్సుఖినోభవంతు

సరోజినీదేవి జన్మదిన జ్ఞాపకార్థముగా ఒక్క నిమిషము నిమీళిత నేత్రులమై శాంతి ప్రార్థన స్మరించుచు, ఆమె ఆత్మశాంతిని, నిశ్శబ్దముతో కోరెదముగ గాక ! ఓం ఓం ఓం

(శాంతి ఏప్రిల్ 1964)

# మంత్రాత్మకమగు ఓంకారమహిమాభివర్ణనము

## పరిచయము

శ్రీ ఓంకార స్వామివారు అమెరికాకు బయలుదేరుటకు ముందు గావించిన 30 రోజుల మౌనయుతమగునట్టి ఉపవాసము సందర్భమున 24వ దివసమున శ్రీస్వామివారిని దర్శింప శాంత్యాశ్రమమునకేగి యుండు తరి నుపవాసదినములలో వారు రచించిన కొన్ని ఉపన్యాసములతోపాటు "ఓంకారమంత్ర మహిమంబును" గూడ ఇంగ్లీషున చదివి ఆనందించుట కును, అద్దాని అనువాదమునకు ఉపోద్ఘాతమును వ్రాయుటకును నాకు అవకాశము నొసంగినందులకు శ్రీస్వామివారి కెంతయును కృతజ్ఞు డను. ఈ గ్రంథము వేద వేదాంత సారమగుటచే పలువురు మిత్రులు కోరగా తెనుగున వ్రాయించి ఈ పుస్తక రూపమున ప్రచురించనైనది. ఇది శ్రద్ధతో చదివి చక్కగా ధ్యానము చేయదగిన విషయమైయున్నది. దీని చివరను ధ్యాన విషయకమగు చక్కని అభ్యాసములు రెండుగలవు. అవి అనుదినమును అభ్యసించు సత్యాన్వేషకులకు మిక్కిలి యుపకరించు ననుటకు సందియము లేదు. సంస్కృత ఓంకారము యొక్క చిత్రము దీనితోచేర్చబడి యున్నది. అది ధ్యానము గావించుటకు అనువగు సాధనమైయున్నది.

ఓంకారముతోడ నైక్యభావమునుజెంది పరిశుద్ధ తేజస్సును ప్రేమను అఖిలప్రపంచమునకును మనము పంపుచున్నామని భావించుట మిక్కిలి ఉదారభావమై యున్నది. ఈ అమూల్యమగు గ్రంథమును చదువు సుకృతా త్ములు మనచే వినబడు సమస్త శబ్దములయందును ఓంకారమిమిడి యుండుటను గమనింపప్రార్థితులు. ఏలనన దాని నుండియే ఈ ప్రపంచ మందలి సమస్త ధ్వనులును ఏర్పడినవని తత్త్వశాస్త్రజ్ఞులు నిర్ణయించి యున్నారు. మీ యందును సమస్త చరాచర భూతజాలమునందును నిరంత రము సన్నిధిచేసి యుండు ఓంకారరూపమగు పరమాత్మను పనిచేయు చుండు నపుడును విశ్రాంతిని చెందియుండునపుడును మీరు సంపూర్ణ వ్యక్తతతో సదా అనుభవించెదరుగాక.

**దర్భా వెంకటశివరామరావ్,** పూర్వఆశ్రమ గౌరవ కార్యదర్శి

# మంత్రాత్మక మగు ఓంకార మహిమాభివర్ణనము

ఆశ్రమమునందలి ఆరాధన ఓంకారముతో ప్రారంభించబడి దీర్ఘముగా ఉచ్ఛరింపబడిన ఓంకార మహామంత్రము తోడను, ధ్యానముతోడను, ముగింపబడును.

పలువురు మిత్రులును ఆశ్రమ ప్రేక్షకులును ఓంకారము నందలి విశేషమును వివరింప నన్ను గోరి యుండిరి. నేనును వారలకు అద్దానిని గురించి సంగ్రహ రూపమున జెప్పి ఆ పవిత్రమగు విషయమును గూర్చి సమగ్రమగు సందేశమును శాంతి పత్రికయందు ప్రచురించెదనని చెప్పి యుంటిని. కావున, నీ విషయము చిరకాలము క్రిందటనే యూహింపబడి అనేకమంది స్నేహితులకు వాగ్దాన మొన రింపబడి యుండెను.

ఇప్పుడు అనగా నా యుపవాస కాలమునందలి పదు నేడవ దివసంబున ఓంకార మంత్రాక్షరమును గురించి ధ్యానింపుచు అందు విషయమై వ్రాయుటకై కూరుచుండ, ఈ పవిత్రాక్షర మహిమను సాకల్యముగ చర్చింప నశక్తుండనని పొడగంటిని. ఏలనన ఆ యంశము విపులంబును, ఉత్కృష్టంబు నగుటచే నాబుద్ధిని సర్వసామాన్య మగు నా మనంబునకును దురవగాహముగ తోచెను. దాని సంపూర్ణ తత్త్వంబును దెలియగోరు శాంతిపాఠకులను శ్రీ రామతీర్థ స్వామివారు ఓంకారమును గురించి సెలవిచ్చియున్న మహత్తరమగు ఉపన్యాసములను తిలకింప గోరుచున్నాను. తత్త్వశాస్త్రములంకురించి మతవిషయక చర్చలు ప్రారంభమైననాటి నుండియు ఓంకార మంత్రమును గురించి వందలును, వేలును, గ్రంథములు వ్రాయబడెను. తెల్లవారుఝాము సుమారు మూడు గంటలు సమయమున ఒంటరిగా గూరుచుండి నా యుపన్యాసమును ఎచ్చట, ఎట్లు ఉపక్రమింపవలెనో తెలియ జాలని అసహాయస్థితిలో నుంటిని. అందుచే ఆ పదమునకును, ప్రపంచ మునకును సృష్టికర్తయగు ఆతని గురించి నెమ్మదిగా ప్రార్థించితిని.

"ఓ ప్రభువా ! నేను ఏమియు నొనరింపజాలని దీనస్థితి యందుండుటను గ్రహించితిని. నాలోని పరమాణువుల యందు సహితము నీవు యుండుటచే శాంతిపాఠకులగు నా సోదరీ సోదరులకు భక్తి ప్రబోధకమై యుపకరించు విధమున ఈ వ్యాసమును నాకు బదులు నీవే వ్రాయవేడు చున్నాను. నోరులేని జంతువుల యొక్క యవ్యక్తములగు కోరికలను సహితము నీవునెరవేర్చుచున్నావు. కావున నాప్రార్థన నాలకించి నీ తేజమును, ప్రేమను, శక్తిని నాకు ప్రసాదించి తన్మూలమున మర్త్య స్వభావ జనితంబును నికృష్టంబును యగు నా జీవభావ మంతరించి ఘనంబగు నీ శాసనము నెరవేరు నట్లను గ్రహింప ప్రార్థన."

సృష్ట్యాదిని మంత్రముండెను. మరియు నా మంత్రము దైవాధీనమును, దైవమునుగూడయై యుండెను. ఈ యుక్తులు మంత్రము గూర్చి యెంత సుబోధకంబుగను ఎంత భక్తిభావ ప్రేరితంబుగను బేర్కొనియున్నవి. పై నుదహరింపబడిన మంత్రము మహామంత్రమగు ఓంకారము కంటే భిన్నము కాదని వేరే చెప్పబనిలేదు.

అది 'క'గాని 'ఖ'గాని క్రీస్తుగాని కృష్ణుడుగాని బుద్ధుడుగాని మహమ్మదు గాని యేల కాగూడదని మీరడుగవచ్చును. అయ్యది మంత్రాక్షరమగు ఓంకారమే యేల

కావలెనని యందురా? ఓంకారము సులభముగను స్వాభావికముగను ఉచ్చరింపదగి సమస్త ధ్వనులను అంతర్భూతముగ గలిగి యుండుటచే నోరులేని జంతువులు సహితము దాని నుచ్చరింప గలుగు చున్నవి. ఆ పదము ప్రతి మతమునందును ఏదోయొక రూపమున వాడబడి యున్నది. ప్రతిభాషయందు సహితమది పేర్కొనబడి యున్నది. ఓమ్, ఏమెన్, ఏహమిన్ మొదలగు పదములన్నియును సత్యోపదిష్టమగు సమాధి స్థితిని సూచించు చున్నవి.

విశేషించి రాముడు, కృష్ణుడు, క్రీస్తు, బుద్ధుడు, మహమ్మదు అనునవి కేవలనామములును పదములును మాత్రము యయి యున్నవి. వాని యందు మీకెంత గౌరవము పూజ్యభావములున్నను అవి మీకంటే వేరని గాక మీరు తలచెదరు. అవి మీయందలి యంశ ములుగాక మీ నుండి వేరుగనున్నవి. ప్రణవాక్షరమగు ఓంకారమువలె నవి మీ హృదయకుహరముల నుండి వెడల నేరవు. ఓంకారమును మీరొకపరియుచ్చరించి చూడుడు. సదా మీలోపల నుండుటచే నది బయటనుండి వచ్చుటలేదు. అది మీ హృదయ కుహరము నుండి లేదా మీ నాభీప్రదేశమునుండి వచ్చుచున్నది. ఓంకారము నుచ్చరించుటకు ప్రయత్న మక్కరలేదు. లోపలగాని, బయటగాని యెట్టి శ్రమయు నక్కరలేకయే దాని నుచ్చరింపబోలును. అది సామాన్యముగ నప్రయత్నముగ తనంతట తానే వెడలును. కావుననే పిల్లలు ఉల్లాసముగనుండు నపుడు దాని నుచ్చరించుటను మనము గాంచు చున్నాము. జబ్బుచే బాధనొందువారు సహితము దానివలన కొంత బాధ శాంతించుటచే ఎరుంగకయే యద్దాని నుచ్చరించు చున్నారు. ఆ యుచ్చారణ మాత్రము సరిగా ఓంకారము కాకపోవ చ్చును, కాని కొంత మార్పుతో నది ఓంకారమునే పోలియుండును.

సమస్తమును మరచి ప్రణవాక్షరమును ధ్యానించువారు శీఘ్రముగా బ్రహ్మసాక్షాత్కారము నొందెదరని భగవద్గీత యందు శ్రీకృష్ణభగవానులు ఆనతిచ్చి యున్నారు. మరియును ఓంకారమును ధ్యానించుచు దేహమును విడచువారు పునరావృత్తి రహితమగు మహోన్నతపదవి నొందెదరని యా గ్రంథమునందే పలుసారులు చెప్పబడి యున్నది.

ఓమ్ అనవలయునా, ఆ ఉమ్ అనవలయునా యని పలువురు ప్రశ్నించెదరు. ఈ రెండును ఒక్కటియే. అ, ఉ లను కలిపి యుచ్చరించునపుడు సంస్కృత వ్యాకరణ సూత్రము ననుసరించి ఆ రెండక్షరములును ఏకమై ఓ అగును. ఆ కారణముచే ఉమ్ అనుటకు బదులు ఓమ్ అనియే తరుచు వ్రాయుదురు. అకార ఉకార మకారములను వేర్వేరుగ నుచ్చరించుట వలన ఈ మూడక్షరములును సమస్త శబ్ద ప్రపంచమును ఏ విధమున ఆక్రమించుచున్నవో గమనిం చిన మీరు ఆశ్చర్యము నందెదరు. ఎట్లు అనగా అకారము శబ్దోత్పత్తికి మూలస్థానమగు నాలుక యొక్క మొదలు నుండి ప్రారంభింప బడుచున్నది. ఉకారము తాలువకు సమీపముననుండు నాలుక యొక్క మధ్య ప్రదేశమునుండి వెడలుచున్నది. మకారము నాలుక చివర నుండి వచ్చు చున్నది. ఈ విధముగా ఓంకారమందలి అకార ఉకార మకారములు శబ్ద ప్రపంచమునంతను ఆక్రమించుకొని యున్నవి.

అందుచే ఓంకార మహామంత్రము నుచ్చరించువారు ప్రపం చము నందలి సమస్త గ్రంథములను, వేదములను చదివిన వాడ గుసు. ఓంకారము అఖిల మంత్రములకు జీవంబును, పరమధ్యేయం బును అగుటచే ముందు గాని వెనుకగాని ఈ అక్షరమును జేర్చక, యే మంత్రమును సిద్ధింపదని శాస్త్రమందు స్పష్టముగా జెప్పబడి యున్నది.

ఓంకారము వేదములకు మాత్రమేగాక సృష్టియందలి ప్రతి పదార్థము నకును ఆదిమధ్యావసానమై యున్నది. పవిత్ర గ్రంథము లగు వేదములు ఓంకారముతో నారంభమై, ఓంకారముతో పరిసమాప్తి జెందుచున్నవి. సమస్త రూపములకును, నామములకును ఓంకారము ప్రాణమును, ఆత్మయును అగుటచే యే మంత్రముగాని, యే కర్మగాని, యే యారాధనగాని యేదో విధమున ఓంకారముతో సంబం ధము గలిగియుండకమానదు. ఓంకారము లేని ప్రతి పూజయు, ధ్యానమును నిర్జీవమగు కళేబరమును బోలియుండును.

ఈ ఓంకారమన నేమియో యిపుడు తెలిసికొనుట మిక్కిలి యవసరమై యున్నది. సమస్త గ్రంథములయందును సకల పండితుల వలనను అకార, ఉకార, మకారములు ఈ దిగువ నుదహరించిన విధమున అవస్థాత్రయము తోడనో లేదా భావనాత్రయముతోడనో పోల్చబడి యున్నవి.

| అ | ఉ | మ |
|---|---|---|
| బహ్మ | విష్ణు | మహేశ్వరుడు |
| తండ్రి | కుమారుడు | పరిశుద్ధాత్మ |
| భూత | భవిష్యత్ | వర్తమానము |
| జాగ్రత్ | స్వప్న | సుషుప్త్యవస్థ |
| శరీరము | మనసు | ఆత్మ |
| సత్వ | రజః | తమోగుణము |
| ప్రాణము | తేజము | ప్రేమ |
| స్థూల | సూక్ష్మ | కారణశరీరము |
| సర్వాంతర్యామిత్వము | సర్వశక్తిత్వము | సర్వజ్ఞత్వము |

ఈవిధమున కొద్దిగా యోచించుటచే పై పట్టికకు ఇంకను ప్రకృతి సంబంధమగు అనేక భావనాత్రయములను జేర్చ గలుగు దుము.

దైవమునకు, నోరులేని జీవులచేత సహిత ముచ్చరింపదగి సులభమును, సార్వజనికమును అగు నామమేదియైన నుండి యున్నచో నది తప్పక ఓంకారమై యుండవలెను. అది బాలురచేతను, రోగులచేతను గూడ లేశమైన ప్రయత్నము లేకయే యుచ్చరింపదగిన అతి మధురాక్షరమై యున్నది. ఓంకారము కేవలాక్షర మెంతమాత్ర మునుగాక దేవుని నామమై యున్నది. అది దేవుని యొక్క సువ్యక్త మును మధురమును అగు నామము. నామము మూలముననే మీరు దేవుని తెలియగలరు. మంత్రాక్షరమగు ఓంకారము నెరింగిన, దేవుని మాయను సహజముగ మీరు తెలియగలరు. ఏలనన ఆ మంత్రాక్ష రము మంత్రాత్మకమగు దైవము యొక్క సన్నిధికి మిమ్ములను గొని పోవును.

పైని ఉదహరించిన భావనాత్రయమనుండి యొక దాని గొని అకార ఉకార

మకారము లెటుల మన జీవితమునందలి ప్రతి యంతరమును ఆక్రమించుకొని యున్నవో చూతము. పైని పేర్కొనిన రీతిని అకారము స్థూల ప్రపంచ భావనాయుతమగు జాగ్రదవస్థను సూచించుచున్నది. ఉకారము ఊహా ప్రపంచముతో సంబంధించిన స్వప్నావస్థను సూచించు చున్నది. మకారము కేవలాజ్ఞాన ప్రపంచమగు గాఢ సుషుప్త్యవస్థను సూచించుచున్నవి.

జాగ్రత్ స్వప్న సుషుప్త్యవస్థల కతీతమగు తురీయావస్థను గురించి మనము ముఖ్యముగా గమనించవలసియున్నది.

ఈ తురీయావస్థ ఓంకారముచే నెట్లు సూచింపబడుచున్నది? ఓంకారము నుచ్చరించుటచేత నేర్పడు ప్రణవనాదము మనలను నాల్గవదియగు తురీయావస్థకు గొంపోవును. దీనిని మౌనయుతముగ ధ్యానించవలెను. కావున మీరు ఓంకారము నుచ్చరించునపుడు అకార ఉకార మకారముల మూలమున జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలు మూటిని గడచి పోయెదరు. గాన ప్రతియుచ్చారణకును చివరను మౌనముదాల్చి నాలుగవ యవస్థలో చేరి అద్భుతానుభవమును గురుతింపుడు. ఓంకారము నుచ్చరించుటచే నేర్పడు నాదము, శాంతి సౌధమునకు లేదా సమాధిస్థితికి గొంపోవును. అయ్యది భగవదనుగ్రహమున మౌనయుతమగు ధ్యానమువలన గ్రహింప దగిన యొకానొక స్థితి.

ఓంకారము సామాన్యాక్షరముగాక మంత్రాక్షరమై యున్నది. దాని యందు అద్భుతశక్తి యిమిడియున్నది. ప్రాణదాయకమును ఆత్మ ప్రబోధకమును అగు నక్షరమది యొక్కటియే. దాని సంపూర్ణ ఫలమును పొందగోరిన నద్దాని యర్థమును గ్రహించుచు నుచ్చరించుటయేగాక లోపలను బయటను జక్కగా బ్రహ్మము ననుభవించుచు స్వరయుతంబుగ నుచ్చరింపవలెను.

ఓంకారము నుచ్చరించునపుడు జాగ్రతతో పరిశీలించిన నది మీ నాభీ ప్రదేశమునుండి వచ్చుటను గ్రహించెదరు. అది మీయందలి పరమాణవుల నుండి వెడలుచు మీ ప్రాణమునుండి యెన్నటికిని వేరుపరుపరాని శబ్దమై యున్నది. మిక్కిలి యాశ్చర్యమగు విషయమేమన మీరు నమ్మినను నమ్మకున్నను, మీరెరిగియున్నను ఎరుంగకున్నను, ఓంకారము మీయందు సదా పలుకుచునే యున్నది. మీయందేగాక ప్రతిమానవునందును ఈ ప్రపంచ మందలి ప్రతి ప్రాణియందును ఓంకారము పలుకుచున్నది. మీరు పరిశీలించుచో మీ ప్రతిశ్వాసయందును 'సోహం' రాత్రింబవళ్ళు పనిచేయుచున్నది. 'సోహం' నందలి హల్లులు స్థూల ప్రపంచమును, అచ్చులు ఆత్మను లేక సత్ పదార్థమును సూచించును. హల్లులను తీసివేసినచో ఓంకారము మీ ప్రతిశ్వాసయందును మీకు తెలియకయే యెడతెరపి లేకుండ ఈ రీతిని పలుకుచున్నది. సత్ పదార్థమును నేనే. నేనే దైవము. జగత్ప్రాణుడను నేనే. నేను అద్వితీయుడను. నేనే సమస్త ప్రాణికోట్ల హృదయముల యందును, సృష్టి యందెల్లడలను, సర్వాంతర్యామిగ నున్నాను.

నీరీక్షింపుడు! గురుతించి మౌనము వహించుడు! ఓమ్ ! ఓమ్! ఓమ్! ఇంతదనుక ఈ సందేశము యొక్క సారాంశమేమన ఓంకారము భగవత్సంబంధమగు శక్తియనియు,

సర్వాంతర్యామియనియు, ఆ కారణమున అదియొక వ్యక్తికిగాని యొక మతమునకుగాని సంబంధించినది కాదు, అని ఏర్పడినది. అది భగవంతుని యావత్ సంతతియొక్కయు సమస్త మానవకోటి యొక్కయు సాముదాయక సత్త్వమైయున్నది. మనకు తెలిసియు తెలియకను గూడ ఓంకారము మన తలంపుల యందును మాటల యందును క్రియలయందును వ్యక్తమగుచున్నది. దాని యొక్క సంపూర్ణ మహిమను వ్యక్తతతో గ్రహించి ప్రతిఘడియయు మన శ్రేయస్సు కొరకును జగత్కల్యాణము కొరకును ఓంకారముతోడ మనము ఐక్యభావమును పొందినపుడు అపారమగు శాంతియును శాశ్వత పదవియును అనంతశక్తియును మనకు చేకూరును.

నేనీ సందేశమును ముగింపక మునుపు రామతీర్థస్వాములవారి గ్రంథమునందును, భాగవతమునందును ఉదహరింపబడిన యొకానొక దృష్టాంతరమును సందర్భానుసారముగా చేర్చనిచ్ఛగించు చున్నాను. అది యెద్దియన, కాళింగమర్దనము లేక సర్పమును బరిమార్చుటయై యున్నది. శ్రీకృష్ణావతార కాలమునందు ఒక కొలనునందొక పాము ఉండెను. దాని విషముచే ఆ మడుగు చెంతకు బోవు ప్రతివారును, మృగములును, పక్షులును సహా, తక్షణము మృతినొందుచుండెను. శ్రీకృష్ణుడు ఆ మడుగునందు దుమికి వేయి పడగలు గల ఆ సర్పము శిరంబుపై నిలచి పిల్లన గ్రోవిపై ప్రణవ నాదమును గావింపుచు నృత్యము గావింప నారంభించెను. ఆ సర్పము యొక్క పడగలన్నియును పూర్తిగా నలిగిపోవువరకును ప్రణవ నాదమును ఆతడు చాలించలేదు. ఈ విధమున నాతడు సంపూర్ణ విజయముతో ఆ మడుగునుండి నిర్గమించి మానవకోటికంతకును మహోపకారియై విలసిల్లెను.

ఈ విషసర్పము మన మనసుకంటె భిన్నముకాదు. మనయొక్క లెక్కలేని కోరికలను, వ్యసనములును, మత్సరము, కార్పణ్యము, అసహనము, క్రోధము, దుఃఖము, మదము, దర్పము, స్వార్థపరత మొదలగు దుర్వృత్తు లెల్లను ఆ సర్పము యొక్క వేయిపడగలై యున్నవి. విషసరోవరము నందలి జలమువలె నివి మనచెంతకేతెంచు వారలకెల్లను హాని గావించుచున్నవి. కావున కృష్ణుడు గావించిన విధమున మనమెల్లరమును మన యంతరంగ మనెడు సరస్సున దుమికి ప్రణవనాదము గావించుచు మన దుర్వృత్తుల నెల్లను ఒకదాని వెనుక నొకదానిని నశింపచేయుటకు మంచియదను చేకూరినది.

మన మెంత త్రొక్కిన నవి యంతవృద్ధిగాంచును. అయినను ఎడతెగని అభ్యాసమువలన శ్రీకృష్ణునివలె మనమును జయము నొందగలము. ఏలనన తనయడుగులజాడ ననుసరింప, అతడు మనకెల్లరకును మార్గదర్శి యాయెను.

ఇది వినోదార్థమగు సామాన్యకథగాక సత్పురుషుల సహవాసము వలనను ప్రణవోచ్చారణ వలనను దుష్టస్వభావమును దుర్వృత్తులను పోనాడి సత్ శీలము నలవరచుకొన ననువగు నట్టి ఆచరణ యోగ్యమైన అభ్యాసమై యున్నది. మనదేహములు వేణువులనియు వీని నుండి మన వ్యసనములను, నాది నీదియను భావములను వెడల ద్రోయు నెడల ఆ ప్రభువే మన శరీరములను వేణువులపైని శాంతి, సామరస్య, ఆశీర్వాద గీతములను మ్రోగించునని తలంచుట ఆత్మోద్ధారకమగు భావనయై యున్నది.

మీయెల్లర యెడలను నాకుగల ప్రేమాతి రేకంబున ఈ సందేశము యొక్క

ప్రధానాభ్యాసధ్యాన భాగమగు ఓంకారము గూర్చి నాకు గల ఆశయములను మీకు తెలుపగోరుచున్నాను.

## ధ్యానము

ఈ పుస్తకము యొక్క ముఖపత్రమందు సంస్కృత ఓంకారము యొక్క చిత్రమును మీరు గాంచెదరు. ఏకాగ్ర చిత్తముతో దానిని జూడుడు. స్వయం ప్రకాశమగు దాని కాంతిని కాంతివంతమగు దానియొక్క యనంత కిరణములను గమనింపుడు. ఆ వెనుక కన్నులను మూసికొని ఓంకారము మీ వెలుపల నున్నట్లిక నెంత మాత్రమును తలంపక అది మీయందే యన్నట్లును మీరే ఆ ఓంకారమై యున్నట్లును శిరము మొదలు పాదము వరకు మీరే ఆ ఓంకారము యొక్క ఆకృతియై యున్నట్లును భావింపుడు.

ఆ మధ్యరేఖ మీ మధ్యభాగమందలి నాభి గుండా పోవునట్లును క్రింది రేఖ మీ శరీరమునందలి యడుగు భాగము గుండా పోవునట్లును పై రేఖ మీశిరంబువైపునకు పోవునట్లును భావింపుడు. మీ శిరము యొక్క పై భాగమున నుండు నెలవంకకెరమగు రేఖనుగాంచుడు. ఆ చంద్రరేఖ యందు సూర్యనకు సూర్యుడగు పరంజ్యోతి సంపూర్ణ ప్రకాశముతో వెలుగొందు చుండును. ఈ విధమున ఓంకారముతో నైక్యభావముదాల్చి దానిచే సూచింపబడు ప్రాణమును తేజమును ప్రేమను ధ్యానింపుడు.

ఈ విధమున మీరు ఓంకారముతో నైక్యభావమును జెంది మొదట మీ యావత్ శక్తిని వినియోగపరచి బిగ్గరగా నుచ్చరింపుడు. అంతరంగమున గాఢవిలీనత నొందగనే పెదవులనుజేర్చి ప్రణవ నాదంబును గావింపుడు. చివరకు దాని మహా మహిమంబు అనుభ వింపుచు నిశ్శబ్దముగ మానసంబున దాని నుచ్చరింపుడు.

మీరు ఊపిరిని పీల్చునపుడు ప్రణవాత్మకమగు సూర్యుని కిరణముల నన్నిటిని లోనికి తీసికొని ఊపిరిని విడుచునపుడు తేజో కిరణములను బయటికి విడచి ప్రపంచమంతటను వ్యాపింప జేయు చున్నారు. ఇది యెంత యాశ్చర్యకరమగు భావన ! ఈ విధమున ధ్యానము నభ్యసింపుడు. ముఖ్యముగా సూర్యోదయమందును సూర్యాస్తమయ మందు సూర్యునకభిముఖ ముగ నుండి ధ్యానింపుడు. సంధ్యాకాలమున మీరు గాఢధ్యానాసక్తులగునపుడు కిరణములు సూర్యునియందు లీనమగునపుడు, మీ యందున ప్రపంచముగూడ లీనము జెందనిండు.

## ఉన్నతమగు ధ్యానము

శిరోగ్రమునందుగల సర్వతోముఖ తేజోవిరాజితమగు సహస్రదళ పద్మాకృతిగల సహస్రార చక్రమునందలి మధ్య ప్రదేశం బును ధ్యానింపుడు. ఇది ప్రణవోచ్చారణము లేదా ప్రణవనాదమునకు ఉనికి పట్టు, దీని యందు యుఛ్వాస నిశ్వాసములుండవు. దివ్య తేజోవిరాజితమగు నీ యున్నత చక్ర మందు అభ్యాసారంభమునందు అతిసూక్ష్మమగు స్పందము అప్పుడప్పుడు కలుగును. ఇంకను గాఢధ్యానమునందు లీనము జెందుదురేని ఈ చలనము తొలగి మీరు ఆ తత్ పదార్థముకంటె వేరుగాక యుందురు. అనంతమును, శాశ్వతమును, కోటిసూర్య ప్రభాభాసితంబును,దురవగాహంబును, అగు బీజాక్షర ప్రధానమై చెన్నొందు ఓంకారము యొక్క మహిమంబిట్టిదై యున్నది.

ఓమ్ ! ఓమ్ ! ఓమ్ !

సృష్ట్యాదిని మంత్రముండెను. ఆ మంత్రము దైవాధీనమై యుండెను. మరియు నా మంత్రమే దైవమాయెను.

ప్రియమగు సోదరులారా ! మీరు ఆ మంత్రము యగుడు. మరియు నా మంత్రమే దైవమగు రీతిని మీరును దైవభావము నొందుడు.

విశేషించి మీరెల్లరును ప్రణము యొక్క దివ్యతేజః పుంజములై విరాజిల్లెదరుగాక యని నా ప్రార్థన.

హరిః ఓమ్ తత్ సత్